మత విద్వేషాలు రెచ్చగొడుతున్న మోడీ, షాలపై ఇసి చర్యలు తీసుకోవాలి

- సిపిఎం కేంద్ర కమిటీ డిమాండ్

7

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 95 | విజయవాడ, గురువారం 7 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 7 November 2024 | Rs

సిటీ



ఐపిఎల్ వేలం బరిలో 1,574మంది ఆటగాళ్లు

సౌదీ అరేబియాలో నిర్వహణకు ఏర్పాటు 8

అమెరికా అధ్యక్ష పీఠంపై మళ్లీ ట్రంప్

కమలా హారిస్‌పై విజయం

స్వింగ్ రాష్ట్రాల్లోనూ మొగ్గు రిపబ్లికన్ పార్టీకే

ప్రపంచ నేతల అభినందనలు

వాషింగ్టన్: మంగళవారం జరిగిన అమెరికా ఎన్నికల్లో పచ్చి మితవాది డొనాల్డ్ ట్రంప్ ఆ దేశ 47 వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.. నాలుగేళ్ల విరామం తరువాత మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ద్వారా ట్రంప్ మాజీ అధ్యక్షుడు గ్రోవర్ క్లైవలాండ్ సరసన చేరారు. క్లైవలాండ్ 1885-1889 మధ్య ఒక పర్యాయం అధ్యక్షుడిగా ఉండి తరువాత ఎన్నికల్లో ఓడిపోయాడు. 1893 ఎన్నికల్లో మళ్లీ గెలిచి రెండసారి అధ్యక్షుడయ్యాడు. 248 ఏళ్ల అమెరికా చరిత్రలో అమెరికా అధ్యక్షులుగా 47 మంది ఎన్నిక కాగా, వీరిలో 46 మంది శ్వేత జాతికి చెందిన పురుషులే ఉన్నారు. తొలిసారి భారత సంతతి మూలాలున్న ఒక మహిళ కమలా హారిస అధ్యక్ష స్థానానికి పోటీ పడి ఓడిపోయారు. అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి అవసరమైన 270 ఎలక్టోరల్ ఓట్లు ట్రంప్ ఇప్పటికే 277 సాధించడంతో ఆయన విజయం ఖరారైపోయింది. ట్రంప్ ప్రధాన ప్రత్యర్థి.. డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌కు 224 ఓట్లే వచ్చాయి. సాంప్రదాయంగా రిపబ్లికన్ పార్టీకి పట్టు వుండే రాష్ట్రాల్లో విజయం సాధించడమే కాకుండా డోలాయమానంగా వుండే ఏడు రాష్ట్రాల్లో ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో ట్రంప్‌కు ఆధిక్యత లభించింది. దేశ చరిత్రలో అధ్యక్షుడిగా ఎన్నికైన అతిపెద్ద వయస్కుడు (78) కూడా ట్రంపే కావడం విశేషం. నాలుగేళ్ళ క్రితం తన ఓటమిని అంగీకరించడానికి కూడా తిరస్కరించి, న్యాయస్థానాన్ని ఆశ్రయించి గందరగోళం సృష్టించిన ట్రంప్ తాజా ఎన్నికల్లో ఎలాన్ మస్క్ వంటి బిలియనీర్లు, బడా కార్పొరేట్లు, బహుళజాతి సంస్థల దన్నుతో తిరిగి ఎన్నికల్లో నెగ్గుకొచ్చారు. . విస్కాన్సిన్‌లో గెలుపుతో ఆయనకు విజయానికి అవసరమైన 270ఓట్లు వచ్చేశాయి.



ఈసారి పాపులర్ ఓటు కూడా ట్రంప్‌కే లభించింది. ట్రంప్‌కు 51శాతం ఓట్లు రాగా, హారిస్‌కు 47.5శాతం ఓట్లు లభించాయి. ద్రవ్యోల్బణం, వేతనాలు, అక్రమ చొరబాట్లు వంటి అంశాలు ఈ ఎన్నికల్లో తీవ్ర ప్రభావాన్ని కనబరిచాయి. అయితే ట్రంప్ వాటిని పక్కదారి పట్టించేందుకు వలసవాదులే దీనికంతటికీ కారణమన్నట్లుగా చూపించాడు. సరిహద్దుల్లో భద్రత, మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్), అమెరికా ఫస్ట్ వంటి నినాదాలతో జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టి ఓటర్లను తన వైపు తిప్పుకున్నాడు. . ఓహియో రాష్ట్ర మిగతా 7లో

మోడీ అభినందనలు

'కంగ్రాట్స్ మై ఫ్రెండ్' అంటూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ట్రంప్‌ను అభినందించారు. చారిత్రక విజయం సాధించిన ట్రంప్‌కు అభినందనలు, భవిష్యత్తులో భారత్, అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కలిసి పనిచేద్దామని మోడీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, సుస్థిరతలకు కలిసి కృషి చేద్దామన్నారు.

ప్రత్యేక హోదా పునరుద్ధరించండి

- జమ్మూకాశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం ఆమోదం
- రచ్చకు బిజెపి యత్నం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని కోరుతూ జమ్మూకాశ్మీర్ శాసనసభ బుధవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. బిజెపి శాసన సభ్యులు దీనిని వ్యతిరేకించారు. అసెంబ్లీలో రచ్చకు యత్నించారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోరుతూ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు, ఉప ముఖ్యమంత్రి సురీందర్ కుమార్ చౌదరి శాసనసభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ ఆర్టికల్ 370 హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా పునురుద్ధరించాలని ఈ సభ కోరుతోంది అన్నారు. జమ్మూకాశ్మీర్ ప్రజల గుర్తింపు, సంస్కృతి, హక్కులను పరిరక్షణకు ఇది అవసరం, దీనిని కేంద్రం గతంలో ఏకపక్షంగా తొలగించడంపై ఈ సభ ఆందోళన వ్యక్తం చేస్తోంది' అని ఆ తీర్మానంలో తెలియ జేశారు. ప్రత్యేక హోదా, రాజ్యాంగ గ్యారంటీల పునరుద్ధరణ కోసం జమ్మూకాశ్మీర్ ప్రజా ప్రతినిధులతో సంప్రదింపులు ప్రారంభించాలని, రాజ్యాంగ వ్యవస్థలపై దృష్టి సారించాలని ఆ తీర్మానంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు చేపట్టే ఏ ప్రక్రియ అయినా దేశ ఐక్యతను, జమ్మూకాశ్మీర్ ప్రజల చట్టబద్ధమైన ఆకాంక్షలను పరిరక్షించాలని తెలిపారు. ఈ తీర్మానాన్ని ఎన్‌సి నాయకులు, ఆరోగ్య మంత్రి సకీనా టూ బలపర్చారు. స్పీకర్ అబ్దుల్ రహీమ్ రాథర్ ఈ తీర్మానాన్ని ఓటింగ్ కోసం ఉంచారు. మెజార్టీ సభ్యులు దీన్ని ఆమోదించారు. ఎన్‌సితోపాటు, పిడిపి, ఎఐపి, జమ్ముకాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ చీఫ్ సజాద్ లోన్, స్వతంత్ర సభ్యులు షబీర్ కుల్లాయ్ తీర్మానికి మద్దతు పలికారు. అయితే ఈ తీర్మానంపై బిజెపి ఎమ్మెల్యేలు రెచ్చిపోయారు. సభ ఆమోదించినా తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో సభను స్పీకర్ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన తరువాత కూడా బిజెపి సభ్యులు గలభా సృష్టించడంతో సభను రేపటికి వాయిదా వేశారు. జమ్మూకాశ్మీర్ శాసనసభకు పదేళ్ల విరామం తర్వాత ఇటీవలే ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలు తర్వాత అసెంబ్లీ సమావేశం కావడం ఇదే మొదటిసారి.



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

భూ కబ్జాలకు పాల్పడితే కఠిన శిక్షలు

- ముసాయిదా బిల్లుకు క్యాబినెట్ ఆమోదం
- సిఆర్‌డిఎ 8,352 చదరపు కిలోమీటర్లకు పునరుద్దరణ
- పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు
- కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పురుద్దరణ
- డ్రోన్ విధానానికి ఓకే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భూ కబ్జాలకు పాల్పడే వారికి ఇకపై కఠిన శిక్షలు పడనున్నాయి. ఈ మేరకు రూపొందించిన ఎపి ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ బిల్లుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం 1982 నాటి చట్టాన్ని రద్దు చేసి ,దాని స్థానంలో నూతన బిల్లును తీసుకురావాలన్న ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. భూ కబ్జాలకు పాల్పడే వారికి 10నుంచి 14 సంవత్సరాల జైలు శిక్ష తో పాటు కబ్జా చేసిన స్థలం విలువతో పాటు నష్టపరిహారాన్ని వసూలు చేసేలా నూతన బిల్లును రూపొందించినట్లు తెలిపారు. దీంతో పాటు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ-సిఆర్‌డిఎ) పరిధిని పూర్వస్థాయికి తీసుకురావాలన్న ప్రతిపాదనను కూడా క్యాబినెట్ ఆమోదించినట్లు మంత్రి చెప్పారు. తొలుత సిఆర్‌డిఎ పరిధిని 8,352 కి.మీగా తెలుగుదేశం ప్రభుత్వం మిగతా 2లో

మరిన్ని నిర్ణయాలు

- 2014-19 మధ్య కాలంలో జరిగిన 4.45లక్షల అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.331కోట్లు చెల్లింపు. వడ్డీ చెల్లించాలన్న డిమాండ్ పరిశీలన.
- ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ మొత్తం ఇకపై కళాశాల యాజమాన్యాల అకౌంట్లలో జమ
- 50 ఎకరాల భూముల వరకు ఎపిఐఐసి కేటాయించే విధానం పునరుద్ధరణ

అమిత్ షాతో పవన్ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చర్చించారు. ఈ మేరకు బుధవారం అమిత్ షా నివాసంలో ఆయనతో పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఐదు నెలలు కావస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. లడ్డూ వివాదంతో మొదలైన రచ్చ, సనాతన ధర్మ పరిరక్షణ వరకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు జోక్యంతో తాత్కాలికంగా ఈ అంశం సర్దుమణిగింది. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్న నేపథ్యంలో పవన్‌కల్యాణ్ పిఠాపురం పర్యటనలో చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో సంచలనమయ్యాయి. ఇప్పటి వరకు ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి, కానీ పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలతో కూటమిలో ఉన్న వారి నుంచే రాష్ట్రంలోని శాంతి భద్రతలపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి ఈ అంశాలపై పవన్‌కల్యాణ్ చర్చించినట్లు తెలిసింది. తొలుత గన్నవరం నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న పవన్‌కల్యాణ్ అక్కడ నుంచి నేరుగా ఎపి భవన్‌కు చేరుకున్నారు. అక్కడ కొద్ది సేపు ఉన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తాను డిప్యూటీ సిఎం అయిన తరువాత తొలిసారి కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలుస్తున్నానని, ఇది మర్యాదపూర్వక భేటీ అని అన్నారు. అనంతరం అక్కడ నుండి అమిత్ షా నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు భేటీ అనంతరం అక్కడ నుంచి నేరుగా ఢిల్లీ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. అక్కడ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు.



అమిత్‌షాకు జ్ఞాపిక అందజేస్తున్న పవన్‌కల్యాణ్



డిఎస్‌సి నోటిఫికేషన్ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్‌సి నోటిఫికేషన్ వాయిదా పడింది. 16,347 పోస్టుల భర్తీకి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. పోస్టుల రిజర్వేషన్‌కు సంబంధించి ప్రక్రియ పూర్తికాకపోవడంతో నిలిచినట్లు సమాచారం. ఎస్‌సి వర్గీకరణ చేసుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఎస్‌సి వర్గీకరణ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మాదిగ పోరాట రిజర్వేషన్ సమితి వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ కలిసి.. ఎస్‌సి వర్గీకరణ చేసి డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరినట్లు తెలిసింది. ఈ అంశంపై విద్యాశాఖతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సిఎం భావిస్తున్నట్లు సమాచారం.

సంయమనం పాటించండి

- 'బహిరంగ' వ్యాఖ్యలపై క్యాబినెట్‌లో బాబు
- నెల రోజుల్లో పోలీస్ వ్యవస్థ ప్రక్షాళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బాధ్యత గల పదవుల్లో ఉన్న వ్యక్తులు బహిరంగ సభల్లో వ్యాఖ్యలు చేసే సమయంలో సంయమనం పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించినట్లు తెలిసింది. మంత్రివర్గ సమావేశం ఆయన అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో బుధవారం జరిగింది. ఈ సమావేశం అజెండా ముగిసి, అధికారులు వెళ్లిపోయిన తరువాత రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలపై మంత్రులతో చంద్రబాబు మాట్లాడుతూ ఈ సూచన చేసినట్లు తెలిసింది. పీఠాపురం పర్యటనలో రెండు రోజులు క్రితం జరిగన సభలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ శాంతి భద్రతలపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ పేరుగాని, ఆయన చేసిన వ్యాఖ్యలు గాని సిఎం ప్రస్తావించలేదని, అయితే పరోక్షంగా సూచించినట్లు తెలిసింది. బహిరంగ సభల్లో వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలు చేసేటప్పుడు కొంత సంయమనంతో వ్యవహరించాలని, లేని పక్షంలో సమాజానికి తప్పుడు సంకేతాలు వెడతాయని ఆయన అన్నట్లు సమాచారం. మరీ సీరియస్ విషయమైతే క్యాబినెట్‌లో చర్చించవచ్చని, లేని పక్షంలో పేషీల్లో కూడా మాట్లాడుకోవచ్చని బాబు సూచించినట్లు తెలిసింది. ఏ సందర్భంలో తాను ఘాటైన వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందన్న విషయాన్ని పవన్ కల్యాణ్ మంత్రివర్గంలో వివరించినట్లు సమాచారం. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టేవారిపై తీసుకోవాల్సిన చర్యలు , వైసిపి ప్రభుత్వంలో అంటకాగిన పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో వ్యవహరిస్తున్న తీరుపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది.

ఈ సందర్భంగా నెల రోజుల్లో పోలీస్ వ్యవస్థను గాడిలో పెడదామని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం. సోషల్ మీడియాలో కుటుంబ సభ్యులు, మహిళల గురించి అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెడుతున్న వారి పట్ల ఉదాసీనత పనికిరాదని, వారి పట్ల కఠినంగా వ్యవహరించాల్సిందేనంటూ పవన్‌కల్యాణ్ అన్నట్లు తెలిసింది, గత ప్రభుత్వంలో అంటకాగిన పోలీస్ అధికారులు, డిఎస్‌పి,సిఐ, ఎస్‌ఐలు నేటికీ నిబంధనలకు అనుగుణంగా కాకుండా వైసిపి నేతల కనుసన్నల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారని ఒకరిద్దరు మంత్రులు సిఎం దృష్టికి తీసుకొచినట్లు తెలిసింది. ఒకటి రెండు ప్రాంతాల్లో వైసిపితో నేటికీ సత్సంబంధాలు కొనసాగిస్తున్న ఐపిఎస్ అధికారులు స్వయంగా తాము ఫోన్ చేసినా స్పందించడం లేదని సిఎం దృష్టికి తీసుకువెళ్లారు. పులివెందులకు చెందిన వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్ట్ రవీంద్రరెడ్డి చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేష్, వైఎస్ షర్మిళ, వైఎస్ విజయమ్మలపై అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టడం నేటికీ కొనసాగిస్తున్నాడని, కడపపోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని పులివెందుల నుంచి కడపకు తరలించిన అనంతరం 41ఎ నోటీస్ ఇచ్చి వదిలేయడాన్ని సిఎం దృష్టికి మంత్రులు తీసుకువచ్చినట్లు తెలిసింది.

దీంతో చంద్రబాబు అక్కడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉంటే రుషికొండపై చంద్రబాబు పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన 45 ఏళ్ల జీవితంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన అంతటి విలాసవంతమైన భవనాన్ని(ఇంద్రభవనం) చూడలేదని చెబుతూ ప్రజాధనం ఎలా దుర్వినియోగమైందనే విషయాన్ని సిఎం మంత్రులకు వివరించినట్లు తెలిసింది. ఆ భవనాలను ఇళ్లు లేని పేదలకు చూపించి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ నిధులు దుర్వినియోగంచేసి ఎంత విలాస వంతమైన భవనాలు నిర్మించుకున్నారో ప్రజలకు అర్థమయ్యే విధంగా వ్యవహరిస్తే బాగుంటుందని టూరిజం శాఖమంత్రి కందుల దుర్గేష్ సూచించినట్లు సమాచారం. త్వరలో రుషికొండపై ఒక నిర్ణయం తీసుకుందామని చంద్రబాబునాయుడు చెప్పినట్లు తెలిసింది.



రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాకు మద్దతుగా కూర్చొన్న ఎమ్మెల్సీ ఐవి

దద్దరిల్లిన కలెక్టరేట్లు

7

విద్యారంగ సమస్యలపై ఉద్యమించిన విద్యార్థులు



అనంతపురంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులతోపాటు పలువురిని అరెస్టు చేస్తున్న పోలీసులు

టిటిడి చైర్మన్‌గా బిఆర్ నాయుడు ప్రమాణం 2

'పిఎం విద్యా లక్ష్మి'కి ఆమోదం
- ఎఫ్‌సిఐ మూలధన పెట్టుబడి కోసం రూ.10,700 కోట్ల ఈక్విటీ
- కేంద్ర మంత్రి వర్గ నిర్ణయాలు

7

అజ్ఞాతంలోకి రవీందర్‌రెడ్డి?
- 41 (ఎ) నోటీసులిచ్చిన విడిచిపెట్టిన పోలీసులు
- రాష్ట్ర ప్రభుత్వం సీరియస్
- కడప ఎస్‌పిపై బదిలీ వేటు, సిఐ సస్పెన్షన్

2



కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో యురేనియం అన్వేషణకు తవ్విన గోతిని చూస్తున్న ఎంఎ గఫూర్, రామకృష్ణ, తదితరులు

ఐక్యంగా పోరాడండి

- అండగా ఉంటాం
- యురేనియం తవ్వకాలపై వామపక్ష నేతలు
- కప్పట్రాళ్లలో పర్యటన
- అవసరమైతే జిల్లా బంద్‌కు పిలుపు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి/దేవనకొండ

యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల ప్రాంత ప్రజానీకానికి వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. యురేనియం తవ్వకాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆ ప్రాంతంలో వామపక్ష పార్టీల నేతలు బుధవారం పర్యటించారు. కొద్దిరోజులుగా ఆందోళనలు చేస్తున్న ప్రజలతో మాట్లాడారు. యురేనియం అన్వేషణలో భాగంగా రిజర్వు మిగతా 7లో

ఆమ్రపాలి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పర్యాటకశాఖ ఎమ్‌డిగా ఆమ్రపాలి బాధ్యతలు తీసుకున్నారు. విజయవాడలోని ఆటోనగర్‌లో ఉన్న పర్యాటకశాఖ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కేడర్‌కు చెందిన ఆమ్రపాలి ఇప్పటి వరకు తెలంగాణలో పనిచేశారు. రాష్ట్రానికి వెళ్లాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) ఇటీవల ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే.

భద్రత తొలగింపుపై పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి
తన భద్రత తొలగింపు అన్యాయమంటూ స్టేట్ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చింతా విజయ్ ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. విధి నిర్వహణలో భాగంగా రాష్ట్రంలో పర్యటిస్తామని, బలవంతులైన వ్యక్తుల వ్యవహారాలను పర్యవేక్షిస్తామని, కాబట్టి తన భద్రతను తిరిగి ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఫుడ్ కమిషన్ ఛైర్మన్‌కు 2ప్లస్2 భద్రతతోపాటు ఎస్కార్ట్ ఉండాలని, 2017లో మెమోకు విరుద్ధంగా ప్రభుత్వ చర్య ఉందన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎంపి విజయసాయి రెడ్డి విదేశీ పర్యటనకు అనుమతివ్వొద్దు

- సిబిఐ కోర్టులో సిబిఐ వాదనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
వైసిపి రాజ్యసభ సభ్యులు, జగన్ అక్రమాస్తుల కేసులో నిందితుడు విజయసాయిరెడ్డి విదేశీ పర్యటనకు అనుమతివ్వొద్దని సిబిఐ న్యాయస్థానంలో సిబిఐ వాదనలు వినిపించింది. బెయిల్ షరతులు సడలించి నవంబర్ 15 నుంచి 30 వరకు తాను అమెరికా వెళ్లేందుకు అనుమతి మంజూరు చేయాల్సిందిగా విజయసాయిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను నాంపల్లిలోని సిబిఐ న్యాయస్థానం బుధవారం విచారించింది. జగన్ అక్రమాస్తుల కేసులో విజయసాయిరెడ్డి కీలక నిందితుడిగా ఉన్నారని, కేసులు ట్రయల్ సమయంలో విదేశీ పర్యటనలకు అనుమతులు ఇవ్వొద్దని సిబిఐ తరుపు న్యాయవాది కోర్టును కోరారు. గతంలో విదేశీ పర్యటనకు ట్రయల్ కోర్టు అనుమతించిందని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. విజయసాయి రెడ్డి విదేశీ పర్యటనతో కేసుల ట్రయల్‌కు వచ్చిన ఇబ్బందులు లేవని అన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి..ఈ నెల ఎనిమిది వరకు తీర్పును రిజర్వ్ చేశారు.

మేరుగ నాగార్జునపై అత్యాచార కేసు మరో మలుపు

ప్రజాశక్తి-అమరావతి
వైసిపికి చెందిన మాజీ మంత్రి మేరుగ నాగార్జునపై దాఖలైన అత్యాచార కేసు మరో మలుపు తిరిగింది. అత్యాచారం చేశారంటూ ఫిర్యాదు చేసిన బాధితురాలు స్వయంగా హైకోర్టుకు హాజరై నాగార్జునపై తాను తప్పుడు ఫిర్యాదు చేశానని చెప్పారు. పోలీసులు కేసు కొట్టివేస్తే తనకు అభ్యంతరం లేదని అఫిడవిట్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ బుధవారం విచారణ జరిపారు. ఫిర్యాదుదారు అడగ్గానే కేసును కొట్టేయలేమని చెప్పారు. తప్పుడు ఫిర్యాదు చేసినట్లు నిరూపణ అయితే ఫిర్యాదిదారుపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు ప్రజా ప్రతినిధి కాబట్టి కేసులపై విచారణ మూసివేత ఉత్తర్వులు ఇవ్వలేమన్నారు. ఫిర్యాదు చేశాక కోర్టుకు వచ్చి వాపస్ తీసుకోవడం ఇటీవల జరుగుతోందని, దీని పరిణామాలు ఎదుర్కోవాల్సిందేనని వ్యాఖ్యానించారు. కేసు డైరీ, దర్యాప్తు స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు. విచారణ ఈ నెల 12కు వాయిదా వేశారు. విజయవాడకు చెందిన ఓ మహిళ గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు నాగార్జునపై అత్యాచార కేసు నమోదైంది. ఆ కేసును కొట్టేయాలని కోరుతూ మేరుగ నారార్జున, ఆయన పిఎ మురళీమోహన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇది విచారణకు వచ్చిన సమయంలో బాధితురాలు పైవిధంగా చెప్పడంతో కేసు కీలక మలుపు తిరిగింది.

నందిగం బెయిల్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-అమరావతి
మరియమ్మ అనే మహిళ హత్య కేసు నిందితుడైన మాజీ ఎంపి నందిగం సురేష్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బెయిల్ ఇవ్వాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ విఆర్ కృపాసాగర్ కొట్టివేస్తూ బుధవారం తీర్పు చెప్పారు. గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, వెలగపూడి గ్రామానికి చెందిన మరియమ్మ రెండు వర్గాల మధ్య గొడవలో మరణించారు. ఆ ఘర్షణల వెనుక సురేష్ హస్తం ఉందని ఆమె కుమారుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు సురేష్‌ను అరెస్టు చేశారు.

అజ్ఞాతంలోకి రవీందర్‌రెడ్డి?

- 41 (ఎ) నోటీసులిచ్చిన విడిచిపెట్టిన పోలీసులు
- రాష్ట్ర ప్రభుత్వం సీరియస్
- కడప ఎస్‌పిపై బదిలీ వేటు, సిఐ సస్పెన్షన్


మాజీ సిఎం జగన్‌తో వర్రా రవీందర్‌రెడ్డి


కడప జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి
వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయనను పోలీసులు విడిచిపెట్టడంపై రాష్ట్ర ప్రభుత్వ సీరియస్ అయ్యింది. కడప ఎస్‌పిపైనా, సిఐపైనా చర్యలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్, వైఎస్.విజయమ్మ, వైఎస్.సునీత తదితర ప్రముఖులపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారంటూ రవీంద్రరెడ్డిపై ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో, చిన్నచౌకు పోలీసులు ఆయనను సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున 41 (ఎ) నోటీసులిచ్చి వదిలేశారు. అనంతరం ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సమాచారం. మరొక కేసులో రవీందర్‌రెడ్డిని అరెస్టు చేయడానికి అన్నమయ్య జిల్లా రాజంపేట పోలీసులు వచ్చారు.

అప్పటికే ఆయనను చిన్నచౌకు పోలీసులు విడిచిపెట్టారు. నిందితునిపై కడప, రాజంపేట, ప్రొద్దుటూరు, హైదరాబాద్, మంగళగిరి తదితర ప్రాంతాల్లో సుమారు 30కిపైగా కేసులు ఉన్నప్పటికీ 41 (ఎ) నోటీసులిచ్చి విడుదల చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. చిన్నచౌకు సిఐ తేజోమూర్తిని సస్పెండ్ చేసింది. కడప ఎస్‌పి హర్షవర్ధన్‌రాజును బదిలీ చేసింది. హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేసుకోవాలని ఎస్‌పిని ఆదేశించింది. కడప జిల్లా ఎస్‌పిగా అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడుకు అదనపు బాధ్యతలు అప్పగించింది. కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ కడపలో మకాం వేసి ఆరా తీసినట్లు తెలుస్తోంది. రవీందర్‌రెడ్డి కోసం కడప జిల్లా పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేములలో ఆయన స్నేహితుడు మహేశ్వరరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో రవీందర్‌రెడ్డి వ్యవహారం, చిన్నచౌకు పోలీసుల తీరుపై చర్చకు వచ్చినట్లు సమాచారం.

బోరుగడ్డకు రిమాండ్

- రాచమర్యాదలు చేసిన పోలీసులు
- ఏడుగురుపై వేటు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)
విధుల్లో ఉన్న పోలింగ్ సిబ్బందిపై దాడి చేసిన కేసులో వైసిపి నేత బోరుగడ్డ అనిల్ కుమార్‌కు మంగళగిరి న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించింది. అతణ్ని రాజమండ్రి జైలుకు తరలించే క్రమంలో పోలీసులు రాచమర్యాదలు చేసినట్లు వార్తలొచ్చాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఏడుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు వేసింది. ఆర్ఎస్ఐ, ఎస్ఐతో పాటు మరో ఐదుగురిని సస్పెండ్ చేస్తూ రేంజ్ ఐజి సర్వశ్రేష్టి త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది మార్చిలో ఫ్లయింగ్ స్క్వాడ్ విధుల్లో ఉన్న ఎన్నికల సిబ్బంది.. తుళ్లూరు నుంచి వస్తున్న బోరుగడ్డ అనిల్ వాహనాన్ని తనిఖీ నిమిత్తం ఆపారు. దీంతో ఎన్నికల సిబ్బందిపై దౌర్జన్యం చేయడంతోపాటు, ఎఎస్‌ఐపై ఆయన దాడి చేశారు. ఈ ఘటనపై పోలింగ్ సిబ్బంది ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అదే రోజు తుళ్లూరులో బిహార్‌కి చెందిన ఐదుగురిపై దాడి జరిగింది. ఈ కేసుల్లో అనిల్ కుమార్ నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే.

తిరిగి ఎమ్మెల్సీగా ఇందుకూరి రఘురాజు

ఛైర్మన్ నిర్ణయాన్ని తప్పపట్టిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి
వైసిపి నుంచి విజయనగరం స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన ఇందుకూరి రఘురాజుకు హైకోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్సీని రద్దు చేస్తూ రఘురాజుపై అనర్హతవేటు వేసిన శాసనమండలి ఛైర్మన్ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఎమ్మెల్సీగా ఆయన సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రఘురాజు వాదనలు తెలియజేసేందుకు ట్రిబ్యునల్ ఛైర్మన్ హోదాలోని శాసనమండలి ఛైర్మన్ అవకాశం ఇవ్వకపోవడాన్ని ఆక్షేపించింది. సహజ న్యాయ సూత్రాలు, చట్ట నిబంధనలకు వ్యతిరేకమని పేర్కొంది.

ఈ వివాదాన్ని ఛైర్మన్ వద్దకు తిరిగి పంపింది. రఘురాజు వాదనలు చెప్పుకునేందుకు అవకాశం ఇవ్వాలని, ట్రిబ్యునల్ నిర్ణయం ప్రకటించే వరకు రఘురాజు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తున్నట్లు కీలక ఉత్తర్వులను జస్టిస్ జి నరేందర్, జస్టిస్ టిసిడి శేఖర్‌తో కూడిన ధర్మాసనం బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో మండలిలో వైసిపి విప్ పి విక్రాంత్ ఫిర్యాదు మేరకు రఘురాజు ఎమ్మెల్సీగా అనర్హుడని మండలి ఛైర్మన్ గత జూన్ 3న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని రఘురాజు వేసిన పిటిషన్ తరపున సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ వాదించారు. పిటిషనర్ భార్య సుధ టిడిపిలో చేరిన కారణంగానే ఆ విధమైన అనర్హత వేటు వేశారన్నారు. రాష్ట్రం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ, పిటిషనర్‌కు తన వాదనలు చెప్పుకునే అవకాశం ఇవ్వలేదన్నారు. అనర్హత వేటు వేసేందుకు సరైన కారణం ఏమీ లేదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా రఘురాజుపై అనర్హత వేటు వేసినట్లు కనబడుతోందని అభిప్రాయపడింది. భార్య చర్యలను పిటిషనర్ ఖండించలేదని చెప్పి అనర్హత వేటు వేయడం కూడా సరికాదంది. ఎమ్మెల్సీగా రఘురాజు సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అల్లు అర్జున్‌పై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-అమరావతి
సినీ హీరో అల్లు అర్జున్, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిపై నంద్యాల పోలీసులు నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టేసింది. పోలీసులు యాంత్రికంగా కేసు నమోదు చేశారని తప్పుపట్టింది. వారిపై ఎఫ్ఐఆర్ కొనసాగింపు చట్ట వ్యతిరేకం అవుతుందని చెప్పింది. అందుకే ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరిస్తున్నట్లు విఆర్‌కె కృపాసాగర్ బుధవారం చెప్పారు. అర్జున్ తన స్నేహితుడు రవిచంద్ర ఇంటికి వెళ్లడం వ్యక్తిగత విషయమని, ఆ సమయంలో అక్కడ అభిమానులు గుమికూడారని, వారిని ఎవరూ ఆహ్వానించలేదని చెప్పారు. దీనిపై తహశీల్దారు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడం చెల్లదన్నారు. జనం వల్ల ఎలాంటి ఆటంకాలు ఏర్పడటం లేదా ఎవరైనా గాయపడటం వంటివి జరగలేదన్నారు.

ఈ ఏడాది మే 11న ఎన్నికలప్పుడు నాటి ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్‌రెడ్డి ఇంటికి అల్లు అర్జున్ వెళ్లినప్పుడు జనం బాగా గుమికూడారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరిగిందని వారిపై నంద్యాల రూరల్ డిప్యూటీ తహశీల్దార్ పి రామచంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు మే 11న కేసు నమోదు చేశారు. దీనిని కొట్టేయాలంటూ వారిద్దరూ దాఖలు చేసిన పిటిషన్లను అనుమతిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది.

లోకేష్‌కు టిడిపి మంత్రుల అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
అమెరికా పర్యటనను ముగించుకుని వచ్చిన సందర్భంగా విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల మంత్రి నారా లోకేష్‌ను టిడిపి మంత్రులు అభినందించారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో బుధవారం వారు కలిశారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు, పరిశ్రమదారుల్లో నమ్మకం కలిగించడానికి పడుతున్న కష్టం తమకు ఆదర్శమని లోకేష్‌తో వారు అన్నారు. ఆయన చేస్తున్న ప్రయత్నాలు రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలబెట్టడంలో గేమ్ ఛేంజర్ కాగలవని కొనియాడారు.

ఎర్రచందనం అమ్మకానికి కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఎర్రచందనం అమ్మకానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. గ్లోబల్ టెండర్ల ద్వారా ఇ-ఆక్షన్ వేలం వేసేందుకు అనుమతులిచ్చింది. ఇందుకు సంబంధించిన జిఒ 92, 93, 94, 95లను అటవీ, పర్యావరణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాము బుధవారం విడుదల చేశారు. 905.671 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని రెండు దశల్లో వేలం వేయనుంది. అటవీశాఖ పిసిసిఎఫ్ (ప్రొడక్షన్) కమిటీ ఛైర్మన్‌గా ఉంటారు. ఎపి ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిజిఎం మెంబర్ కన్వీనర్‌గా, తిరుపతి చీఫ్ కన్జర్వేటర్ సభ్యులుగా ఉంటారు.

సంపన్నుల కోసమే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం

- వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న ల్యాండ్ గ్రాబింగ్ చట్టం సంపన్నులను కాపాడటానికి తప్ప నిజమైన పేదలకు లాభం చేకూర్చేదిగా లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఉద్యమకారులను, సామాజిక సంఘాలను బెదిరించడానికి, సంపన్నుల భూములు కాపాడేందుకే ఈ చట్టమని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ల్యాండ్ గ్రాబింగ్ చట్టానికి కేబినెట్ ఆమోదించినట్లు పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారని, అయితే ప్రభుత్వ, పేదల భూములను బలవంతులు, రాజకీయ నాయకులు కబ్జా చేసిన సందర్భంలో వారిపై ఈ చట్టాన్ని ప్రయోగించి శిక్షిస్తే దాన్ని ఎవరూ వ్యతిరేకించరన్నారు. గుజరాత్ రాష్ట్రం తరహాలోనే ఇక్కడ చట్టం తెస్తున్నట్లు మంత్రి వెల్లడించారన్నారు. అయితే గురజాత్‌లో అక్కడి పేదలు, కుంటో, సెంటో ఆక్రమించుకుని గుడిసెలు వేసుకుంటే వారిని ఈ చట్టాన్ని ఉపయోగించి కఠినంగా శిక్షించడానికి ప్రభుత్వం పూనుకున్నట్లు అక్కడి పరిస్థితిని అధ్యయనం చేసిన నిపుణులు వెల్లడించినట్లు తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన వాళ్లకు, రాష్ట్రంలో ఉన్న వందలాది ఎకరాల భూములు ఎవరైనా కబ్జా చేస్తే వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడం ల్యాండ్ సీలింగ్ చట్టానికి విరుద్ధమన్నారు. పేద ప్రజల కోసం తీసుకురావాలనుకున్నప్పుడు రాష్ట్రంలో ఉన్న ప్రజా సంఘాలను, వామపక్ష పార్టీల సలహాలు, సూచనలు తీసుకుని ఈ చట్టం చేస్తే వారికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ ముసాయిదా చట్టాన్ని సభలో ప్రవేశపెట్టేలోపు వీరితో చర్చించి అనంతరమే ముందుకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యాశాఖలో ఎడి, జెడిల బదిలీ

- ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టరుగా కృష్ణారెడ్డి
- పరీక్షల విభాగం డైరెక్టరుగా శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పాఠశాల విద్యాశాఖలోని అడిషనల్, జాయింట్ డైరెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందుకు సంబంధించిన జిఒ 463ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం విడుదల చేశారు. మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టరు (జెడి) ఎంవి కృష్ణారెడ్డిని ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టరుగా నియమించింది. ఎసిసిఇఆర్‌టి డైరెక్టర్‌గా ఉన్న బి ప్రతాప్ రెడ్డిని వయోజన విద్య జెడిగా నియమించింది. సమగ్రశిక్షా ఎస్‌పిడి కెవి శ్రీనివాసులు రెడ్డిని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్‌గా నియమించింది. ప్రస్తుతం ఉన్న డైరెక్టర్ దేవానందరెడ్డిని కెజిబివి కార్యదర్శిగా నియమించింది. గత ప్రభుత్వంలో జరిగిన టీచర్ల బదిలీల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న జెడి మువ్వా రామలింగాన్ని సమగ్రశిక్షాలో ట్రైనింగ్ ఆఫీసర్‌గా నియమించింది. పాఠ్యపుస్తకాల ముద్రణ డైరెక్టర్ కె రవీంద్రనాథ్ రెడ్డిని సమగ్రశిక్షా ఎఎస్‌పిడిగా నియమించింది. ఆ స్థానంలో పనిచేస్తున్న కాలేబ్‌ను మధ్యాహ్న భోజనం అండ్ శానిటేషన్ విభాగం అడిషనల్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. కెజిబివి కార్యదర్శిగా ఉన్న మధుసూదనరావును పాఠ్యపుస్తకాల డైరెక్టర్‌గా నియమించింది. ఓపెన్ స్కూల్స్ డైరెక్టర్‌గా రెసిడెన్షియల్ విద్యాసంస్థల కార్యదర్శిగా ఉన్న ఆర్ నరసింహారావును బదిలీ చేసింది. వీరితో పాటు పలువురిని బదిలీ చేసింది.

భూ కబ్జాలకు పాల్పడితే కఠిన శిక్షలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించగా, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 1,069.55 కి.మీకు కుదించిన విషయం తెలిసిందే. తాజా మంత్రివర్గ సమావేశంలో వైసిపి ప్రభుత్వం తీసుకున్న ఆ నిర్ణయాన్ని రద్దు చేసి తిరిగి పూర్వపు స్థాయికి (8,352 కి.మీకు)సిఆర్‌డిఎను విస్తరించాలని నిర్ణయించారు. దీనితో సత్తెనపల్లి మున్సిపాల్టీతో పాట పల్నాడు జిల్లాల్లోని ఆరు మండలాలకు చెందిన 92 గ్రామాలు, బాపట్లజిల్లాలోని 5మండలాలకు చెందిన 62 గ్రామాలు తిరిగి సిఆర్‌డిఎ పరిధిలోకి రానున్నాయి. అదేవిధంగా డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహించే పీఠాపురం నియోజకవర్గ అభివృద్ధికోసం పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి చెందిన కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని పునరుద్ధరించాలన్న ప్రతిపాదనను క్యాబినెట్ ఆమోదించింది, ఎపి డ్రోన్ పాలసీ 4.0కి మంత్రి మండలి ఆమోదముద్ర వేసింది. రాష్ట్రాన్ని డ్రోన్ హబ్‌గా మార్చేందుకు కర్నూలులో డ్రోన్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎపి డేటా సెంటర్ పాలసీ 4.0ని కూడా మంత్రి మండలి ఆమోదించింది.

ఐక్యరాజ్య సమితిలో పాకిస్తాన్ తీరుపై భారత్ విమర్శలు

న్యూయార్క్ : అసత్యాలు, తప్పుడు ప్రచారానికి పాల్పడేందుకు పాక్ ప్రతినిధి బృందం మరోసారి ఐక్యరాజ్య సమితి ఉన్నత వేదికను ఉపయోగించుకుందని భారత్ తీవ్రంగా విమర్శించింది. జమ్మూ కాశ్మీర్ అంశాన్ని పాకిస్తాన్ మరోసారి ఈ వేదికపై లేవనెత్తడంపై భారత్ తీవ్రంగా ప్రతిస్పందించింది. పార్లమెంట్ సభ్యుడు రాజీవ్ శుక్లా మాట్లాడుతూ, పాక్ ప్రతినిధి బృందానికి ఇదొక అలవాటుగా మారిపోయిందని, భారత్ గురించి తప్పుడు, అసత్య సమాచారం వ్యాప్తి చేస్తోందని విమర్శించారు. ఇటువంటి అసత్యపు ప్రామాణికాలతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయాలని చూస్తోందని విమర్శించారు. ఐక్యరాజ్య సమితిలోని గ్లోబల్ కమ్యూనికేషన్స్ విభాగం చేపట్టే కార్యకలాపాలు, చొరవలకు భారత్ మద్దతు వుంటుందని శుక్లా పునరుద్ఘాటించారు.

ఎఫ్‌పిపిసిఎ భారం ప్రభుత్వమే భరించాలి

- విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక
- మంత్రికి విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
విద్యుత్ వినియోగదారులపై ఎఫ్‌పిపిసిఎ భారం మోపొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కోరింది. ఈ మేరకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను వేదిక నాయకులు సచివాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఎఫ్‌పిపిసిఎ రూ.6,072.86 కోట్లు ప్రభుత్వమే భరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఈ కేటాయింపులు జరపాలని కోరారు. ఎఫ్‌పిపిసిఎ విధానాన్నే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌పిపిసిఎ, ట్రూఅప్ ఛార్జీలకు మూలం విద్యుత్‌ను ప్రైవేట్ రంగం నుంచి కొనడంతో అధిక ధరకు బొగ్గు కొనుగోలు చేయడమని వివరించారు. జెన్‌కోకు 76,992 మిలియన్ యూనిట్లు(ఎంయు) ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్నా కేవలం 24,416 ఎంయులు మాత్రమే డిస్కమ్‌లకు అందుతుందని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగం నుంచి 45,265 ఎంయులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వ రంగంలో మరిన్ని ఉత్పత్తి స్టేషన్లను నిర్మిస్తే ప్రజలపై ఈ భారాలు తగ్గుతాయని సూచించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో వేదిక కన్వీనర్ ఎంవి ఆంజనేయులు, ఎఫ్ఎపిఎస్ఐఎ కోశాధికారి జి వెంకటేశ్వరరెడ్డి, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి సాంబిరెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎంఎన్ పాత్రుడు, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని కోరుతూ ధర్నా చేస్తున్న స్టీల్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు

మమ్మల్ని ఆదుకోండి

- స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)
తమ భర్తల జీతాలు చెల్లించాలని, స్టీల్‌ప్లాంట్‌కు వెంటనే సొంత గనులు కేటాయించాలని, ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తదితర డిమాండ్లతో ఉక్కు ఉద్యోగుల భార్యలు బుధవారం నిరసన తెలిపారు. వారు కుటుంబాలతో సహా విశాఖ స్టీల్ ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ సమీపంలో ప్లకార్డులు పట్టుకుని నినదించారు. ఉద్యోగులు నిరసన ధర్నాలు చేస్తున్నారని బయోమెట్రిక్ సిస్టం ద్వారా బయటికి రాకుండా చేసి ఉద్యమాలను అణగదొక్కాలని చూస్తున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్య తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ, తమ భర్తలు లేకపోయినా స్టీల్‌ప్లాంట్ కోసం తాము పోరాడతామన్నారు. సమయానికి జీతాలు చెల్లించకుండా కార్మికుల కుటుంబాలను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల ఫీజుల నుంచి ఇంటి ఇఎంఐల చెల్లింపుల వరకు ఇంట్లో ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భర్తలు ఏ సమయంలో ఎలా మారుతారోనని నిరంతరం మనోవేదనకు గురవుతున్నామని తెలిపారు. పని చేసిన సమయానికే జీతాలు అడుగుతున్నామన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు వేణు, నవ్య యాదవ్, అంబిక, భారతి, సుజాత, ఝాన్సీ, అనురాధ, లక్ష్మి, సృజన, శ్యామలత, ఐశ్వర్య, గంగాభవాని, ప్రసన్న, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు శిక్షణ కార్యక్రమాలొద్దు

- ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలను రద్దు చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి శిక్షణ కేంద్రంలో లీడర్‌షిప్ శిక్షణలో టి రత్నకుమార్ అనే ఉపాధ్యాయుడు మృతిచెందడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశాయి. శిక్షణ కేంద్రాల వద్ద కనీసం వైద్య సౌకర్యాలు కూడా లేవని ఆగ్రహించారు. ఆరు రోజులపాటు పాఠశాలలను వదిలేసి శిక్షణ ఇచ్చే పద్ధతి వల్ల బోధన కుంటుపడుతుందని, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రధానోపాధ్యాయుడు మరణించారని ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్‌సాయి శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్ చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ కార్యక్రమాలు రద్దు చేసి నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో జరపాలని డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ పద్ధతిని కొనసాగిస్తే బాయ్‌కాట్‌కు పిలుపునిస్తామన్నారు. భౌతికపరమైన అన్ని రకాల రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను రద్దు చేయాలని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ చిరంజీవి, జి హృదయరాజు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో నిత్యం పరిపాలనపర సమస్యలు, బోధనేతర పనులు యాప్స్ ఆన్‌లైన్ నమోదులతో ఉపాధ్యాయులకు అత్యవసర యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నట్లు ఉందని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో మరణించిన రత్నకుమార్‌కు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిర్బంధ రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను రద్దు చేయాలని ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె ప్రకాష్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా, డివిజన్ కేంద్రాల్లో శిక్షణ నిర్వహించాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు విశ్రాంతి లేకపోవడం వల్లే ఈ సంఘటన జరిగిందని ఎపిటిఎఫ్ అమరావతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సివి ప్రసాద్, రాధాకృష్ణ విమర్శించారు. ఇప్పటికే యాప్‌లతో ఉపాధ్యాయులు శారీరకంగా, మానసికంగా సతమతమవుతూ ఇబ్బందులు పడుతున్నారని బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొల్లిపో మనోజ్‌కుమార్, చిట్టేటి రమేష్ అన్నారు. ఒత్తిడితో కూడిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పూలే టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అన్నం శ్రీనివాసులు, వాసిలి సురేష్ డిమాండ్ చేశారు. నిర్బంధ శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను శిక్షించొద్దని ఎస్‌టిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోర్ల సుధాకర్, కాలంగిరి కుమార్ పేర్కొన్నారు.


శ్రీవారి సన్నిధిలో కుటుంబసభ్యులతో బిఆర్‌నాయుడు

టిటిడి ఛైర్మన్‌గా బిఆర్ నాయుడు ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి- తిరుమల
తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా బిఆర్ నాయుడు బుధవారం శ్రీవారి ఆలయంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా క్షేత్ర సాంప్రదాయం పాటిస్తూ బిఆర్ నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ భూ వరహాస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుండి ఆలయానికి వెళ్లారు. ఆలయ మహాద్వారం వద్ద ఆయనకు టిటిడి అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలో బంగారు వాకిలి వద్ద బిఆర్ నాయుడుతో టిటిడి ఇఒ జె శ్యామలరావు ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు.

అనంతరం ధర్మకర్తల మండలి సభ్యులుగా దేవాదాయశాఖ సెక్రటరీ సత్యనారాయణ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జంగా కృష్ణమూర్తి, మల్లెల రాజశేఖర్ గౌడ్, జాస్తి పూర్ణ సాంబశివరావు, ఎంఎస్ రాజు, నర్సిరెడ్డి, బూంగునూరు మహేందర్ రెడ్డి, అనుగోలు రంగ శ్రీ, ఆనంద్ సాయి, జానకి దేవి తమ్మిశెట్టి, ఆర్ఎన్ దర్శన్, ఎం శాంతారామ్, ఎస్ నరేష్ కుమార్, డాక్టర్ ఆదిత్ దేశాయ్ ప్రమాణం స్వీకారం చేశారు. వీరిచే టిటిడి అడిషనల్ ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి ప్రమాణం చేయించారు.

తిరుమల పవిత్రతను కాపాడతాం : బిఆర్ నాయుడు

ప్రమాణస్వీకారం అనంతరం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో బిఆర్ నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల పవిత్రతను కాపాడుకోవడమే ప్రస్తుత టిటిడి ధర్మకర్తల మండలి ప్రాధాన్యత అని తెలిపారు. శ్రీవారి సందర్శకులకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత నెలలో బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-నెల్లూరు
నెల్లూరు రూరల్ ధనలక్ష్మీపురం ప్రాంతంలోని విబిఆర్ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సరిగా చదవలేకపోతున్నాననే బాధతో విద్యార్థి మృతి చెందినట్లు పోలీసులు చెబుతుండగా తమ కుమారుడి మృతి పట్ల అనుమానాలు ఉన్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆర్ఆర్ కాలనీకి చెందిన దువ్వూరు ప్రణీత్ అనే విద్యార్థి విబిఆర్ పాఠశాల హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులకు స్కూల్ సిబ్బంది సమాచారమిచ్చారు. తమ కుమారుడి మృతిపట్ల విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాలు పాఠశాల వద్దకు చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులకు మద్దతుగా ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ చేపట్టారు. సరిగా చదవలేననే బాధతోనే సూసైడ్ లేఖ రాసి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు మీడియాకు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రంథి శ్రీనివాసరావు వ్యాపార సముదాయాల్లో ఐటి దాడులు

ప్రజాశక్తి - యంత్రాంగం

భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసం, వ్యాపార సముదాయాల్లో ఐటి అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టారు. భీమవరంలోని ఆయన నివాసం, ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని జివిఆర్ ఫ్యాక్టరీ, కృష్ణా జిల్లా నాగాయలంకలోని వ్యాపార సముదాయాల్లో బుధవారం ఉదయం నుంచి సాయంకాలం వరకూ సోదాలు చేశారు. ఐటి అధికారుల బృందం వచ్చే సమయానికి ముందే ఆయన హైదరాబాద్ వెళ్లినట్లు సమాచారం. ఏలూరులోని ప్రముఖ వ్యాపారవేత్త నూకల రామకృష్ణ నివాసంలోనూ తనిఖీలు చేపట్టారు. 'నాగహనుమాన్ ఆయిల్' పేరుతో ఆయన నూనె వ్యాపారం చేస్తున్నారు. రామకృష్ణ అందుబాటులో లేకపోవడంతో ఆయన కుమారుడు సమక్షంలో ఐటి అధికారులు నూనె ఫ్యాక్టరీకి సంబంధించిన వివరాలను పరిశీలించినట్లు సమాచారం.

ఎర్రచందనం కేసులో కానిస్టేబుల్ అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తిరుపతి జిల్లా యర్రావారి పాలెం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ చలమకుంట గుర్రప్పకుప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలడంతో ఆయనను అరెస్టు చేశారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెడ్‌శాండల్ యాంటి స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ నమోదు చేసిన కేసులో నిందితులతో సదరు కానిస్టేబుల్‌కు సంబంధాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

ద్రవ్యోల్బణం పెరగొచ్చు : ఆర్‌బిఐ

ముంబయి : దేశంలో ద్రవ్యోల్బణం పెరుగనుందని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బిఐ) అంచనా వేసింది. సెప్టెంబర్‌లో 5.5 శాతంగాయ నమోదు కాగా.. అక్టోబర్‌లో ఇది మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ హెచ్చరించారు. బుధవారం శక్తికాంత మీడియాతో మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితుల్లో అస్థిరత నెలకొందన్నారు. కానీ భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకు ఆర్‌బిఐ సమర్థంగా పని చేస్తోందన్నారు. ప్రస్తుత కాలంలో ప్రధానంగా రెండు అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయన్నారు. ఒకటి అమెరికా ఎన్నికల ఫలితాలు కాగా.. మరొకటి ఆర్థిక విధాన మద్దతుకు సంబంధించి చైనా నుంచి ప్రకటనలు వెలువడడటమన్నారు. ఆర్థిక వృద్ధికి ప్రతికూల అంశాల కంటే సానుకూల అంశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. భారత వృద్ధి రేటును పెంచడానికి ఆర్‌బిఐ 70కి పైగా అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుందన్నారు.

మచ్చిక చేసుకునేందుకేనా?

- 'కొవ్వాడ'కు నిధులు కుమ్మరిస్తున్న ఎన్‌పిసిఐఎల్
- సిఎస్‌ఆర్ కింద పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ కిట్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కొవ్వాడ అణువిద్యుత్కేంద్రం నిర్మాణ సంస్థ న్యూక్లియర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పిసిఐఎల్) స్థానికులపై ఎన్నడూ లేనంత ప్రేమ ఒలకబోస్తోంది. రణస్థలం, లావేరు మండలాల్లోని పాఠశాలల విద్యార్థులకూ నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు అందిస్తోంది. అన్నింటిపైనా తమ సంస్థ పేరును ముద్రించి వాటిని ఒక కిట్‌గా సంచిలో పెట్టి పంపిణీ చేస్తోంది. వీటితో పాటు రణస్థలం మండలం కొవ్వాడలోని ప్రాథమిక పాఠశాలలోని అదనపు తరగతి గదుల కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సిఎస్‌ఆర్) కింద రూ.74 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించింది. కొవ్వాడలో 1,300 సోలార్ వీధి దీపాల ఏర్పాటుకు రూ.3.42 కోట్లను అందిస్తోంది. కొవ్వాడలో తాగునీటి కోసం రూ.20 లక్షలు ఇవ్వనుంది. కొవ్వాడ అణువిద్యుత్కేంద్రం ఏర్పాటు చేస్తే ఊరే ఉండని పరిస్థితుల్లో నిధులు కుమ్మరింతపై అందరిలోనూ అనుమానాలు రేకెత్తుతున్నాయి. కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం అత్యంత ప్రమాదకరమని ప్రజలు గ్రహించారు. విద్యుత్కేంద్రం ఏర్పాటుకు వినియోగిస్తున్న టెక్నాలజీని ఇప్పటివరకు పరీక్షించకపోవడం, ఇక్కడ ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తుండడంతో అందరిలోనూ భయాందోళనలు నెలకొన్నాయి. కొవ్వాడ సమీప మండలాలైన రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండల ప్రజల్లోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. భూకంపాలు సంభవించే ప్రమాదమున్న ఈ ప్రాంతంలో అణు విద్యుత్కేంద్రం ఏర్పాటు చేస్తే, పేలుళ్లకు అవకాశం ఉంటుందని పర్యావరణ నిపుణులు ఇప్పటికే హెచ్చరించారు. విద్యుత్యుత్పత్తి, అణు ఇంధన రవాణా సందర్భంగా పొరపాటున లీకయితే దానిని నియంత్రించగలిగే సాంకేతిక పరిజ్ఞానం మన వద్ద లేదని గతంలోనే శాస్త్రవేత్తలు వెల్లడించారు. ప్లాంట్‌లో విస్ఫోటనం సంభవిస్తే కాకినాడ నుంచి ఒడిశాలోని బరంపురం వరకు ఖాళీ చేయాల్సి ఉంటుందని పర్యావరణ నిపుణులు హెచ్చరికలు చేశారు. తీవ్ర భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో ప్రజలను మచ్చిక చేసుకునేందుకు ఎన్‌పిసిఐఎల్ యాజమాన్యం రకరకాల రూపాల్లో ప్రయత్నాలు సాగిస్తోందన్న చర్చ సాగుతోంది.



అణు విద్యుత్కేంద్రం ఏర్పాటు చేసే కొవ్వాడ గ్రామం



విద్యార్థులకు ఎన్‌పిసిఐఎల్ పంపిణీ చేసిన సామగ్రి

'కొవ్వాడ'పై మళ్లీ కదలిక

టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక కొవ్వాడ అణుప్లాంట్‌పై మళ్లీ కదలిక వచ్చింది. ఈ ఏడాది ఆగస్టు 13న రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు కొవ్వాడ భూములు, నిర్వాసిత కాలనీలపై అధికారులతో సమీక్షించారు.

గతంలోనే 2079 ఎకరాల భూములకు రూ.470 కోట్లను ఆయా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. విద్యుత్కేంద్రం ఏర్పాటులో భాగంగా 1820 కుటుంబాలను నిర్వాసితులుగా గుర్తించారు. వీరికి ఎచ్చెర్ల మండలం ధర్మవరంలో నిర్వాసిత కాలనీ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజలు భయాందోళనల్లో ఉన్నా సర్కార్ పట్టించుకోవడం లేదు.

శిక్షణా తరగతుల్లో ప్రధానోపాధ్యాయుడు మృతి

- ఆందోళనకు దిగిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి (ఏలూరు)

శిక్షణా తరగతుల్లో పాల్గొన్న ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి హీల్ పాఠశాలలో బుధవారం చోటుచేసుకుంది. తోటి ఉపాధ్యాయుల కథనం మేరకు.. నాయకత్వ లక్షణాల అభివృద్ధిపై ఈ నెల నాలుగు నుంచి తొమ్మిది వరకు హీల్ పాఠశాలలో కృష్ణా, ఎన్‌టిఆర్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 200 మందికిపైగా ప్రధానోపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. వీటికి హాజరైన పశ్చిమగోదావ0రి జిల్లా ఉండి మండలం ఉణుదుర్రు హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం టివి.రత్నకుమార్‌కు బుధవారం తెల్లవారుజామున గుండెపోటు వచ్చింది. గమనించిన సహచర ప్రధానోపాధ్యాయులు వెంటనే స్థానిక వైద్యుడికి చూపించి విజయవాడకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆయన మరణించారు. దీంతో ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. శిక్షణను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. శిక్షణా కేంద్రాన్ని ఎపి సమగ్ర శిక్ష ఎఎస్‌పిడి కెవి. శ్రీనివాసులు రెడ్డి, సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య, ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటలక్ష్మి, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సందర్శించారు. ప్రతిరోజూ నిర్విరామంగా ఉదయం 5:30 గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు శిక్షణా తరగతులు, ఆపై ఏడు గంటల వరకు కల్చరల్ యాక్టివిటీస్, ఏడు గంటల నుండి ఎనిమిది గంటల వరకు మళ్లీ ఫిజికల్ గేమ్స్ నిర్వహిస్తుండడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మారుమూల ప్రదేశంలో శిక్షణ పెట్టడం, సకాలంలో సరైన వైద్యం అందకపోవడంతో రత్నకుమార్ మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు.



రత్నకుమార్(ఫైల్)

ఆస్పత్రిలో భారీ అగ్నిప్రమాదం

- ముగ్గురు రోగులకు గాయాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణం శ్రీనివాస్ నగర్‌లోని మోర్ సూపర్ మార్కెట్ పైన నిర్వహిస్తున్న శ్రీకరి ఆస్పత్రిలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై ఆస్పత్రి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం ఎనిమది గంటల ప్రాంతంలో ఆస్పత్రిలోని ఐసియులో షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. దీంతో అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న రెండు అగ్ని మాపక దళ సిబ్బంది మంటలను ఆర్పి పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఐసియులో చికిత్స పొందుతున్న ముగ్గురు రోగులకు గాయాలు అయ్యాయి. ఆస్పత్రిలోని రోగులను ఇతర ప్రయివేటు ఆస్పత్రులకు పోలీసులు తరలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అగ్ని ప్రమాదం జరిగిన ఆస్పత్రిని సందర్శించి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ వి జైబాబును అడిగి తెలుసుకున్నారు. ఈ అగ్ని ప్రమాదం పై నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి అరా తీశారు. నంద్యాలలోని డాక్టర్ వి.జైబాబును ఫోన్‌లో పరామర్శించి రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.



ప్రభుత్వమే సర్దుబాటు చేయాలి : షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాన్ని ప్రజలపై వేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి బాబు మద్దతు ఇస్తున్నందున, అక్కడి నుంచి నిధులు రాబట్టి డిస్కమ్‌లకు రాష్ట్ర ప్రభుత్వమే సర్దుబాటు చేయాలన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా విజయవాడలోని ధర్నా చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన లాంతర్లతో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన 5 నెలల్లోనే ప్రజలకు హై ఓల్టేజ్ షాక్‌లు ఇచ్చి చుక్కలు చూపిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రూ.6 వేలకోట్లు భారాన్ని ప్రజలపై వేశారని, తాజాగా మరో రూ.11 వేలకోట్ల భారం వేసేందుకు సిద్ధమవ్వడాన్ని తప్పుబట్టారు. తాము అధికారం చేపడితే విద్యుత్ ఛార్జీల పెంపే ఉండదని, అవసరమైతే 30 శాతం ఛార్జీలను తగ్గిస్తామని చెప్పి, ఇప్పుడు అడ్డగోలుగా ప్రజలపై రూ.17 వేలకోట్ల భారం వేయడం దుర్మార్గమన్నారు. వైసిపి ప్రభుత్వంలో విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని చెబుతున్నారని, వీటిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. హిందుజా సంస్థకు రూ.12 వందల కోట్లు ఎందుకు ఇచ్చారనేది తేల్చాలన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరలు భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడటం అర్థరహితమన్నారు. వెంటనే సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని కోరారు. మహిళలకు ఫ్రీ గ్యాస్ సిలిండర్లకు రూ.2,500 కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం వారి నుంచి విద్యుత్ ఛార్జీల పెంపు పేరుతో రూ.17 వేలకోట్లు గుంజుకుంటుందని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో ఎపిసిసి నాయకులు, కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం, పిసిసి నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో మాజీ మంత్రి అంత్యక్రియలు

ప్రజాశక్తి- చీడికాడ (అనకాపల్లి జిల్లా)

మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ అంత్యక్రియలు అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం పెద్దగోగాడ గ్రామంలో బుధవారం ఉదయం అధికార లాంఛనాలతో నిర్వహించారు. నర్సీపట్నం ఆర్‌డిఒ వివి రమణ, డిఎస్‌పి శ్రావణి ఆధ్వర్యాన ప్రముఖులు, అధికారులు సమక్షంలో కుమారుడు రెడ్డి రాముతో అంత్యక్రియలు జరిపారు. ముందుగా పోలీసులు మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. సత్యనారాయణ భౌతికకాయంపై జాతీయ జెండాను కప్పారు. అంత్యక్రియల్లో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, నియోజకవర్గ నాయకులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం సంతాపం

మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ మృతికి సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె లోకనాథం ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా పనిచేసిన సత్యనారాయణ నిరాడంబరత్వానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు.

గ్రానైట్ తవ్వకాలు నిలిపేయాల్సిందే

- బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన పాదయాత్ర
- అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలు నిలిపేయాలని బడిదేవరకొండమ్మ పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పార్వతీపురం పట్టణంలోని సుందరయ్య భవనం నుంచి వెలగవలస గ్రామం వరకు బడిదేవరకొండమ్మ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు బుధవారం పాదయాత్ర చేపట్టారు. బడిదేవరకొండ పరిరక్షణ యాత్ర పేరుతో చేపట్టిన పాదయాత్రను వెంకంపేట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో పాదయాత్ర, బహిరంగ సభలకు అనుమతులు లేవని రూరల్ సిఐ గోవిందరావు తెలిపారు. ముందుగానే పాదయాత్ర కార్యాచరణను ప్రకటించామని, సహకరించాలని సభ్యులు కోరారు. పాదయాత్రను ప్రస్తుతానికి నిలుపుదల చేయాలని, కొత్తగా ర్యాలీకి దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారులను సంప్రదించి అవకాశాల మేరకు అనుమతులు మంజూరు చేస్తామని సిఐ తెలిపారు. దీంతో కమిటీ సభ్యులు పాదయాత్రను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ బడిదేవరకొండపై ఎంఎస్‌పి కంపెనీకి ఇచ్చిన అన్ని రకాల అనుమతులను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు, రైతులకు జీవనాధారమైన కొండపై గ్రానైట్ తవ్వకాలకు 20 ఏళ్లపాటు అనుమతులు ఇవ్వడం దారుణమన్నారు. గ్రానైట్ అనుమతుల పట్ల గనుల శాఖాధికారులు రకరకాలుగా కథనాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించి మైనింగ్ కంపెనీకి కొమ్ముకాస్తున్నారని తెలిపారు. గ్రానైట్ తవ్వకాలను ప్రభుత్వం నిలుపుదల చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు బంటు దాసు, ఆర్‌విఎస్ కుమార్, కోరంగి మన్మథరావు, పి.రంజిత్‌కుమార్, ఎం.భాస్కరరావు, బి.నర్సింగరావు, పి.సంఘం, రెడ్డి శ్రీదేవి, విశ్వేశ్వరరావు, బి.సూరిబాబు, ఎస్.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ నాయకులు


ట్రంప్‌తో భారత పరిశ్రమకు దెబ్బే..!

- వాహన, వస్త్ర, ఫార్మాపై అధిక సుంకాలు
- దేశీయ సరుకులకు తీవ్ర పోటీ
- హెచ్1బి వీసా నిబంధనలు కఠినతరమే
- నిపుణుల అంచనా

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడిగా డొనాల్ట్ ట్రంప్ ఎన్నిక కానున్న నేపథ్యంలో భారత పరిశ్రమలో ఆందోళన నెలకొంది. అమెరికా కొత్త ప్రభుత్వ తొలి ఎజెండాలో ఆటో మొబైల్స్, వస్త్ర, ఔషధ పరిశ్రమ వస్తువులపై దిగుమతి సుంకాలు భారీగా పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే జరిగితే భారతీయ ఎగుమతిదారులు అధిక కస్టమ్స్ సుంకాలను ఎదుర్కోవలసి ఉంటుందని వాణిజ్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. హెచ్-1బి వీసా జారీ నిబంధనలను కూడా ట్రంప్ కఠినతరం చేయవచ్చు. అదే జరిగితే భారతీయ ఐటి సంస్థల ఖర్చులు, వృద్ధిపై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. భారత ఐటి ఎగుమతి ఆదాయాల్లో 80 శాతానికి పైగా యుఎస్ నుంచే వస్తున్నాయి. వీసా విధానాలను కఠినతరం చేస్తే ఈ రంగం ఒత్తిడిని ఎదుర్కోనుంది. భారత అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అమెరికా ఉంది. ఐటి సేవల్లో 190 బిలియన్ డాలర్ల వార్షిక వాణిజ్యం నమోదవుతోంది.

చైనా సహా భారత్‌పైనా ట్రంప్ అధిక సుంకాలను వేసే అవకాశాలున్నాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జిటిఆర్ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవా పేర్కొన్నారు. భారత్ అతిపెద్ద సుంకాల దుర్వినియోగ దేశమని 2020లో ట్రంప్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండో దఫా గెలుపొందిన ట్రంప్ మరోమారు వాణిజ్య భారాలను మోపే అవకాశం లేకపోలేదన్నారు.

"ట్రంప్ ప్రభుత్వ ఫస్ట్ ఎజెండా భారతీయ వస్తువులపై మరింత సుంకాలను మోపవచ్చును. ముఖ్యంగా వాహన రంగం, మద్యం, వస్త్ర, ఔషధ రంగాల భారత ఎగుమతులుకు అడ్డంకులు వేయవచ్చు. టారీఫ్‌లను పెంచడం ద్వారా అమెరికా మార్కెట్‌లో మన ఉత్పత్తులు పోటీ పడలేవు. దీంతో ఆయా కంపెనీల ఆదాయాలు పడిపోనున్నాయి." అని శ్రీవాస్తవ విశ్లేషించారు. చైనాపై అమెరికా కఠిన వైఖరి భారతీయ ఎగుమతిదారులకు కొంత ఉపశమనం కలిగించవచ్చన్నారు. అమెరికా-భారత్ దేశాల మధ్య 2022-23లో ద్వైపాక్షిక వాణిజ్యం 129.4 బిలియన్ డాలర్లుగా, 2023-24లో 120 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.



ఇప్పటికే అధిక పన్నులు..

అమెరికా ఇప్పటికే దిగుమతి ఉత్పత్తులపై అధిక పన్ను రేట్లను అమలు చేస్తోంది. జిటిఆర్ఐ రిపోర్ట్ ప్రకారం.. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) టారీఫ్ 2023 ప్రకారం.. అమెరికా దిగుమతులు చేసుకుంటున్న పాల ఉత్పత్తులపై 188 శాతం, పళ్లు, కూరగాయాలపై 132 శాతం, తృణధాన్యాలపై 193 శాతం, నూనె గింజలు, కొవ్వులు, నూనెలలపై 164 శాతం, పానీయాలు, పొగాకు ఉత్పత్తులపై 150 శాతం చొప్పున సుంకాలు అమల్లో ఉన్నాయి.

"మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాధం ఇచ్చిన ట్రంప్ టారీఫ్‌లను పెంచనున్నారు. ట్రంప్ అధికారంలోకి రావడం వల్ల మేము రక్షణలో పడనున్నాము. ఎలక్ట్రానిక్స్ రంగంపైనా ఒత్తిడి నెలకొనడంతో దెబ్బ తిననుంది." అని అంతర్జాతీయ ట్రేడ్ నిపుణులు బిస్వజిత్ ధర్ పేర్కొన్నారు. ట్రాన్స్-పసిఫిక్ పార్టనర్‌షిప్ (టిపిపి) నుండి ఇంతక్రితం ట్రంప్ వైదొలిగినందున, ఇండో-పసిఫిక్ ఎకనామిక్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ప్రాస్పెరిటీ (ఐపిఇఎఫ్)పై చీకటి మేఘాలు కమ్ముకోవచ్చున్నారు.

ఇపిఇఎఫ్ అంశంలో ట్రంప్ విధానం ఎలా ఉంటుందో వేచి చూడాలని ధార్ పేర్కొన్నారు. ఈ అంశంపై డబ్ల్యుటిఒ చొరవను ఏమీ ఆశించలేమన్నారు. ట్రంప్ మరింత సమతుల్య వాణిజ్యం కోసం ముందుకు వస్తారని తాము ఆశిస్తున్నామని.. అయితే సుంకాల చుట్టూ వాణిజ్య వివాదాలు తలెత్తవచ్చని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఇఒ) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ పేర్కొన్నారు. ఇమ్మిగ్రేషన్ నిబంధనలను కఠినతరం చేసే అవకాశం ఉందన్నారు.

ఆర్థిక సంవత్సరం 2019-20 నుంచి 2023-24 మధ్య అమెరికాకు భారత సరుకుల ఎగుమతులు 46 శాతం పెరిగి 53.1 బిలియన్ డాలర్ల నుంచి 77.5 బిలియన్ డాలర్లకు చేరాయి. కాగా అమెరికా నుంచి భారత్‌కు 2019-20లో 35.8 బిలియన్ డాలర్ల దిగుమతులు చోటు చేసుకోగా.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 42.2 బిలియన్ దిగుమతులు నమోదయ్యాయి.

ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవాలి

అమెరికా అధిక పన్నుల విధానం చేపడితే భారత తయారీ, సరఫరాలపై ప్రతికూల ప్రభావం పడనుందని ఇవై ఇండియా ప్రతినిధి అగ్నేశ్వర్ సేన్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, కెమికల్స్, ఫార్మా, ఆటో, ఇంజనీరింగ్ ఉత్పత్తుల వంటి ఎగుమతులపై భారత్ అధిక సుంకాలను ఎదుర్కోవాల్సి రావొచ్చన్నారు. భారత్ ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవాలని సూచించారు. అదే విధంగా అమెరికా ఎగుమతులపైనా భారత్ సుంకాలు పెంచడం ద్వారా ప్రయోజనాలను కాపాడుకోవాలన్నారు. భారత ఐటి అవుట్‌సోర్సింగ్ ఎగుమతులను ప్రభావితం చేసే ట్రంప్ చర్యలను ఎదుర్కోవడానికి భారత్ సిద్ధంగా ఉండాలన్నారు. వీసా నిబంధనల కఠినతరం చేయడం వల్ల భారతీయ ఐటి నిపుణులపై ప్రతికూల ప్రభావం పడనుందన్నారు. అదే విధంగా ట్రంప్ భారత విదేశాంగ విధానాన్ని పరిమితం చేసే అవకాశాలు లేకపోలేదన్నారు.

విద్యార్థి కిట్లకు రూ.953 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్‌కెవిఎం) పథకంలో భాగంగా అందించే కిట్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.953.71 కోట్లు విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన జిఓ 35ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం విడుదల చేశారు. ఈ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, వర్క్‌బుక్స్, యునిఫాం, నోట్‌బుక్స్, బెల్ట్, బూట్లు, బ్యాగ్, డిక్షనరీ అందిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే విద్యాసంవత్సరం (2025-26)కు 35,94,774 మంది విద్యార్థులకు వీటిని అందించేందుకు ఈ నిధులు మంజూరు చేసింది.

కాంట్రాక్టర్ల కాలపరిమితి అర్హత పదేళ్లకు పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లు బిడ్లు వేసేందుకు కాలపరిమితి అర్హతను ఐదు నుంచి పదేళ్లకు పెంచనున్నట్లు ఆర్‌అండ్‌బి, మౌలిక సదుపాయాలశాఖల మంత్రి బిసి జనార్ధనరెడ్డి వెల్లడించారు. చిన్న, మధ్యతరగతి కాంట్రాక్టర్ల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఐదేళ్లలో బిల్లుల చెల్లింపుల జాప్యం తదితర కారణాల వల్ల పనులు పూర్తి చేయడంలో ఆలస్యమైందని, అందువల్ల వీరంతా ప్రస్తుత అభివృద్ధి పనులకు బిడ్లు వేసేందుకు అర్హత కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో అర్హత కాలపరిమితిని పెంచినట్లు తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణ బిల్లును ఆమోదించాలి

- మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్‌సి వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించాలనీ మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ కోరారు. గుంటూరులోని తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీరుపై ఇప్పటికే పలు రాష్ట్రాలు సానుకూలంగా స్పందించాయని చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నానని అన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలూ సహకరించాలని కోరారు. మహిళల పై జరుగుతున్న దారుణాల పట్ల పవన్ కల్యాణ్ ఆవేశంగా మాట్లాడటం సబబేనన్నారు. మహిళలు, చిన్నారులపై వ్యవస్థీకృతంగా జరుగుతున్న దుర్మార్గాలపై రాష్ట్ర పోలీసు శాఖ, హోం మంత్రి అనితపై ఇటీవల పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ధర్మాగ్రహమని తెలిపారు. హోంమంత్రి అనితను కించపర్చాలనే ఉద్దేశం ఆయనకు లేదన్నారు. పల్నాడు జిల్లాలో సరస్వతి భూములను త్వరితగతిన ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. 2004 తర్వాత జగన్ వచ్చిన ఆస్తులను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. జగన్ వద్ద ఉన్న నల్ల డబ్బంతా ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడులేనని విమర్శించారు.

డిజిపి వ్యాఖ్యలు సరికాదు : అంబటి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టినందుకు వైసిపి కార్యకర్తలను మూకుమ్మడిగా ఇప్పుడు అరెస్టులు చేయడం దారుణమని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరులో అరెస్ట్ చేసిన పలువురు వైసిపి కార్యకర్తలను పార్టీ నాయకులతో కలిసి ఆయన బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో అంబటి మాట్లాడుతూ మాజీ మంత్రి విడదల రజనిపై ఇటీవల భయంకరమైన పోస్టులు పెట్టారని డిజిపికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. వైసిపి హయంలో పెట్టిన పోస్టింగ్‌లపై ఇప్పుడు అరెస్టులు చేస్తూ.. 30 ఏళ్ళ క్రితం కేసులైనా దర్యాప్తు చేస్తామని డిజిపి వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ మంత్రి రజని ఫిర్యాదును ఎందుకు పట్టించుకోలేదని విమర్శించారు. పక్షపాతంగా వ్యవహరిస్తే ఇబ్బంది పడతారని హెచ్చరించారు. డిజిపి శాంతిభద్రతలు కాపాడాలని, రాజకీయపరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. లోకేష్, పవన్ కల్యాణ్ ఒత్తిడితోనే కేసులు పెట్టి వేధిస్తున్నారనీ ఆరోపించారు. లోకేష్ చెప్పినట్లు చేసే స్థాయికి డిజిపి వచ్చారని విమర్శించారు. అక్రమ కేసులకు భయపడబోమని చెప్పారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని, పోలీసులు చట్టప్రకారం వ్యవహరించాలని సూచించారు. పరామర్శించిన వారిలో వైసిపి నేతలు డైమండ్ బాబు, నిమ్మకాయల రాజ నారాయణ, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి నుంచి కన్జప్షన్ ఫండ్

ముంబయి : బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి బజాజ్ ఫిన్‌సర్వ్ కొత్తఈగా కన్జప్షన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్ అని ఆ సంస్థ పేర్కొంది. ఈ కొత్త ఫండ్ నవంబర్ 8న సబ్‌స్క్రిప్షన్ కోసం తెరవబడుతుందని.. 22న ముగుస్తుందని తెలిపింది. విస్తృత మార్కెట్‌లతో పోలిస్తే ప్రాథమిక అంశాలు బలంగా ఉన్నందున పెట్టుబడికి ఇది సరైన సమయని బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ నిమేష్ చందన్ పేర్కొన్నారు.

ఎంజి విండ్సర్ రికార్డ్ అమ్మకాలు

న్యూఢిల్లీ : జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తన నూతన కారు ఎంజి విండ్సర్ అమ్మకాల్లో రికార్డ్‌ను నమోదు చేసినట్లు తెలిపింది. 2024 అక్టోబర్‌లో 3,116 యూనిట్ల విండ్సర్ అమ్మకాలు చేయగా.. తమ ప్యాసింజర్ ఎలక్ట్రిక్ కార్లు 30 శాతం వాటాను కలిగి ఉన్నాయని తెలిపింది. గతేడాది ఇదే మాసంతో పోల్చితే 31 శాతం వృద్ధితో మొత్తంగా 7,045 యూనిట్ల కార్లను విక్రయించినట్లు తెలిపింది. ఎంజి మోటార్ మార్కెట్లోకి వచ్చిన తర్వాత ఇదే రికార్డ్ విక్రయాలని తెలిపింది.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ రియల్‌టైం ట్రాకింగ్ సేవలు

ముంబయి : విదేశాలకు పంపిన డబ్బు కోసం స్విఫ్ట్‌తో కలిసి రియల్ టైం ట్రాకింగ్ సేవలను అందిస్తున్నట్లు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్‌లోనే తొలిసారి ఆవిష్కరణ అని పేర్కొంది. బ్యాంక్ మొబైల్ అప్లికేషన్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఇది భారతీయ బ్యాంకింగ్ పరిశ్రమలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని ఆ బ్యాంక్ బ్రాంచ్ బ్యాంకింగ్ హెడ్ చిన్మయ్ దోభ్లే పేర్కొన్నారు. సౌకర్యవంతమైన, సమర్థవంతమైన బ్యాంకింగ్ పరిష్కారాలను అందించడంలో తమ బ్యాంక్ నిబద్ధతను ప్రదర్శిస్తుందన్నారు.

సంపాదకీయం

జార్ఖండ్‌లో బిజెపి కుతంత్రాలు

ఏదో రకంగా ఎన్నికల్లో గెలవడం, అధికారాన్ని చేజిక్కించుకోవడం బిజెపి లక్ష్యం. దాని కోసం ప్రజలను చీల్చడానికి, వారి మధ్య ఘర్షణలు సృష్టించడానికి కూడా ఆ పార్టీ వెనకాడదన్నది ఇప్పటికే నిరూపితమైన సత్యం! మెజార్టీ ప్రజలను ఆకట్టుకోవడానికి ఒకవైపు తీవ్ర హిందుత్వాన్ని ముందుకు తీసుకువస్తూ, క్షేత్ర స్థాయిలో అవసరాలను బట్టి మనువాదాన్ని, కులతత్వాన్ని ఆశ్రయిస్తుంది. ఇటీవల జరిగిన హర్యానా ఎన్నికలతో పాటు, వివిధ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఆ విద్వేష విష వ్యూహాన్నే జార్ఖండ్ ఎన్నికల్లో సైతం బిజెపి అనుసరిస్తోంది. రాష్ట్ర జనాభాలో 26 శాతం కంటే కొంచెం ఎక్కువగా ఉన్న గిరిజనుల ఓట్లను గంపగుత్తుగా దండుకోవడమే లక్ష్యంగా బిజెపి నేతల ఈ విష ప్రచారం సాగుతోంది. ఈ రాష్ట్రంలోని 81 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 28 స్థానాలు షెడ్యూల్డ్ తెగలకు రిజర్వు అయ్యాయంటే ఆదివాసీ ఓట్ల ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు

2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు బిజెపిని తిరస్కరించారు. అప్పటి నుండి ఈ రాష్ట్రంపై బిజెపి ప్రత్యేకంగా దృష్టి సారించింది. మైనార్టీలను ప్రత్యేకించి ముస్లింలను బూచిగా చూపి గిరిజనుల్లో భయోత్పాతాలను రెచ్చగొట్టే యత్నాలు చేస్తోంది. బంగ్లాదేశ్ నుండి పెద్ద ఎత్తున చొరబాట్లు జరుగుతున్నాయని, దీని కారణంగా ఆదివాసీల భూములు, వనరులు ప్రమాదంలో పడతాయన్న ప్రచారాన్ని కొన్ని సంవత్సరాలుగా ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున చేస్తున్నాయి. దీనిని ఆ రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేయడంతో హైకోర్టు జోక్యం చేసుకుని ఈ ప్రచారంలోని నిజానిజాలను తేల్చడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ విచారణ కొనసాగుతోంది. అయినా ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి ఈ విషయాన్ని ప్రస్తావించారు. ముస్లింలను చొరబాటుదారులుగా చిత్రీకరించడంతో పాటు వారు గిరిజనుల ఆహారాన్ని, కుమార్తెలను అపహరిస్తున్నారని చెప్పారు. దేశ ప్రధాని ఇలా మాట్లాడటం ఎంత దిగజారుడుతనం? ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న కపట వ్యూహం తప్ప దీనిలో మరేదైనా ఉందా? ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా? హోంమంత్రి అమిత్‌షా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్‌లతో పాటు పలువురు ఇతర నాయకులదీ విద్వేషపు బాటే! ఇంతమంది, ఇంత బహిరంగంగా మత విద్వేషాలను రెచ్చగొడుతున్నా ఘనత వహించిన ఎన్నికల కమిషన్‌కు మాత్రం ఇవేమి పట్టడం లేదు. సుమోటోగా స్పందించాల్సిన ఇసి ఫిర్యాదులు అందినా మౌనంగా ఉండటం దిగ్భ్రాంతికరం.

ఎన్నికల వేళ ఏకరూప పౌర స్మృతి (యునిఫాం సివిల్ కోడ్-యుసిసి)ని బిజెపి తెరమీదకు తీసుకురావడం మరింత వివాదాస్పదంగా మారింది. కేంద్ర మంత్రి అమిత్ షా విడుదలచేసిన 'సంకల్ప పత్ర'లో తాము గెలిస్తే రాష్ట్రంలో యుసిసిని అమలు చేస్తామని, అయితే, దాని నుండి గిరిజనులను మినహాయిస్తామని బిజెపి పేర్కొంది. 'ఒకే దేశం..ఒకే చట్టం.. ఒకే ఎన్నికలు..' అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు, ఆ పార్టీ నేతలందరూ ఊదరగొడుతుండగా, జార్ఖండ్‌లో యుసిసి నుండి గిరిజనులను మినహాయిస్తామని చెప్పడం బిజెపి కపట నాటకాన్ని బయటపెడుతోంది. ప్రజలను కులం, మతం ప్రాతిపదిక విభజించి రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలన్న బిజెపి ఆలోచన ధోరణికి ఈ ప్రకటన నిలువెత్తు నిదర్శనం. సమాజంలో అన్ని విధాలుగా వెనకబడి, తమవైన సొంత సంస్కృతి, సాంప్రదాయాలు కలిగి ఉన్న గిరిజనులకు యుసిసి నుండి ఇటువంటి మినహాయింపు ఇవ్వాల్సిందే! జార్ఖండ్‌లోని గిరిజనులకే కాదు, దేశమంతా ఇటువంటి విభిన్న సాంప్రదాయాలు కలిగిన వారు ఎందరో ఉన్నారు. అందులోనూ సామాజిక వివక్ష, ఆర్థిక వెనుకబాటుతనం, విభిన్న తెగల ఆచారాలు, సంస్కృతులను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ఏకరూప పౌరస్మృతిని రుద్దడం సరికాదు. సున్నితమైన ఇటువంటి అంశాన్ని రాజకీయ స్వప్రయోజనాల కోసం వాడుకోవడం బిజెపి దివాళాకోరుతనానికి నిదర్శనం. చైతన్యవంతమైన జార్ఖండ్ ప్రజలు, ముఖ్యంగా దళితులు, మహిళలు, మైనార్టీలు, గిరిజనులు ఈ కుతంత్రాలను అర్థం చేసుకుని సమిష్టిగా తిప్పికొడతారని ఆశిద్దాం.

మహనీయుల మాట



విప్లవంలో ఎదురుదెబ్బలు తిన్నప్పుడూ,
శత్రువు విజయం సాధించినప్పుడూ...
స్థిమితం కోల్పోకుండా, కుదుపులకు
గురికాకుండా వున్నవాడూ...
విప్లవం వెనుకపట్టు పట్టినప్పుడు...
బెదిరిపోకుండా లేక నిరాశకు
గురికాకుండా వున్నవాడూ
నిజమైన విప్లవకారుడు.

- స్టాలిన్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మోడీ-చంద్రబాబు తాజా వ్యూహం ఎటువైపు?

విశ్లేషణ



డా॥ బి. గంగారావు

విశాఖ స్టీల్ ప్లాంట్‌పై 'చంద్రబాబు-పవన్' కూటమి ప్రభుత్వ వైఖరి రోజుకొక విధంగా మారుతున్నది. ప్రైవేటీకరణ ఉపసంహరణ, సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం కోసం కేంద్ర బిజెపిపై ఒత్తిడి చేయడం మానేసి ఆర్థిక ప్యాకేజీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై కార్మికులు పెట్టుకున్న నమ్మకం సన్నగిల్లుతున్నది. రెండోవైపు కేంద్ర బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విధానం నుండి వెనక్కి తగ్గకపోగా కార్మికులపై దాడి ఎక్కుపెట్టింది. ఈ దాడిని నిలువరించేలా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. 'మోడీ-బాబు'ల ఈ తాజా వ్యూహం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుండి కాపాడుతుందనే నమ్మకం సడలిపోతున్నది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో 'చంద్రబాబు-పవన్' ద్వయం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోను ప్రైవేటీకరణ కానివ్వమని, మా కూటమిని గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్‌కు సొంత ముడి ఇనుప గనులు కేటాయిస్తామని లేదా సెయిల్‌లో విలీనం చేస్తామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పలుమార్లు కేంద్ర స్టీల్‌మంత్రి, ఆర్థికమంత్రి, ప్రధానమంత్రితో చర్చలు జరిపారు. అయినా ఇప్పటి వరకు కేంద్ర బిజెపి ప్రభుత్వం మాత్రం ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరిస్తున్నట్లు ప్రకటన చెయ్యలేదు. ముఖ్యమంత్రి కూడ దీనిపై ఒత్తిడి చేయటం లేదు. తాజాగా ఆర్థిక ప్యాకేజీని ముందుకు తీసుకొస్తున్నారు. ప్లాంట్ పూర్తి స్థాయిలో నడవాలంటే తప్పని సరిగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాల్సిందే. అప్పుల భారం తగ్గించాల్సిందే. కానీ ప్రైవేటీకరణ ఉపసంహరిస్తున్నాం అనే ప్రకటన చేయకుండా ఆర్థిక ప్యాకేజీనే ముందుకు తీసుకురావటం వల్ల ప్లాంట్ సమస్యకి శాశ్వత పరిష్కారం లభించదు. ప్లాంట్‌కి వచ్చిన సమస్యలన్నీ ప్రైవేటీకరణ నిర్ణయం వల్లే. ప్రైవేటీకరణ ఉపసంహరిస్తేనే అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టత ప్రకటించకుండా దాచిపెడుతున్నది. కాకపోతే మేం అధికారంలో ఉన్నంతకాలం ప్రైవేటీకరణ కానివ్వం అంటున్నారు. దీని అర్థమేమిటి? ప్రైవేటీకరణ నిర్ణయం నుండి బిజెపి ప్రభుత్వం వెనక్కి వెళ్ళదని చెప్పటమే!

ఇటీవల ముఖ్యమంత్రి స్టీల్‌ప్లాంట్‌పై మాట్లాడిన మాటలు బిజెపి వాదనలను మరింత బలపర్చేవిగా ఉన్నాయి. గత మూడేళ్ల నుండి బిజెపి విశాఖ స్టీట్‌ప్లాంట్‌పై అనేక విధాలుగా దుష్ప్రచారం చేస్తున్నది. ఇప్పుడు చంద్రబాబు నాయుడు స్టీల్‌ప్లాంట్‌పై వేస్తున్న ప్రశ్నలు, చేస్తున్న వాదనలు ఇలాంటివే. ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్లకి లాభాలు వస్తుండగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు నష్టాలు వస్తున్నాయి? అప్పులు ఎందుకు పెరుగుతున్నాయి? గతంలో ప్లాంట్ బిఐఎఫ్ఆర్ కి వెళ్ళినప్పుడు ఆర్థిక సహాయం అందించాం! మళ్లీ ఇప్పుడు ఎందుకు ఇవ్వాల్సి వస్తున్నది? ఎంతకాలం ఇలా ఇస్తాం? ప్రతిసారీ సెంటిమెంట్ ముందుకు తీసుకొస్తున్నారు. సెంటిమెంటు ఎంతోకాలం పని చేయదు. ప్లాంట్ సొంత కాళ్ళపై నిలబడాలి...అని ముఖ్యమంత్రి మాట్లాడారు. ఇవన్నీ ఆయనకు తెలియనివి కావు. ఎందుకు మళ్లీ వీటిని తెరపైకి తెస్తున్నారు? ఎన్నికలకు ముందు ఈ వాదనలు ఎందుకు చేయలేదు? అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పల్లవి ఎందుకెత్తుకున్నారు? వీటిని కావాలనే పథకం ప్రకారం ముఖ్యమంత్రి ముందుకు తీసుకొస్తున్నారు. బిజెపి కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాల్లో కూరుకుపోయిందని, ఇది నష్టాల కంపెనీ అని, దీనిని ఎంత మాత్రం ప్రభుత్వ రంగంలో ఉంచకూడదని ప్రచారం చేసింది. మొత్తంగా ఇది నష్టాల పరిశ్రమ అనే భావన కల్పించాలనే లక్ష్యంతో తెలుగుదేశం కూటమి, కేంద్ర బిజెపి ప్రభుత్వం కలిసి ఈ వాదనలను ముందుకు తీసుకొస్తున్నాయి.



ఇప్పటి వరకు కేంద్ర బిజెపి ప్రభుత్వం మాత్రం ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరిస్తున్నట్లు ప్రకటన చెయ్యలేదు. ముఖ్యమంత్రి కూడ దీనిపై ఒత్తిడి చేయటం లేదు. తాజాగా ఆర్థిక ప్యాకేజీని ముందుకు తీసుకొస్తున్నారు. ప్లాంట్ పూర్తి స్థాయిలో నడవాలంటే తప్పని సరిగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాల్సిందే. అప్పుల భారం తగ్గించాల్సిందే. కానీ ప్రైవేటీకరణ ఉపసంహరిస్తున్నాం అనే ప్రకటన చేయకుండా ఆర్థిక ప్యాకేజీనే ముందుకు తీసుకురావటం వల్ల ప్లాంట్ సమస్యకి శాశ్వత పరిష్కారం లభించదు. ప్లాంట్‌కి వచ్చిన సమస్యలన్నీ ప్రైవేటీకరణ నిర్ణయం వల్లే. ప్రైవేటీకరణ ఉపసంహరిస్తేనే అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టత ప్రకటించకుండా దాచిపెడుతున్నది. కాకపోతే మేం అధికారంలో ఉన్నంతకాలం ప్రైవేటీకరణ కానివ్వం అంటున్నారు. దీని అర్థమేమిటి? ప్రైవేటీకరణ నిర్ణయం నుండి బిజెపి ప్రభుత్వం వెనక్కి వెళ్ళదని చెప్పటమే!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు తెస్తున్న వాదనలన్నీ పూర్తిగా దురుద్దేశంతో కూడుకున్నవి. వాస్తవంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాల పరిశ్రమ కాదు. ఇప్పటి వరకు మొత్తం రూ.12,900 కోట్ల లాభాలు పొందింది. 2018-19లో కూడ లాభాలు పొందింది. 2021-22లో అయితే అత్యధిక టర్నోవర్‌తో లాభాలు గడించి రికార్డు సృష్టించింది. ఇదే ఏడాది విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్ముతున్నట్లు బిజెపి ప్రభుత్వం ప్రకటన చేసింది. ఇక్కడ నుండి ప్లాంట్‌ను దెబ్బతీసే కుట్రలు ప్రారంభమయ్యాయి. 73 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్ధ్యాన్ని వినియోగంలోకి రానివ్వకుండా ఉత్పత్తి పెరుగుదలను అడ్డుకుంది. ఉత్పత్తికి కీలకమైన 3వ బ్లాస్ట్ ఫర్నేస్‌ను అర్థాంతరంగా మూసేసింది. ముడిసరుకు, వర్కింగ్ క్యాపిటల్ సమస్యని సృష్టించి మరో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా మూసేసి ప్లాంట్‌ని నష్టాల్లోకి నెట్టింది.

అప్పులు ఎందుకు పెరిగాయి? సొంత లాభాల రిజర్వు నిధులతో పాటు బ్యాంకుల నుండి మరో 12 వేల కోట్లు అప్పులు తీసుకొని ప్లాంట్‌ని 34 లక్షల టన్నుల నుండి 73 లక్షల టన్నుల సామర్థ్యానికి విస్తరించింది. ఈ విస్తరణ వల్ల అదనంగా 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడ్డాయి. అయితే కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రైవేటీకరణ వైఖరి వల్ల పూర్తి సామర్థ్యం వినియోగంలోకి రాలేదు. ఫలితంగా అప్పులు పెరిగాయి.

మరో ముఖ్యమైనది స్టీల్‌ప్లాంట్‌కి సొంత ముడి ఇనుప గనులు లేవు. దేశంలో అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పరిశ్రమలకు సొంత ముడి ఇనుప గనులు కేటాయించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించిన తరువాతే దేశంలో ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ల నిర్మాణం జరిగింది. వీటన్నింటికి పుష్కలంగా ఇనుప గనులు కేటాయించారు. విశాఖ స్టీల్‌ప్లాంటుకు మాత్రం ముడి ఇనుప గనులు, బొగ్గు గనులు కేటాయించకుండా వివక్షత చూపుతూ వస్తున్నారు. ఫలితంగా స్టీల్‌ప్లాంట్‌పై ఏడాదికి కనీసం రూ.3 వేల కోట్ల అదనపు భారం ముడి ఇనుప గనుల వ్యయం మీదే పడుతున్నది. ప్రతి టన్ను ముడి ఇనుముపై రూ. 5 నుండి 8 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఫలితంగా ఉత్పత్తి ఖర్చులు పెరిగి స్టీల్‌ప్లాంట్ నష్టాలు చవిచూస్తున్నది. ఈ కఠోర వాస్తవాలన్ని 'తెలుగుదేశం-జనసేన' కూటమి ప్రభుత్వ కళ్ళ ముందు కనిపిస్తున్నవే. కాని కార్మికులు ఎక్కువమంది ఉన్నారని, పని చేయడంలేదని అందువల్లే నష్టాలు వస్తున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

2000 సంవత్సరంలో ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ కింద సహాయం అందించింది. దీనినే పదేపదే ప్రచారం చేస్తున్నారు. ఏదో దానధర్మం చేస్తున్నట్లు, దయాదాక్షిణ్యంగా ఇస్తున్నట్లు వీరి ప్రచారం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.2937 కోట్ల సొమ్మును తిరిగి చెల్లించటంతోపాటు ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి పన్నులు, డివిడెండ్ల ద్వారా రూ.58 వేల కోట్లు తిరిగి చెల్లించిన వాస్తవాలను కప్పిపుచ్చి ప్లాంట్‌పై దుష్ప్రచారానికి వొడిగట్టారు. ఇది ప్రభుత్వ కంపెనీ అని, దీనివల్ల ప్రాంతీయ అభివృద్ధి జరుగుతున్నదని, ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నదనే, ఒక మహా నగరానికి ఆర్థిక జీవనాడిగా ఉందనే వాస్తవాలని ప్రజల నుండి తొలగించటానికి ఈ ప్రచారాన్ని ముందుకు తెస్తున్నారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ విలువ రూ. 3 లక్షల కోట్లు పైనే ఉంది. మరో కోటి 20 లక్షల టన్నుల సామర్థ్య విస్తరణకు, 50 వేల మందికి అదనంగా ఉద్యోగాలు కల్పించడానికి అవకాశాలున్నాయి. దేశంలో సముద్ర తీరం, పోర్టు కనెక్టివిటి ఉన్న ఏకైక స్టీల్‌ప్లాంట్ కూడా ఇది ఒక్కటే. ఇటువంటి శక్తివంతమైన ప్రజాభివృద్ధి స్టీల్‌ప్లాంట్‌ని ధ్వంసం చేయటం దేశద్రోహమే అవుతుంది.

ఈ నేపథ్యంలో విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో విలీనం చేయటమే శాశ్వత పరిష్కారం. ఇది అందరి డిమాండ్. 'చంద్రబాబు-పవన్'లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పదేపదే చెబుతూ వచ్చింది కూడా ఇదే. ఎందుకు సెయిల్‌లో విలీనం చేయాలి? స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) అనేది ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సంస్థ. ఈ సంస్థ కింద భారతదేశంలో ప్రభుత్వ స్టీల్ కంపెనీలైన భిలాయ్, బొకారో, దుర్గాపూర్, రూర్కెలా, ఇస్కో, తదితర అన్ని సెయిల్ కిందే ఉన్నాయి. ఒక్క వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మాత్రమే సెయిల్ బయట ఉంది. ప్రారంభంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కూడా సెయిల్ లోనే ఉండేది. 1982లో దీనిని సెయిల్ నుండి విడదీశారు. ఆ సందర్భంగా బైలదిల్లా లోని 4, 5 బ్లాక్‌ల ఇనుప గనులు ఇస్తామని, ముడి ఇనుప ఖనిజం నిరంతరాయంగా సరఫరా చేస్తామని అప్పటి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. సెయిల్‌లో ఉద్యోగులకు ఉన్న సదుపాయాలన్ని విశాఖ స్టీల్‌లో కూడా అమలు చేస్తామనే భరోసా కూడా ఇచ్చారు. కానీ ఇచ్చిన హామీ ప్రకారం సొంత ముడి ఇనుప గనులు కేటాయించలేదు. ఈ పరిస్థితుల్లో తిరిగి సెయిల్‌లో విలీనం చేయటమే సరైన పరిష్కారం. సెయిల్ దగ్గర పెద్ద ఎత్తున ముడి ఇనుప గనులు ఉన్నాయి. దీంతో స్టీల్‌ప్లాంట్‌కి ముడి ఇనుప గనుల సమస్య పరిష్కారం అవుతుంది.

కేంద్ర స్టీల్ సహాయ మంత్రి, రాష్ట్ర బిజెపికి చెందిన శ్రీనివాస వర్మ కొత్త పల్లవి అందుకున్నారు. సెయిల్‌లో విలీనం చేయటానికి టెక్నికల్ సమస్యలు ఉన్నాయని, 35 శాతం వాటాలు అమ్మబడ్డాయని అంటున్నారు. అంటే సెయిల్‌లో విలీనానికి బిజెపి అంగీకరించటం లేదని తేలిపోతున్నది. అందువల్లే ముఖ్యమంత్రి సెయిల్‌లో విలీనంపై ఒత్తిడి చేయటంలేదని తెలుస్తున్నది.


ఇప్పుడు పరిస్థితి ఏమిటి? ఒక వైపు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తాం, ప్యాకేజీకి చర్చిస్తున్నాం అని రాష్ట్ర ముఖ్యమంత్రి పదేపదే ప్రచారం చేస్తుండగా రెండో వైపు కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్లాంట్‌పై దాడి తీవ్రతరం చేసింది. రాత్రికి రాత్రే ఎలాంటి నోటిసులు ఇవ్వకుండానే 4200 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడానికి ప్రయత్నం చేసారు. ఆఫీసర్లను ఇతర ప్లాంట్లకు బదిలీ చేస్తున్నారు. 2500 మంది పర్మినెంట్ కార్మికులను తొలగించడానికి విఆర్ఎస్ ప్రకటించారు. మెయింటినెన్స్ కోసం కాంట్రాక్టర్ల టెండర్లు పిలవకుండా నిలుపుదల చేసి 700 మందికి పైగా కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి లేకుండా చేశారు. పర్మినెంట్ కార్మికులకు వేతనాలు నెలలో రెండు సార్లు ఇస్తూ ఇప్పుడు ఏకంగా స్టీల్ మంత్రి చెబితేనే వేతనాలు ఇస్తామని యాజమాన్యం చెపుతున్నది. కాంట్రాక్టు కార్మికులకైతే 2 లేదా 3 నెలలకొకసారి వేతనాలు ఇస్తున్నారు. రిటైర్ అయిన వారికి ఇవ్వాల్సిన ఫైనల్ సెటిల్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడంలేదు. ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్ఆర్ఎ)ని నిలుపుదల చేశారు. క్వార్టర్స్ విద్యుత్ చార్జీలు యూనిట్ ధర 8 రూపాయలకు పెంచారు. కార్మికుల పొదుపు సొమ్మును కూడా వినియోగించుకోనీయటం లేదు. ఇలా అనేక చట్టబద్ధ హక్కులు, సదుపాయాలు ఇవ్వబోమని ఏకపక్షంగా సర్క్యులర్లు జారీ చేశారు. ఒక ప్రభుత్వ రంగ సంస్థలో రాజ్యాంగం కల్పించిన కార్మిక చట్టాలన్నింటిని బిజెపి యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ ప్లాంటులో అల్లకల్లోలం సృష్టిస్తున్నది. ముఖ్యమంత్రికి ఈ అరాచకం అంతా తెలుసు. కాని కేంద్ర బిజెపిపై ఒత్తిడి పెంచి వీటిని ఆపే చర్యలు చేపట్టకుండా నరేంద్ర మోడీ భజన చేస్తున్నారు.

ప్లాంట్ రక్షణ, ప్యాకేజీ చర్చల పేర చంద్రబాబు-పవన్ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. ఈ వ్యూహంలో ప్రైవేటీకరణ ఉపసంహరణ, సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం, అప్పులపై మారటోరియం, నిర్వాసితులకు ఉపాధి, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులకు రక్షణ వంటి కీలకమైన చర్యలు మసకబారిపోతున్నాయి. ఈ వ్యూహం విశాఖ స్టీల్ ప్లాంట్ భవిష్యత్తుకి తీవ్ర నష్టం. రాష్ట్ర ప్రభుత్వం ఈ వైఖరి వీడాలి. కేంద్ర బిజెపిపై ఒత్తిడి పెంచి తక్షణం ప్రైవేటీకరణ ఉపసంహరిస్తూ, ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటన చేయించాలి. ఈ నిర్ణయమే రాష్ట్రానికి భవిష్యత్తు.


/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

విషపూరితమైన పని సంస్కృతి దిగుమతి

సమస్య



పులాప్రె బాలకృష్ణన్



ఆ సంస్థలో నెలకొన్న పని సంస్కృతి ఒకప్పుడు మన దేశంలో ఉనికిలో లేదు. 1991లో మొదలు పెట్టిన ఉదారవాద సంస్కరణలలో భాగంగా విదేశీ పెట్టుబడులతో పాటుగా ఈ పని సంస్కృతి వచ్చింది. 'పెట్టుబడి సంచయానికి విదేశీ పెట్టుబడులను రెండు చేతులా ఆహ్వానించడమే ఉత్తమమైన మార్గం. తద్వారా ప్రపంచ స్థాయి అత్యుత్తమ యాజమాన్య పద్ధతులు అలవడతాయ'ని పాలకులు భావించారు. పూణే దుస్సంఘటన ఈ 'అత్యుత్తమ' యాజమాన్య పద్ధతులలో భాగమే. విదేశీ పెట్టుబడులకు మన తలుపులు బార్లా తెరవడం ద్వారా మన దేశం బావుకున్న లాభం ఏమిటో తెలియదు కానీ, ఆ వంకన రంగప్రవేశం చేసిన బహుళ జాతి కంపెనీలు మాత్రం విపరీతంగా లాభపడ్డాయి.

పూణేలోని ఒక పెద్ద కన్సల్టెన్సీ కంపెనీలో పని చేస్తున్న ఇరవయ్యవ పడిలో ఉన్న ఒక భారతీయ మహిళ ఆఫీసు నుండి ఇంటికి తిరిగివచ్చాక మరణించింది. ఆఫీసులో పని ఒత్తిడి మూలంగానే ఆమె చనిపోయిందని ఆ యువతి తల్లి విశ్వసిస్తున్నది.

లోతైన కారణాలు ఏమిటనేది అంచనా వేయడం కష్టం. కానీ 'ఆఫీసులో ఎక్కువ గంటలు పని చేయాల్సి రావడం, నివేదికలు రూపొందించడానికి పద్ధతీ పాడూ లేకుండా ఇష్టారాజ్యంగా గడువులు నిర్దేశించడం...ఇవన్నీ చాలా ఒత్తిడికి గురిచేస్తున్నాయని మా అమ్మాయి తరచూ చెప్పేది' అని ఆమె తల్లిదండ్రులు బహిరంగంగానే ప్రకటించారు.

ఈ మరణవార్త వెలువడ్డాక అదే కంపెనీలో పనిరీత్యా తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి ఒక మాజీ ఉద్యోగి సామాజిక మాధ్యమంలోనే వివరించారు. ఆ పని ఒత్తిడి తట్టుకోలేకే తాను ఆ ఉద్యోగం వదిలిపెట్టానని స్పష్టం చేశాడు. విషాదం ఏంటంటే మరణించిన యువతి పని చేసే అంతర్జాతీయ కన్సల్టెన్సీ 'ఇండియా ఆఫీస్' వెబ్‌సైట్ బ్యానర్ మీద 'మెరుగైన పని ప్రపంచాన్ని సృష్టించడమే' తమ లక్ష్యం అని ప్రకటించుకున్నది.

అమెరికన్ ముద్ర

బహుళజాతి సంస్థలు అత్యధికంగా అమెరికాకు చెందినవే. అందుకే ఆ సంస్థలలో ప్రధానంగా అమెరికన్ పని సంస్కృతి ఉంటుంది. అధిక పని గంటలతో పాటు టార్గెట్లు పూర్తి చెయ్యాలనే తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. అది అమ్మకాలు కానివ్వండి, అకౌంటింగ్, కన్సల్టెన్సీ సంస్థలు రూపొందించే నివేదికలు కానివ్వండి- సర్కారు కోసం పని చేసినా, లాభాపేక్ష సంస్థల కోసం పని చేసినా ఇదే ఒత్తిడి ఉంటుంది.

సోవియట్ యూనియన్ కుప్ప కూలిపోయాక బహుళజాతి కంపెనీల పని సంస్కృతిలో వచ్చిన మార్పులకు మూలాధారం ప్రపంచ పరిణామాల మీదా ఆర్థిక వ్యవహారాల మీదా అమెరికా ప్రభావం విపరీతంగా పెరగడమే. అమెరికా ఏది తలిస్తే అదే ప్రమాణమై కూర్చుంది. 'అమెరికాలో మాదిరిగా' అనే మాట ఊతపదంగా మారింది. అందుకే బహుళజాతి కంపెనీలు ఏ దేశమూలాలు కలిగి ఉన్నా అమెరికా లక్షణాలు పుణికి పుచ్చుకోవడం పరిపాటి అయ్యింది. ఈ సంస్కృతికి ఒక చరిత్ర ఉన్నది.

క్రైస్తవంలో మొదలైన సంస్కరణోద్యమం పని పట్ల ఉత్తర ఐరోపా దృక్పథంలో ఎలాంటి మార్పులు తీసుకొచ్చిందో జర్మనీ సామాజికవేత్త మాక్స్ వెబర్ వివరించాడు. ఆర్థిక ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఐహిక కార్యకలాపాలు నైతికంగా, ఆధ్యాత్మికంగా చర్చి కోసం చేస్తున్న ధార్మిక కార్యకలాపంగా పరిగణించాలని ప్రొటెస్టంట్లు ముఖ్యంగా కల్వినిస్టులు భావించారు. ఆదిమ పెట్టుబడిదారీ విధానానికి ఇదే పునాది అంటాడు వెబర్. ఉత్తర ఐరోపా వాసులు అమెరికా ఆవిర్భావంలో కీలక పాత్ర వహించారు. అది కూడా ప్రొటెస్టంట్ మత విశ్వాసాల ఆధారంగా తలపెట్టడంతో విపరీతంగా పని చెయ్యడానికి ఎక్కడ లేని ఔన్నత్యాన్ని ఆపాదించారు. అదే ఇవాళ అమెరికన్ పని సంస్కృతిగా పరిణమించింది. అమెరికన్ తాత్వికుడు బెంజమిన్ ఫ్రాంక్లిన్ రచనల ఆధారంగా వెబర్ ఈ నిర్ధారణలు చేశాడు. దానాదీనా మనం అర్థం చేసుకోవాల్సింది ఏంటంటే-బహుళజాతి సంస్థలలో ఈ నాడు నెలకొని ఉన్న పని సంస్కృతికి మూలం ఆ యా సంస్థాపరమైన సంస్కృతో, కాయకష్టం చేయ్యాలనే సంకల్పమో కాదు. వాస్తవానికి అది మతపరమైన దోపిడి.

ఏ ఆర్థికవేత్త అయినా ఏ దేశ పని, ఉత్పాదకతలను అయినా పోల్చి అంచనా వేయడానికి అమెరికాను ఉదాహరణగా తీసుకుంటారు. అమెరికా పని సంస్కృతి అంటే పడి చచ్చిపోయే ఈ ధోరణిలో పస ఎంతో తేల్చడానికి అమెరికన్ల పని తీరు గురించి మనం విశ్లేషించక తప్పదు. అంతర్జాతీయ కార్మిక సంస్థ -ఐఎల్ఓ- విడుదల చేసిన గణాంకాల వివరాలను ఆధారంగా చేసుకుని నేను ఈ విశ్లేషణకు పూనుకున్నాను. ప్రపంచ దేశాల తులనాత్మక అధ్యయనానికి జాతీయ తలసరి ఆదాయం ఆ యా దేశాల ప్రజానీకం జీవన ప్రమాణాలను నిర్ధారిస్తుందనేది నిర్వివాదాంశం.

కష్టించి పని చేసే తీరు అమెరికాను అగ్ర భాగాన నిలబెట్టిందని భావిస్తారు. కానీ అలాంటి పని సంస్కృతి లేని కొన్ని దేశాలు అమెరికా కన్నా అగ్ర భాగాన ఉన్నాయి. స్థూల జాతీయోత్పత్తితో తలసరి ఆదాయాన్ని పోలిస్తే 2023 నాటికి అమెరికా ప్రపంచంలో పన్నెండవ స్థానంలో ఉన్నది. గుయానా దేశాన్ని లెక్కలోంచి తీసేస్తే అమెరికా ర్యాంకు పదికి చేరుతుంది. ఆస్ట్రియా, బెల్జియం, డెన్మార్క్, ఐర్లాండ్, నెదర్లాండ్స్, నార్వే, సింగపూర్, స్వీడన్, స్విట్జర్లాండ్ దేశాలు అమెరికా కన్నా అగ్ర భాగాన ఉన్నాయి. సింగపూర్ వంటి చిన్న ఆసియా దేశం మినహా మిగిలినవన్నీ పశ్చిమ ఐరోపా దేశాలే.

ఇక్కడే సాపత్యానికి సంబంధించిన మరో అంశాన్ని వివరించాలి. ఉత్పాదకతను 'విలువ' ఆధారంగా లెక్కిస్తారు కాబట్టి అన్ని సరుకుల ఉత్పత్తిలో అగ్ర భాగాన లేకున్నా ఉత్పత్తి చేసిన సరుకుల 'విలువ' ఆధారంగా ఒక దేశం అగ్ర భాగానికి చేరుకునే అవకాశం ఉన్నది. అందుకే ఇవాళా రేపూ ప్రపంచ దేశాలు సరుకుల భౌతిక ఉత్పత్తి ఆధారంగా కాకుండా ఉత్పాదిత సరుకుల విలువ ఆధారంగా ఆ యా దేశాల ఉత్పాదకతను గణించడం పరిపాటిగా మారింది. ఈ లెక్కన చూస్తే గడిచిన అర్థ శతాబ్దంలో అమెరికా తలసరి జాతీయోత్పత్తి కేవలం స్విట్జర్లాండ్ కన్నా వేగంగా వృద్ధి చెందింది. ఈ వృద్ధి కూడా స్వల్పమే (ఆస్ట్రియా, సింగపూర్ దేశాల గణాంకాలు లభ్యం కానందున ఆ రెండు దేశాలనూ ఈ నిర్ధారణలో పరిగణనలోకి తీసుకులేదు). అంటే ప్రపంచం అంతా భావిస్తున్నట్లు అమెరికన్ ప్రజానీకం ప్రపంచ దేశాల్లోనే అత్యధిక సంపన్నులు కారు. అమెరికన్ ఉత్పాదకత వృద్ధిరేటూ ప్రపంచ దేశాల్లో అగ్రస్థానంలో లేదని స్పష్టం అవుతుంది. 'కష్టించి పని చేసిన' దాని 'విలువ' ఏమిటో ఈ గణాంకాలు రుజువు చేస్తున్నాయి.

సింగపూర్ మినహా పైన పేర్కొన్న పశ్చిమ ఐరోపా దేశాలన్నింటా సగటు వార్షిక తలసరి పని గంటలు అమెరికా కన్నా చాలా తక్కువ. అంటే తక్కువ పని గంటలు ఉన్నా అమెరికా కన్నా సంపన్న దేశంగా ఎదగ వచ్చని పై దేశాల అనుభవం మనకు స్పష్టం చేస్తుంది. పని చెయ్యడం అంటే చెమటోడ్చడం, విపరీతంగా శ్రమించడం అని కాకుండా భౌతికంగా, బౌద్ధికంగా సృజన్మాతకంగా పనిలో సంలీనం కావడం అని - ఈ రెండింటి మధ్యనా చాలా తేడా ఉందని మనకు బోధపడుతుంది.

కానీ ఎక్కువ గంటలు శ్రమించడమే పనిగా ఉన్నతీకరించే సంస్కృతి చాలా దేశాల్లో ప్రబలిపోయింది. బహుళజాతి సంస్థలలో పని ఒత్తిడితో అకాల, ఆకస్మిక మరణాలు సంభవిస్తున్నా సరే పని సంస్కృతిని సమీక్షించుకోవడానికి మాత్రం మన దేశం సిద్ధంగా లేదు. 150 ఏళ్ల క్రితమే పని గంటలు ఎంత ఎక్కువైతే అంత లాభాలు గడిస్తారని కార్ల్‌మార్క్స్ వివరించి చెప్పాడు. వాస్తవానికి ఆ పని గంటలలో కొంత భాగం మాత్రమే జీతం రూపేణా ఉద్యోగి, కార్మికుల జీవనావసరాల కోసం చెల్లిస్తారు. మిగిలిన పని గంటల ఫలితాన్ని పెట్టుబడిదారుడు లాభం కింద మింగేస్తాడు. పెట్టుబడిదారుల మధ్యన నెలకొనే అనారోగ్యకరమైన పోటీ మూలంగా లాభాలు తగ్గుముఖం పడతాయి. అలా లాభాలు తగ్గినప్పుడల్లా పెట్టుబడిదారుడు పని గంటలు పెంచి తన లాభాల్లో నష్టాన్ని పూడ్చుకోవడానికి చూస్తాడు. లేదూ కార్మికులు మరింత వేగంగా పనిచేసేలా చూస్తాడు. అదే ఇప్పుడు మన చర్చలో ఉన్న కన్సల్టింగ్ సంస్థల విషయానికి వస్తే తక్కువ గడువులో ఎక్కువెక్కువ నివేదికలు రూపొందించేలా చూస్తారు.

విదేశీ పెట్టుబడుల తోక

ఆ సంస్థలో నెలకొన్న పని సంస్కృతి ఒకప్పుడు మన దేశంలో ఉనికిలో లేదు. 1991లో మొదలు పెట్టిన ఉదారవాద సంస్కరణలలో భాగంగా విదేశీ పెట్టుబడులతో పాటుగా ఈ పని సంస్కృతి వచ్చింది. 'పెట్టుబడి సంచయానికి విదేశీ పెట్టుబడులను రెండు చేతులా ఆహ్వానించడమే ఉత్తమమైన మార్గం. తద్వారా ప్రపంచ స్థాయి అత్యుత్తమ యాజమాన్య పద్ధతులు అలవడతాయ'ని పాలకులు భావించారు. పూణే దుస్సంఘటన ఈ 'అత్యుత్తమ' యాజమాన్య పద్ధతులలో భాగమే. విదేశీ పెట్టుబడులకు మన తలుపులు బార్లా తెరవడం ద్వారా మన దేశం బావుకున్న లాభం ఏమిటో తెలియదు కానీ, ఆ వంకన రంగప్రవేశం చేసిన బహుళ జాతి కంపెనీలు మాత్రం విపరీతంగా లాభపడ్డాయి.

2017-22 మధ్య ఐదేళ్ల కాలంలో కేవలం నాలుగు అంతర్జాతీయ కన్సల్టింగ్ సంస్థలు భారత ప్రభుత్వం నుండి అత్యధికంగా 305 ప్రాజెక్టులు దక్కించుకున్నాయి. ఆ నాలుగు కంపెనీలు ఆర్జించిన సంపదలో మన దేశం నుండి దక్కినదే అత్యధికం. సంస్థలు పేరుకే అంతర్జాతీయం అయినా ఇక్కడ పని చేసే వారంతా మన వాళ్లే కదా. అంటే మన దేశంలో ఉన్న నిష్ణాతులను మన ప్రభుత్వాలు ఉపయోగించుకోలేనంత అసమర్థంగా తయారయ్యాయా? ఈ జాడ్యం ఈ మధ్య కాలంలో దక్షిణాది రాష్ట్రాలకు కూడా పాకడం దురదృష్టకరం.

పూణే సంఘటన తరువాతైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి అంతర్జాతీయ, బహుళజాతి సంస్థలలోని పని గంటలను, పని పద్ధతులను పర్యవేక్షించడానికి తగిన విధివిధానాలు రూపొందించాలి. దేశీయ కంపెనీలలో ఆఫ్-షోర్ ప్రాజెక్టులలో పని చేస్తున్న ఉద్యోగులలో కూడా ఇలాంటి ఆకస్మిక మరణాలు సంభవిస్తున్నాయని తెలియవస్తున్నది. గ్లోబల్ క్లయింట్ల అవసరాల మేరకు ఇక్కడ పనిచేసే సిబ్బంది ఆ యా దేశాల కాలమానం ప్రకారం షిఫ్టులలో పని చేస్తున్నారు. కానీ క్లయింట్లను భారతీయ కాలమానాన్ని అనుసరించమని అడగడానికి సాహసించడం లేదు. జరగాల్సింది అది కదా.

(రచయిత తిరువనంతపురంలోని 'సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్'లో విజిటింగ్ ప్రొఫెసర్)

భానుకిరణ్‌కు సుప్రీంకోర్టు బెయిల్...
జైలు నుంచి విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మద్దెలచెర్వు సూరి అలియాస్ గంగుల సూర్యనారాయణరెడ్డి హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న మలిశెట్టి భానుకిరణ్ బుధవారం హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. అక్కడ నుంచి ఆయన నేరుగా అనుచరులతో కలిసి బెంగళూరు వెళ్లారు. విడుదల అనంతరం భానుకిరణ్ మీడియాతో మాట్లాడుతూ ఎవరి వల్ల తనకు ప్రాణాపాయంలేదని చెప్పారు. కోర్టు అనుమతి తీసుకున్న తర్వాత అన్ని విషయాలు వెల్లడిస్తానని తెలిపారు. అంతకుముందు మాట్లాడేందుకు భాను నిరాకరించారు. సూరి హత్య కేసును ఐదేళ్లపాటు విచారించిన ప్రత్యేక కోర్టు.. భానుకిరణ్‌ను దోషిగా నిర్ధారిస్తూ 2017లో తీర్పు ప్రకటించింది. కింది కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన 2018లో హైకోర్టును ఆశ్రయించారు. కింది కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు భానుకిరణ్ పిటిషన్ తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తేప్పీలుదారుడిని బెయిల్‌పై విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.

ఎల్‌ఎంవి లైసెన్స్ ఉన్నవారు లైట్ ట్రాన్స్ పోర్ట్ వెహికల్ నడపొచ్చు

- సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లైట్ మోటర్ వెహికల్స్ (ఎల్ఎంవి) డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు లైట్ ట్రాన్స్ పోర్ట్ వెహికల్ (7,500 కిలోల కంటే తక్కువున్న) వాహనాలు నడపొచ్చని సుప్రీంకోర్టు మరోసారి తేల్చి చెప్పింది. ఎల్ఎంవి లైసెన్స్ హోల్డర్లు లైట్ ట్రాన్స్ పోర్ట్ వెహికల్ నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగినట్లు ఎలాంటి డేటా లేదని పేర్కొంది. అందువల్ల గతంలో ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు సుప్రీంకోర్టు ఆదేశాల్లో పేర్కొంది. 2017 లో ముకుంద్ దేవాంగన్ వర్సెస్ ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కేసులో ఎల్ఎంవి లైసెన్స్ హోల్డర్లు లైట్ ట్రాన్స్ పోర్ట్ వెహికల్ నడిపేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. ఈ తీర్పును పున: సమీక్షించాలని పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది.

ధర్మాసనం తరపున జస్టిస్ హృషికేశ్ రాయ్ 126 పేజీల తీర్పును వెలువరించారు. ప్రధానంగా మోటర్ వెహికల్ (ఎంవి) యాక్ట్ లోని పలు అంశాలను ప్రస్తావిస్తు నాలుగు ప్రధాన అంశాలను పొందుపరిచారు.

ఇజ్రాయిల్ రక్షణ మంత్రికి ఉద్వాసన !

- ఆకస్మికంగా ప్రకటించిన నెతన్యాహు
- ఆ స్థానంలో విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ నియామకం
- ఇద్దరి మధ్య నమ్మకం కొరవడిందని వ్యాఖ్యలు
- నెతన్యాహు నివాసం వెలుపల నిరసనలు
- ఇజ్రాయిల్‌పై ఆయుధ ఆంక్షలు : ఐక్యరాజ్య సమితికి 52 దేశాల వినతి


ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌తో ప్రధాని బెంజామిన్ నెతన్యాహు

గాజా, బీరుట్, జెరూసలేం : పశ్చిమాసియావ్యాప్తంగా గాజా, లెబనాన్, ఇరాన్‌లపై వరుసగా దాడులు కొనసాగిస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్న వేళ ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రధాని బెంజామిన్ నెతన్యాహు ఆకస్మికంగా ప్రకటించారు. మంగళవారం రాత్రి ఈ మేరకు ప్రకటన వెలువడింది. కొత్త రక్షణ మంత్రిగా విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ నియమితులు కానున్నారు. గతంలో నెతన్యాహు ప్రత్యర్థి, ఇటీవల ప్రభుత్వంలో తిరిగి చేరిన గైడెన్ సార్ విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా రక్షణ మంత్రిని తొలగించిన వెంటనే నెతన్యాహు నివాసం వెలుపల ఆందోళనకారులు నిరసనలు చేపట్టారు. గాలంట్‌ను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేలాదిమంది వీధుల్లోకి వచ్చి, రహదారులను దిగ్బంధించారు.

గాజాపై సాగుతున్న దాడుల విషయంలో నెతన్యాహు, గాలంట్ మధ్య తరచుగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతూ వుండేవి. అయినా గాలంట్‌ను తొలగించే విషయం కాస్తంత వెనుకంజ వేస్తూ వచ్చారు. అయితే తమిద్దరి మధ్య విశ్వాస సంక్షోభం, గణనీయమైన అంతరాలు నెలకొన్నాయని డిస్మిస్ చేసిన సందర్భంగా నెతన్యాహు ప్రకటించారు. "యుద్ధం మధ్యలో వున్నపుడు, గతంలో కంటే ఎక్కువగా పూర్తి స్థాయిలో విశ్వాసం నెలకొనాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధం మొదలైన తొలినాళ్లలో తమిద్దరి మధ్య అటువంటి విశ్వాసం నెలకొందని, కానీ దురదృష్టవశాత్తూ, కాల క్రమేణా చివరికి వచ్చేసరికి ఈ విశ్వాసం ముక్కలైపోయిందని ఆయన పేర్కొన్నారు. గతేడాది అక్టోబరు 7న దాడుల తర్వాత గాజాపై దాడులు ప్రారంభించిన సమయంలో ఇజ్రాయిల్ నాయకత్వం అంతా సమిష్టిగానే పనిచేసింది. కానీ యుద్ధం ఏడాది కాలంగా కొనసాగుతూ రావడం. పైగా లెబనాన్‌కు పాకడంతో కీలకమైన విభేదాలు తలెత్తాయి. హమాస్‌పై మిలటరీ ఒత్తిడి కొనసాగించాలన్నది నెతన్యాహు ఉద్దేశంగా వుండగా, గాలంట్ మాత్రం మరింత ఆచరణాత్మకమైన వైఖరిని అనుసరిస్తూ వచ్చారు. దౌత్య ఒప్పందం కుదుర్చుకోవాల్సిన పరిస్థితులను మిలటరీ సృష్టించిందని, కాబట్టి ఒప్పందం కుదుర్చుకుని బందీలను స్వదేశానికి తెచ్చుకోవాలని గాలంట్ చెబుతూ వచ్చారు. ఇజ్రాయిల్ భద్రతే ఎప్పటికీ తన జీవిత ధ్యేయంగా వుంటుందని గాలంట్ మంగళవారం నాటి రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

గాజా, లెబనాన్‌ల్లో కొనసాగుతున్న దాడులు

ఉత్తర గాజాలోని బెయిట్ లాహియా పట్టణం, సెంట్రల్ గాజాలోని నుస్రత్ శరణార్ధ శిబిరంపై బుధవారం ఉదయం నుండి వరుసగా దాడులు కొనసాగుతున్నాయి. మరోవైపు దక్షిణ లెబనాన్‌లోని టైర్ జిల్లాలో బర్జా పట్టణం సహా పలు పట్టణాలు, గ్రామాల్లో ఇజ్రాయిల్ మిలటరీ దాడులు కొనసాగిస్తోంది. తీర ప్రాంత పట్టణమైన బర్జాలో 20మంది మరణించారని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

52 దేశాల లేఖ

ఇజ్రాయిల్‌పై ఆయుధ ఆంక్షలు విధించాలని ఐక్యరాజ్య సమితిని 52 దేశాలు కోరాయి. ఈ మేరకు టర్కీ నేతృత్వంలో 52 దేశాలు, అరబ్ లీగ్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (ఓఐసి) సంస్థలు భద్రతా మండలికి ఒక లేఖ అందచేశాయి. ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరాలను తక్షణమే నిలిపివేయాలని కోరాయి. అంతర్జాతీయ చట్టాలను పదే పదే ఉల్లంఘిస్తున్న, మానవతా సాయం చట్టాన్ని ఉపేక్షిస్తున్న ఇజ్రాయిల్‌పై చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయంగా ఒత్తిడి వస్తోంది. ఇజ్రాయిల్‌పై తక్షణమే చర్యలు తీసుకుని అమాయకులైన ప్రజలను కాపాడాలని ఆ దేశాలు కోరాయి. ఈ మేరకు 52 దేశాలు సంతకాలు చేసిన లేఖను టర్కీ అందచేసింది.

ప్రభుత్వ ఉద్యోగులు, జడ్జీల ప్రాసిక్యూట్‌కు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి

- ఎపికి చెందిన మాజీ ఐఎఎస్ అధికారి బిపి ఆచార్య కేసులో సుప్రీం తీర్పు
- తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులతో ఏకీభావం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నప్పుడు ఆరోపించబడ్డ నేరాలకు ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయమూర్తులను ప్రాసిక్యూట్ చేయడానికి ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సిఆర్‌పిసి సెక్షన్ 197 (1) లాగే, ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఎ) వర్తిస్తుందని తేల్చిచెప్పింది. అందువల్ల ప్రభుత్వ ఉద్యోగులపై పిఎంఎల్‌ఎ కేసుల దర్యాప్తుకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందేనని పేర్కొంది. రాష్ట్ర మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డికి లబ్ధి చేకూరేలా అప్పటి ఐఎఎస్ అధికారి బిభూ ప్రసాద్ ఆచార్య వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూమి కేటాయింపుల్లో అధికార దుర్వినియోగం, అనధికార రాయితీలు, ఆస్తులను తక్కువ అంచనా వేసినట్లు, దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్ర ఆర్థిక నష్టం జరిగినట్లు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆరోపించింది. అలాగే పై లావాదేవీలను సులభతరం చేసేందుకు ప్రముఖ వ్యక్తులతో ఆచార్య కుట్ర పన్నారంటూ మనీలాండరింగ్ యాక్ట్ కింద కేసు ఫైల్ చేసింది.

పిఎంఎల్‌ఎ కింద విచారణ లో భాగంగా స్పెషల్ జడ్జి ఇడి దాఖలు చేసిన కంప్లైంట్‌ను పరిగణలోకి తీసుకుంది. అయితే... ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆచార్య తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా సిఆర్‌పిసి సెక్షన్ 197 కింద ప్రభుత్వ ఉద్యోగిని ప్రాసిక్యూషన్ చేయాలంటే ముందస్తు ప్రభుత్వ అనుమతి తప్పని సరి అని ఆచార్య తరపు న్యాయవాదులు వాదించారు. అయితే పిఎంఎల్‌ఎ, సెక్షన్ 65, 71 కింద తమకు ప్రత్యేక అధికారాలు ఉన్నందున ఎలాంటి అనుమతులు అవసరం లేదని ఇడి వాదించింది. సుదీర్ఘ వాదనల తరువాత 2019 జనవరి 21న తెలంగాణ హైకోర్టు ఆచార్యకు ఊరట కల్పిస్తూ, స్పెషల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసింది. దీన్ని సవాల్ చేస్తు ఇడి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ పై బుధవారం జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది.

19న నాదల్ వీడ్కోలు మ్యాచ్

- తరలిరానున్న టెన్నిస్ దిగ్గజాలు

మాడ్రిడ్: టెన్నిస్ మాజీ వరల్డ్ నంబర్ వన్ ఆటగాడు, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ వీడ్కోలు మ్యాచ్‌కు తేదీ ఖరారైంది. ఈ ఏడాది జరిగే డేవిస్ కప్ ఫైనల్స్‌తో నాదల్ తన సుదీర్ఘ కెరీర్‌ను ముగించనున్నాడు. ఈ విషయాన్ని టోర్నమెంట్ డైరెక్టర్ ఫెలిసియానో లోపెజ్ బుధవారం వెల్లడించాడు. స్వదేశంలో జరుగబోయే డేవిస్ కప్ ఫైనల్స్ 8వ సీజన్ నాదల్‌కు ప్రొఫెషనల్ ప్లేయర్‌గా ఆఖరి మ్యాచ్. అక్కడి మలగాలో నవంబర్ 19న ఈ టోర్నీ మొదలు కానుంది. ఆరు రోజుల పాటు సాగే డేవిస్ కప్ ఫైనల్స్‌లో రఫా చివరిసారిగా దేశం తరపున బరిలోకి దిగుతున్నాడు. దాంతో, అతడి విజయం సాధించాలని అభిమానులంతా కోరుకుంటున్నారు. టెన్నిస్ యోధుడైన నాదల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించి అతడికి ఘన వీడ్కోలు పలకాలని ఫెదరర్, జకోవిచ్, ముర్రేలతో పాటు పలువురు టెన్నిస్ స్టార్లు హాజరుకానున్నారని వెల్లడించాడు. నాదల్ అక్టోబర్‌లోనే టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పాడు. చివరి టోర్నీగా డేవిస్ కప్ ఫైనల్స్ ఆడుతానని అప్పుడే తెలిపాడు. కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించాడు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరణమృదంగం

- మన్యంలో రెండు రోజుల్లో ముగ్గురు విద్యార్థుల మృతి
- పిట్టల్లా రాలుతున్న చిన్నారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

ప్రజాశక్తి-యంత్రాంగం

పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరణ మదంగం కొనసాగుతూనే ఉంది. జిల్లాలో ఎక్కడో ఒకచోట విద్యార్థులు అనారోగ్యానికి గురై పిట్టల్లా రాలుతున్నారు. ఏ పాఠశాలలో ఎప్పుడు, ఎవరికి ఏమవుతుందో తెలియక భయంతో తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆశ్రమ పాఠశాల్లో వరుసగా కొనసాగుతున్న విద్యార్థుల మరణాలతో అటు తల్లిదండ్రులు, ఇటు విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ముగ్గురు మరణించడంతో జిల్లా వ్యాప్తంగా వసతిగృహాల్లో పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది.


జీవన్ కుమార్


నితిన్

గిరిజన విద్యార్థి ఆకస్మిక మృతి

జియ్యమ్మవలస మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ (12) ఆకస్మికంగా మృతి చెందాడు. బుధవారం తెల్లవారుజామున తనకు ఎక్కువగా తలనొప్పి ఉందని తోటి విద్యార్థులకు చెప్పాడు. వారు వెంటనే డిప్యూటీ వార్డెన్ ఆర్.గణపతిరావుకు సమాచారమిచ్చారు. దీంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జీవన్‌ను తీసుకెళ్లారు. వైద్యాధికారి సిహెచ్ శంకర్రావు విద్యార్థికి చికిత్స అందించేలోగా జీవన్ ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణం విడిచినట్లు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.తిరుపతిరావు.. గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి పంచాయతీ ఒంజిడి గ్రామానికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. కుమారుడి హఠాణ్మరణాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

జ్వరంతో బాలుడు మృత్యువాత

కురుపాం మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న నిమ్మక నితిన్(9) అనారోగ్యంతో మృతి చెందాడు. జ్వరంతో బాధపడుతున్న నితిన్‌ను కుటుంబ సభ్యులు గత నెల 22న కురుపాం సిహెచ్‌సికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం పార్వతీపురం తరలించారు. అక్కడ చిక్సిత చేయగా జ్వరం తగ్గడంతో తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థి తిరిగి రాకపోవడంతో సోమవారం హాస్టల్ సిబ్బంది కురుపాం మండలం గుజ్జలగండ గ్రామంలో ఉన్న నితిన్ ఇంటికి వెళ్లారు. విద్యార్థి మళ్లీ తీవ్రమైన జ్వరంతో బాధపడటంతో వెంటనే కుటుంబ సభ్యులతో కలిసి వార్డెన్ సూర్యనారాయణ దుడ్డుఖల్లు పిహెచ్‌సికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి రిఫర్ చేశారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు.

విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

గిరిజన విద్యార్థుల మరణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు మరణించారని, ఈ మరణాలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందో చెప్పాలని కోరారు.

గతంలో ఆదివాసీ గిరిజన సంఘం బృందం హాస్టళ్ల పరిశీలనలో వాటర్ ప్లాంట్లు పూర్తిగా నిర్వీర్యమైన విషయం వెలుగు చూసిందని తెలిపారు. వెంటనే వాటిని బాగు చేసి మినరల్ వాటర్ విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని కోరారు. మరణించిన రావాడ రామభద్రపురం పాఠశాల విద్యార్థి జీవన్ కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం అందించాలని డిమాండ్‌చేశారు. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతూ మృతి చెందుతున్న విద్యార్థుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పది లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కురుపాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఒక గిరిజన విద్యార్థి, బుధవారం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి నిద్రలోనే చనిపోయారని చెప్పారు. జిల్లాలో ఇంతవరకు ఏడుగురు విద్యార్థులు మరణించారని, ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి బాధ్యత వహించాలని డిమాండ్‌చేశారు.

విశాఖలో కొత్తపేట మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

విశాఖపట్నం సముద్ర తీరంలో చేపల వేటకు వెళ్లిన శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేటకు చెందిన మత్స్యకారుడు గుండుపల్లి జగదీష్ (36) మృతి చెందారు. ఈ నెల 4న చేపల వేటకి వెళ్లి వల తాడును ఒడ్డుకిలాగే క్రమంలో సముద్రంలో పడి గల్లంతయ్యారు. రెండు రోజుల పాటు గాలించగా మృతదేహం లభ్యమైంది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.


సాయి భవిత (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో హాకీ క్రీడాకారిణి మృతి

ప్రజాశక్తి-పెనుకొండ (సత్యసాయి జిల్లా)

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వస్తు మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హాకీ క్రీడాకారిణి మృతి చెందిన సంఘటన పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలో బుధవారం జరిగింది. కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ అందించిన వివరాల మేరకు... పెనుకొండకు చెందిన రమేష్ రొద్దం జడ్పీ హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. సాయి భవిత(15) అనే కుమార్తె ఉన్నారు. సాయి భవిత పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరులో రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో సాయి భవిత పాల్గొని తిరిగి రైలులో ధర్మవరానికి చేరుకున్నారు. తన తండ్రి ద్విచక్ర వాహనంలో కుమార్తెను తీసుకువస్తుండగా మార్గం మధ్యలో గుట్టూరు వద్దకు రాగానే వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొంది. దీంతో తండ్రి కుమార్తెలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గుట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సాయి భవితను బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రమేష్ ను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

ఇంకానా? పంచ గ్రామాలపై వంచన...

- భూమికి భూమి కావాలంటూ దేవాదాయశాఖ మళ్లీ సర్వేలు
- ఐదుగురు ఎమ్మెల్యేలూ కూటమి పార్టీ నేతలే..
- గత సర్కారు ఇచ్చిన 'రిపేర్ల' ఉత్తర్వు మళ్లీ తెరపైకి తెచ్చిన ప్రభుత్వం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రిపేర్లు చేసుకునే ఉత్తర్వులు కాకుండా శాశ్వత పరిష్కారం కావాలంటూ ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న 'పంచగ్రామాల' రైతులు, ప్రజల నెత్తిన మళ్లీ ఆ పాత ఉత్తర్వునే కొత్త 'కూటమి' ప్రభుత్వం తెచ్చి పెట్టింది. దీంతో గ్రామాల్లో ఈ ఉత్తర్వులపై ప్రజానీకం మండిపడుతున్నారు. విశాఖ పరిసర ప్రాంతాల్లో 'పంచ గ్రామాల' భూ వివాదం ప్రధానమైనది. ఏళ్లతరబడి వారు కోరుతున్న ప్రకారం కుటుంబాల సంఖ్య, జనాభా పెరిగిపోవడం 30ఏళ్ల క్రితం నిర్మించుకున్న చిన్న చిన్న ఇళ్లలో జీవించడం ఇంకా కష్టమని, అదనపు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. గత వైసిపి ప్రభుత్వం 2023 నవంబరు 11న విడుదల చేసిన ఇళ్ల రిపేర్లకు ఇచ్చిన మెమో ఆర్‌సి నెం.11/18023(32)5/2023ను పంచ గ్రామాల్లో సింహాచలం దేవస్థానం అధికారులు తాజాగా ప్రచారంలో పెట్టారు. దీంతో ఈ గ్రామాల పరిధిలో రైతులు, ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

ఆ ఎమ్మెల్యేలంతా బాధ్యులే... బాధ్యత ఎవరిది?

రిపేర్లతో ఏం ఒరుగుతుంది? అంటూ స్థానిక ప్రజలు తాజాగా ప్రశ్నిస్తున్నారు. ఈ పంచ గ్రామాలూ విశాఖ జిల్లాలోగల 5 అసెంబ్లీ సెగ్మెంట్ల (తూర్పు, పశ్చిమం, ఉత్తరం, పెందుర్తి, భీమునిపట్నం) పరిధిలో కూటమి పార్టీలకు చెందిన టిడిపి -3 బిజెపి-1, జనసేన -1 ఎమ్మెల్యేలు గెలుపొందిన సెగ్మెంట్లలోకి వస్తాయి. 'అందరూ బాధ్యులే ఎవ్వరికీ బాధ్యత లేదా' అన్న రీతిలో జనం తాజాగా ఈ ఐదుగురు ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.



చినగదిలి, పెందుర్తి మండలాల్లోగల అడవివరం, వెంకటాపురం, వేపగుంట, చీమలాపల్లి, పురుషోత్తపురం (పంచగ్రామాలు) పరిధిలో సుమారు 15 జివిఎంసి వార్డులున్నాయి. సుమారు లక్ష మంది ప్రజలు, 25వేల కుటుంబాలకు చెందిన 1785 ఎకరాలను సింహాచలం దేవస్థానం క్లియర్ చేయాల్సి ఉంది. ఈ పంచగ్రామాల పరిధిలో మొత్తం భూమి 11,282 ఎకరాలు కాగా, దీంట్లో 9069 ఎకరాలు దేవాదాయ శాఖది మిగతా 1785 ఎకరాలు రైతులది. ఈ భూమిలోనే సింహాచలం పరిధిలోగల పైన తెలిపిన గ్రామాల్లో రైతులు, రైతుల వద్ద భూములు కొనుక్కుని అప్పులు చేసి ఇల్లు నిర్మాణాలు చేసుకుని ఆర్థిక భారంతో జీవిస్తున్న మధ్యతరగతి, పేద ప్రజలు పరిష్కారం కోసం నిరీక్షిస్తున్నారు.

గతంలో జరిగిందేమిటి? ఇప్పుడేం జరుగుతోంది?

2000 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జీవో 578 తీసుకొచ్చి ఏకపక్షంగా ఈ భూమంతా సింహాచలం దేవస్థానానికి చెందుతుందని రైత్వారీ పట్టాలను స్థానిక చినగదిలి తహశీల్దార్ చేత ఇప్పించడం జరిగింది. దీంతో 1785 ఎకరాల్లో నివాసాలుంటున్న ప్రజలు సైతం దేవస్థానం దృష్టిలో ఆక్రమణ దారులుగా పేర్కొంటూ ఇల్లు కావాలంటే రూ.డబ్బులు కట్టి రెగ్యులరైజ్ చేసుకోవాలంటూ టిడిపి ప్రభుత్వం ఆ జీవోలో పేర్కొంది. దీనిపై అప్పట్లో ఈ ప్రాంత ప్రజలు తిరుగుబాటు చేయడంతో 2024లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ జీవోను రద్దుచేసింది. సమస్య మాత్రం యథాతథంగా కొనసాగుతోంది. రైతు సంఘాలు ఈ సమస్య పరిష్కారం కోసం హైకోర్టులో కేసులు వేశాయి. దీని ప్రకారం విశాఖ ఆర్‌డిఒ వద్ద 2010లో ఇచ్చిన తీర్పు ద్వారా సింహాచలం దేవస్థానానికి 1996-1997లో చినగదిలి, పెందుర్తి తహశీల్దార్లు ఇచ్చిన రైత్వారీ పట్టాలు సక్రమం కాదంటూ పేర్కొనడం జరిగింది. ఆర్‌డిఒ కోర్టు తీర్పును సైతం ఇంతవరకూ అమలు చేయలేదు. 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 100 రోజుల్లో పంచగ్రామాల భూ సమస్యను రైతులకు అనుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి 2019 జులై 25న జీవో 794, 2020 అక్టోబర్ 29న ఒక జీవో 854 ఇచ్చేసి చేతులు దులుపుకుంది.

ఎన్నికల ఆయుధంగా....

2024 ఎన్నికల్లో కూటమి పార్టీలకు చెందిన నేతలు అధికారంలోకి రావడం కోసం పంచగ్రామాలను ఆయుధంగా వాడుకోవడం తెలిసిందే.. తాజాగా టిడిపి ప్రభుత్వం పాత వైసిపి ఇచ్చిన 'రిపేర్ల' జీవోనే తిరగదోడుతూ రైతులకు ఎంతో మేలు చేస్తున్నట్లు ప్రచారం చేస్తోంది. గడిచిన నాలుగైదు రోజులుగా యారాడ, మధురవాడ, ములగాడ పరిసర ప్రాంతాల్లో 1785 ఎకరాల ప్రత్యామ్నాయ భూమి కోసం దేవాదాయ శాఖ తన సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో భూమికి భూమి కోసం అన్వేషణ సాగిస్తోంది. ఈ డ్రామాలను ఈ ప్రాంత రైతులు ఏళ్లతరబడి చూస్తూనే ఉన్నారు. ఈ సారైనా న్యాయం జరగాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. గిల్‌మెన్ సర్వే రికార్డులలో రైతుల పేర్లే పైన తెలిపిన 1785 ఎకరాల్లోనూ ఉన్నాయి. అంటే ప్రజల వద్ద పూర్తి ఆధారాలు, రికార్డులు ఉన్నాయి. ఈ భూమిని దేవాదాయ శాఖ స్వచ్ఛందంగా వదిలేయాలి. కానీ టిడిపి గతంలో దేవస్థానానికి జారీచేయించిన రైత్వారీ పట్టాలతో సంబంధిత శాఖకు లేని హక్కులు సంక్రమించాయి. దీంతో ఇది వదులుకుంటే తమకు అంతే సమానమైన భూమి కావాలంటూ భూ అన్వేషణ చేపట్టారు.

పూర్వ ఆర్‌డిఒ భవానీ శంకర్‌పై విచారణ

- నలుగురు తహశీల్దార్లపై చర్యలు
- జెసిని ఆదేశించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పూర్వ ఆర్‌డిఒ భవానీ శంకర్ పనితీరుపై ప్రభుత్వం విచారణకు, అదే సమయంలో పనిచేసిన నలుగురు తహశీల్దార్లపై చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ సేతుమాధవ్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జెసి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తికి సూచించింది. వారం రోజుల్లో నివేదిక కూడా సమర్పించాలని పేర్కొంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి జెసి, డిఆర్‌ఒలకు వేర్వేరుగా ఆదేశాలు జారీచేసినట్టు సమాచారం. ప్రభుత్వం చర్యలకు భావిస్తున్న వారిలో భోగాపురం తహశీల్దార్‌గా పనిచేసిన రమణమ్మ, కొత్తవలస తహశీల్దార్ సురేష్, పూసపాటిరేగ తహశీల్దార్ సురేష్, జామి తహశీల్దార్ నీలకంఠరావు ఉన్నారు. వీరంతా అప్పట్లో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు తప్పడు నివేదిక ఇచ్చి ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో విఫలం చెందారనేది ప్రభుత్వ అభియోగం. ఆర్‌డిఒ భూ సేకరణ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించలేదనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.

స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పోస్టుల నోటిఫికేషన్ రద్దు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని వివిధ కోర్టుల్లో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ - సెకండ్ క్లాస్ పోస్టుల్లో నియామకం కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసినట్టు ప్రధాన జిల్లా జడ్జి బి సాయి కళ్యాణ చక్రవర్తి వెల్లడించారు. విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, కొత్తవలస, పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరులో ఈ పోస్టుల నియామకం కోసం రెండు నోటిఫికేషన్లు విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నోటిఫికేషన్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

టాప్-10లో జైస్వాల్, పంత్‌కు చోటు

- ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో రాణించిన జైస్వాల్, పంత్ తమ తమ ర్యాంకింగ్స్‌ను మెరుగుపరుచుకోగా.. నిరాశపరిచిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ర్యాంకింగ్స్‌లో వెనుకబడ్డారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) బుధవారం ప్రకటించిన పురుషుల టెస్టు బ్యాటర్స్ ర్యాంకింగ్స్‌లో విరాట్ ఏకంగా 8 స్థానాలు కోల్పోయాడు. ఒకప్పుడు నంబర్ వన్ ర్యాంక్‌లో ఉన్న రన్ మెషిన్ ఇప్పుడు ఏకంగా 22వ ర్యాంకుకు పడిపోయాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 26వ స్థానంలో నిలిచాడు. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో రాణించిన టీమిండియా బ్యాటర్లు యశస్వీ జైస్వాల్, వికెట్ కీపర్ రిషభ్ పంత్ తమ తమ ర్యాంక్‌లను మెరుగుపరుచుకున్నారు. యశస్వీ 804 రేటింగ్ పాయింట్లతో 4వ ర్యాంక్‌లో నిలువగా.. పంత్ 750 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. టెస్ట్ బ్యాటర్ల జాబితాలో టీమిండియా నుంచి యశస్వీ, పంత్ ఇద్దరే టాప్-10లో చోటు దక్కించుకున్నారు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ మాజీ సారథి జో రూట్ 903 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. కేన్ విలియమ్సన్ 804 పాయింట్లతో రెండో స్థానంలో నిలవగా.. పాకిస్థాన్‌పై ట్రిపుల్ సెంచరీతో మెరిసిన హ్యారీ బ్రూక్ 3వ ర్యాంక్‌కు ఎగబాకాడు. భారత పర్యటనలో రాణించిన న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్ 7స్థానంలో నిలువగా.. పాకిస్థాన్ స్టార్ సాద్ షకీల్ 9వ ర్యాంక్, ఆస్ట్రేలియా ఆటగాళ్లలో ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా 8 వ ర్యాంక్, మార్నస్ లబూషేన్ 10వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు.





ఉత్కంఠ పోరులో టైటాన్స్ గెలుపు

- ప్రొ కబడ్డీ సీజన్-11

హైదరాబాద్: ప్రొ కబడ్డీ సీజన్-11లో తెలుగు టైటాన్స్ వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసుకొని హ్యాట్రిక్ కొట్టింది. ఈ సీజన్‌లో తొలుత ఆడిన మూడు వరుస మ్యాచుల్లో ఓడిన టైటాన్స్... ఆ తర్వాత జరిగిన వరుస మూడు మ్యాచుల్లో సంచలన విజయాలను నమోదు చేసుకుంది. గచ్చిబౌలి స్టేడియంలో బుధవారం జరిగిన పోటీలో తెలుగు టైటాన్స్ 35-34పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌ను చిత్తుచేసింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి 20-19పాయింట్లతో ఆధిక్యతలో ఉన్న టైటాన్స్ ఆ ఒక్క పాయింట్ ఆధిక్యతను చివరి వరకు నిలుపుకుంటూ వచ్చింది. టైటాన్స్ కెప్టెన్ పవన్ షెహ్రావత్(12), ఆశీశ్ నర్వాల్(9) రైడ్‌లో రాణించగా.. విజయ్ మాలిక్(4), సాగర్(3) ట్యాకిల్స్‌లో రాణించారు. ఇక తమిళ్ జట్టులో సచిన్(17) ఒంటరి పోరాటం చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇరుజట్లు రెండేసిసార్లు ప్రత్యర్ధి జట్లను ఆలౌట్ చేశాయి. మరో మ్యాచ్‌లో యు ముంబ జట్టు మరో విజయం నమోదు చేసుకుంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో యు ముంబ జట్టు 42-40పాయింట్ల తేడాతో పట్నా పైరెట్స్‌పై విజయం సాధించింది. ముంబ రైడర్ అజిత్ చవాన్(19), మంజిత్(5) రైడ్ పాయింట్లు సాధించగా.. అమీర్(3), షోంబీర్(3) ట్యాకిల్స్‌లో మెరిసారు. ఇక పట్నా జట్టులో దేవాంక్(15), అయాన్(8)రైడ్స్‌లో రాణించగా.. సందీప్(5), దీపక్(3) ట్యాకిల్స్‌లో రాణించారు. మొత్తమ్మీద యు ముంబ జట్టు 25 పాయింట్లు రైడ్‌ల ద్వారా సాధించగా.. పట్నా 28పాయింట్లు కొల్లగొట్టింది. ట్యాకిల్స్‌లో యుంబ 11, పట్నా 7పాయింట్లు సాధించాయి. ఇరుజట్లు నాలుగేసి సార్లు ప్రత్యర్థి జట్లను ఆలౌట్ చేయగా.. యు ముంబకు ఒక అదనపు పాయింట్ లభించడం గెలుపుకు కీలకమైంది.



ప్రొ కబడ్డీలో నేడు..

బెంగాల్ వారియర్స్ క్ష్మీ దబాంగ్ ఢిల్లీ (రా.8.00గం॥లకు)

హర్యానా స్టీలర్స్ క్ష్మీ గుజరాత్ జెయింట్స్ (రా.9.00గం॥లకు)

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న

మోడీ, షాలపై ఇసి చర్యలు తీసుకోవాలి

సిపిఎం కేంద్ర కమిటీ డిమాండ్

న్యూఢిల్లీ : జార్ఖండ్ ఎన్నికల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు యత్నిసున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. పార్టీ కేంద్ర కమిటీ ఈ నెల 3వ తేదీ నుండి మూడు రోజుల పాటు ఇక్కడ సమావేశమైంది. సమావేశం అనంతరం ఈ కింది ప్రకటన విడుదలజేసింది.

ఇసి చర్యలు తీసుకోవాలి

జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడ, హోం మంత్రి అమిత్‌షా నేతృత్వంలో బిజెపి నేతలు చేస్తున్న మతపరమైన ప్రసంగాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, అలాగే రాజకీయ పార్టీలకు ఇసి జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించేవిగా ఉన్నాయి. ప్రధాని తన ప్రసంగాలలో నేరుగా ముస్లింలను లక్ష్యంగా చేసుకొని అవమానిస్తున్నారు. వారిని 'చొరబాటుదారులు'గా చిత్రీకరిస్తున్నారు. 'వారు గిరిజనుల ఆహారాన్ని, కుమార్తెలను అపహరిస్తున్నారు' అంటూ మత పరమైన, విద్వేషపూరిత ప్రసంగాలతో చాలా దూరం వెళ్లారు. వివిధ సమూహాల మధ్య విభేదాలు సృష్టించి ఓట్లను దండుకోవడానికే ఆయన ఇలా రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారన్నది స్పష్టం. అలాంటి ప్రసంగాలను ఎన్నికల కమిషన్ సుమోటోగా పరిగణనలోకి తీసుకోకపోవడం గర్హనీయం. ప్రధాని, హోం మంత్రి చట్టానికి తాము అతీతులమన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రధాని, హోం మంత్రితో పాటు ఇతర బిజెపి నేతలకు ఇసి నోటీసులు ఇవ్వాలని మేము డిమాండ్ చేస్తున్నాము. వీరిలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్ తదితర నాయకులు కూడా ఉన్నారు

మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభ ఎన్నికలపై..

మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)తో సీట్ల సర్దుబాటులో భాగంగా సిపిఎం రెండు స్థానాలకు పోటీ చేస్తోంది. ఈ రెండూ గిరిజన స్థానాలే. థానే-పాల్ఘార్ జిల్లాలోని దహాను (ఎస్టీ) స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే వినోద్ నికోలే పోటీలో ఉన్నారు. నాసిక్ జిల్లాలోని కల్వన్ (ఎస్టీ) స్థానం నుండి జెపి గవిట్ రంగంలో నిలిచారు. ఈయన ఇదే స్థానం నుండి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గత ఎన్నికలలో రెండో స్థానంలో నిలిచారు. వీటితో పాటు సోలాపూర్ సిటీ సెంట్రల్ స్థానంలో పార్టీ స్నేహపూర్వక పోటీకి దిగింది. అక్కడ సీనియర్ నేత, మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన నరసయ్య ఆదాం పోటీలో ఉన్నారు.

జార్ఖండ్‌లో ఇండియా వేదికకు నేతృత్వం వహిస్తున్న జెఎంఎం పార్టీ సిపిఎంతో చర్చలకు ఎలాంటి చొరవ చూపలేదు. ఈ నేపథ్యంలో పార్టీ తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను నిలిపింది. వీటిలో ఐదు ఎస్టీ, ఒక ఎస్సీ స్థానం ఉన్నాయి. మిగిలిన స్థానాలలో బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించే సత్తా ఉన్న అభ్యర్థులకు పార్టీ మద్దతు ఇస్తుంది.

ఎరువుల కొరత

రబీ సీజన్‌లో రైతాంగ అవసరాల కోసం తగినంత డిఎపి ఎరువును అందుబాటులో ఉంచాల్సి ఉండగా ఆ విషయంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. పెద్ద ఎత్తున డిఎపి ఎరువుకు కొరత ఏర్పడడంతో రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. గత సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో 34.5 లక్షల టన్నుల డిఎపిని దిగుమతి చేసుకోగా ఈ ఏడాది అదే కాలంలో కేవలం 19.7 లక్షల టన్నులు మాత్రమే దిగుమతి అయ్యాయి. ఇటు దేశీయ ఉత్పత్తి కూడా పడిపోయింది. అక్టోబర్ 1వ తేదీ నాటికి 15-16 లక్షల టన్నుల డిఎపి మాత్రమే నిల్వ ఉంది. అప్పటికి 27-30 లక్షల టన్నులు అవసరమవుతాయని సిఫార్సులు ఉన్నాయి. అక్టోబర్ మధ్య నుండి డిసెంబర్ మధ్య నాటికి 60 లక్షల టన్నుల డిఎపి ఎరువుకు డిమాండ్ ఉంటుందని అంచనా.

డిఎపితో పాటు యూరియా, ఎంఓయూకు కూడా కొరత ఏర్పడింది. 50 కిలోల డిఎపి బస్తాకు ప్రభుత్వం రూ.1,350 ధర నిర్ణయించగా రైతులు దానికి అదనంగా రూ.300-500 చెల్లించాల్సి వస్తోంది. వైఫల్యాన్ని అంగీకరించి, తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం నానో-యూరియా, నానో-డీఏపీ ఎరువులపై ప్రచారం చేస్తోంది. అయితే ఈ ఎరువుల సమర్థత ప్రశ్నార్థకంగానే ఉంది.

దేశీయంగా యూరియా, డీఏపీ ఎరువులను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నియంత్రణ ఎత్తివేయడం, పెట్టుబడి వ్యయం పెరగడంతో ఎరువుల ధరలు పెరుగుతుండడం ప్రధాన సమస్యగా ఉంది.

ఉపాధి కార్మికుల హక్కులపై దాడులు

డిజిటలైజేషన్ పేరుతో నరేగా కార్మికులుగా పనిచేస్తున్న పేదల హక్కులపై దాడి జరుగుతోంది. గత రెండు సంవత్సరాలలో ఎనిమిది కోట్ల మంది రిజిస్టర్డ్ కార్మికులను తొలగించి, వారికి పని ప్రయోజనాలను నిరాకరించారు. ఇది చట్టాన్ని ఉల్లంఘించడమే. ఈ ఏడాది బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి జిడిపిలో శాతంగా చూసినప్పుడు కేటాయింపులు తగ్గాయి. సాంకేతికత పేరిట సమస్యలు సృష్టించడంతో పాటు బడ్జెటరీ కేటాయింపులు కుదించడం గ్రామీణ పేద కుటుంబాల చట్టబద్ధమైన హక్కులపై దాడి చేయడం తప్ప మరొకటి కాదు. ప్రస్తుతం సంవత్సరానికి 100 రోజుల పని కల్పిస్తుండగా దానిని కనీసం 150 రోజులకు పెంచాలని ఈ ఏడాది ప్రారంభంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది. బడ్జెట్ కేటాయింపులు కూడా పెంచాలని సూచించింది. ఈ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాల్సి ఉంది.

24వ అఖిలభారత మహాసభకు సన్నాహాలు

2022 ఏప్రిల్‌లో జరిగిన పార్టీ అఖిలభారత మహాసభలో రూపొందించిన రాజకీయ-వ్యూహాత్మక ఎత్తుగడల పంథా అమలుపై కేంద్ర కమిటీ చర్చించి రాజకీయ సమీక్షా నివేదికను రూపొందించింది. వచ్చే సంవత్సరం ఏప్రిల్ 2 నుండి 6వ తేదీ వరకూ మదురైలో జరగనున్న పార్టీ 24వ అఖిలభారత మహాసభ కోసం రూపొందించే ముసాయిదా రాజకీయ తీర్మానానికి ఇదే ప్రాతిపదిక. పార్టీ మహాసభలకు రాష్ట్రాల వారీగా హాజరు కావాల్సిన ప్రతినిధుల కోటాను కూడా కేంద్ర కమిటీ ఖరారు చేసింది. రాబోయే రాష్ట్ర మహాసభలలో వీరిని ఎన్నుకుంటారు.

'పిఎం విద్యా లక్ష్మి'కు ఆమోదం

- ఎఫ్‌సిఐ మూలధన పెట్టుబడి కోసం రూ.10,700 కోట్లు ఈక్విటీ : కేంద్ర మంత్రి వర్గం నిర్ణయాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉన్నత విద్యా సంస్థల్లో చేరే ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసేందుకు 'పిఎం విద్యాలక్ష్మి' పథకానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశం వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ విలేకరులకు వెల్లడించారు. పిఎం విద్యాలక్ష్మి పథకం కింద ఉన్నత విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పొందిన వారు ఆయా సంస్థల్లో చదువుకునేందుకు 'విద్యా లక్ష్మి పథకం' ద్వారా రుణాలు పొందవచ్చన్నారు. ఈ రుణాలకు కొలేటరల్, గ్యారంటర్ అవసరం లేదని అన్నారు. దేశవ్యాప్తంగా 860 ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ హామీతో రూ.7.50 లక్షల వరకూ రుణం పొందవచ్చు. రుణంలో 75 శాతం బ్యాంకులకు కేంద్రం గ్యారెంటీ ఇస్తుంది. ఈ పథకం కింద ఏటా గరిష్టంగా 22 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారని తెలిపారు. వార్షిక కుటుంబ ఆదాయం రూ.8 లక్షల వరకూ ఉన్నవారికి ఈ పథకం వర్తింపజేయనున్నారు. పిఎం విద్యా లక్ష్మి పోర్టల్ ద్వారా విద్యార్థులు నేరుగా రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఎఫ్‌సిఐకి మూలధన పెట్టుబడి కోసం రూ.10,700 కోట్లు ఈక్విటీ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ)కు మూలధన పెట్టుబడి కోసం రూ.10,700 కోట్ల ఈక్విటీని సమకూర్చడానికి ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ఎఫ్‌సిఐ తక్షణ ఆర్థిక అవసరాల కోసం స్వల్ప కాలిక రుణాలపై ఆధారపడుతోందని, ఇప్పుడు లభించే ఈక్విటి సంస్థ వడ్డీ భారాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. తద్వారా కేంద్ర ప్రభుత్వ సబ్సిడీని కూడా తగ్గిస్తుందని అన్నారు.

ఐక్యంగా పోరాడండి

(మొదటి పేజీ తరువాయి)

ఫారెస్ట్‌లో తవ్విన గోతులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో సిపిఎం మండల కార్యదర్శి వీరశేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజానీకం చేస్తున్న ఆందోళనలకు అండగా ఉంటామని ప్రకటించారు. అవసరమైతే జిల్లా బంద్ చేస్తామని అన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ నిర్బంధాల ద్వారా ప్రజలను లొంగదీసుకోవాలని చూస్తే బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. యురేనియం సమస్య దేవనకొండ సమస్య మాత్రమే కాదని జిల్లా సమస్య అని తెలిపారు. గతంలో నల్లమలలో, ఆళ్లగడ్డలో యురేనియం తవ్వకాలు చేపట్టాలని చూస్తే ప్రజలు తిరగబడ్డారని గుర్తు చేశారు. యురేనియం తవ్వకాల వల్ల వెలువడే రేణువులు ఎంతో ప్రమాదకరమైనవని,వీటి ప్రభావం వల్ల మనుషులు చనిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బలవంతంగా బోర్లు వేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఈ విషయంపై ముఖమంత్రికి లేఖ రాస్తామని తెలిపారు. కప్పట్రాళ్లలో ప్రజలను బెదిరించడానికి పోలీసులను పెడతారా? ఇది ప్రభుత్వానికి ధర్మమేమా? అని ప్రశ్నించారు. అటవీ భూమిలో గంప మన్ను వేయడానికి లేదని, చెన్నకేశవ స్వామి దేవస్థానికి విద్యుత్ కోసం స్తంభాలు ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వలేదని, అలాంటిది యురేనియం తవ్వకాలకు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ యురేనియం తవ్వకాలను ఆపాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు డిమాండ్ చేశారని, ఇప్పుడు సిఎంగా, ఎన్‌డిఎలో భాగస్వామిగా ఆయన యురేనియం తవ్వకాలను ఆపడానికి బాధ్యత తీసుకోవాలని కోరారు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ యురేనియం తవ్వకాలు ఆపాలని అమిత్ షాను కోరాలని, పర్యావరణ శాఖ మంత్రిగా ఉన్న ఆయన కప్పట్రాళ్లలో పర్యటించి ప్రజలతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల సమావేశంలో కప్పట్రాళ్ల ఆందోళనను బలపరుస్తూ తీర్మానం చేస్తామన్నారు. చంద్రబాబును కలిసి గతంలో ఆయన డిమాండ్ చేసినట్లు యురేనియం తవ్వకాలు ఆపాలని కోరతామన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నరసింహులు మాట్లాడుతూ యురేనియం సమస్య మనుషుల, జంతువుల ప్రాణాలకు సంబంధించిన సమస్య అని పేర్కొన్నారు. కడప జిల్లాలో యురేనియం తవ్వకాలతో ప్రజలు రోగాల బారిన పడ్డారన్నారు. కప్పట్రాళ్ల గ్రామ పెద్ద రవీంద్ర శర్మ మాట్లాడుతూ 2018లోనే కప్పట్రాళ్ల పేరు అంతర్జాతీయ యురేనియం వెబ్‌సైట్‌లో ఉందన్నారు, 2019లో కప్పట్రాళ్లలో నాణ్యమైన యురేనియం ఉన్నట్లు ఒక సంస్థ జర్నల్‌లో ప్రచురించిందని గుర్తు చేశారు. గ్రామ టిడిపి నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ యురేనియం సమస్య వల్ల 15 రోజులుగా 12 గ్రామాల ప్రజలు నిద్రపోవడం లేదన్నారు. టిడిపి జిల్లా నాయకులు వచ్చి తవ్వకాలు చేయబోమని చెప్పారని, అది ఎంతవరకూ నిజమో స్పష్టత ఇవ్వాలని కోరారు. తమకు కమ్యూనిస్టు పార్టీల సహకారం అవసరమన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఐ రాష్ట్ర నాయకులు కె.రామాంజనేయులు, ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, కెవి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా అధ్యక్ష పీఠంపై మళ్లీ ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

సెనెటర్ అయిన జెడి వాన్స్‌ను ఉపాధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్ ప్రకటించారు. 2016 ఎన్నికల్లో హిల్లరీ క్లింటన్‌పై విజయం సాధించిన ట్రంప్ ఈసారి కమలా హారిస్‌పై గెలుపొందారు. ఈ ఇద్దరు మహిళలు డెమోక్రటిక్ పార్టీ తరపునే పోటీచేసి ఓడారు. ఆనాడు ట్రంప్ కన్నా ప్రజా ఓట్లు హిల్లరీకి ఎక్కువే లభించినా అవసరమైనన్ని ఎలక్టోరల్ ఓట్లు సాధించలేకపోయారు. ఈసారి కమలా హారిస్ రెండింటిలో వెనుకబడ్డారు. కాగా తాజా ఎన్నికల్లో కమలా హారిస్ న్యూ హాంప్‌షైర్‌లో గెలుపొందారు. గత రెండు దశాబ్దాలుగా ఆ రాష్ట్రం డెమోక్రాట్లకే మొగ్గు చూపుతూ వస్తోంది. మిన్నెసొటాలో కూడా ఆమె విజయం సాధించారు. సెనెట్‌లో మొదటిసారిగా రిపబ్లికన్లు మెజారిటీ సాధించారు. ట్రంప్ విజయం సాధించిన వార్తలు వెలువడగానే వాల్‌స్ట్రీట్ స్టాక్‌లు ఒక్కసారిగా పెరిగాయి.

మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం

ఫ్లోరిడాలో తన మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. యుద్ధాలను ఆపుతామని గతంలో ఇచ్చిన హామీని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. తాను ఎన్నికైతే 24గంటల్లోగా ఉక్రెయిన్ ఘర్షణను పరిష్కరిస్తానని, అలాగే గాజాల్లో యుద్ధాన్ని ఆపుతామని ప్రతిన చేశారు. అమెరికా ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారని, దేశ పునర్నిర్మాణం కోసం పనిచేస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు.

పలువురు ప్రపంచ నేతల సందేశాలు

ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్‌లతో సహా పలు దేశాల నేతలు ట్రంప్‌ను అభినందించారు. ఉక్రెయిన్‌కు బలమైన మద్దతు లభించగలదని జెలెన్స్కీ ఆశాభావం వ్యక్తం చేశారు. అద్భుతంగా అధికారంలోకి తిరిగి వచ్చిన ట్రంప్‌కు అభినందనలు అంటూ నెతన్యాహు దంపతులు ట్రంప్‌కు అభినందనలు తెలియచేశారు. ఇజ్రాయిల్, అమెరికా మధ్య శక్తివంతమైన పొత్తు కొనసాగుతుందని పేర్కొన్నారు. ట్రంప్‌తో కలిసి పని చేసేందుకు ఎదురుచూస్తున్నట్లు మాక్రాన్, బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ పేరొన్నారు. నాటో సెక్రటరీ జనరల్ జేన్స్ స్టోలెన్‌బర్గ్ కూడా ట్రంప్‌ను అభినందించారు. ట్రంప్‌కు బలమైన మద్దతుదారు, టెస్లా యజమాని ఎలాన్‌మస్క్ కూడా అభినందనలు తెలియచేశారు. భవిష్యత్ అద్భుతంగా వుండబోతోందని వ్యాఖ్యానించారు.

యుద్ధాలు ఆపుతామన్న హామీలను పరిశీలిస్తాం : రష్యా

యుద్ధాలను ఆపుతామంటూ ట్రంప్ ఇచ్చిన హామీలను అత్యంత జాగ్రత్తగా పరిశీలించాల్సి వుందని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత రాజకీయ నేతల మాటలు మారుతూ వుంటాయి. ట్రంప్ గురించి నిర్ధారణకు రావడానికి ముందుగా ఆయన తీసుకోబోయే నిర్దిష్ట చర్యల గురించి రష్యా వేచి చూస్తుందని అన్నారు. ట్రంప్ శాంతి ఆకాంక్షలు అభినందించాల్సినవే, అయితే అవి సాకారమవుతాయా లేదా అనేది ఇప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటు కాగలదన్నారు. తమ అధ్యక్షుడు పుతిన్, ట్రంప్‌ను అభినందించాలనుకుంటున్నారో లేదో తనకు తెలియదని పెస్కోవ్ వ్యాఖ్యానించారు.

పరస్పర గౌరవం ప్రాతిపదికనే సంబంధాలు : చైనా

పరస్పర గౌరం, శాంతియుత సహజీవనం, సమాన అవకాశాలు ప్రాతిపదికనే అమెరికాతో చైనా సంబంధాలు వుంటాయని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ స్పష్టం చేశారు. అమెరికా ఎన్నికలు ఆ దేశ అంతరంగిక వ్యవహారం, అమెరికన్ల ఎంపికను మనం గౌరవించాల్సిందే, ఇక చైనా ఉత్పత్తులపై అమెరికా అదనపు టారిఫ్‌లకు సంబంధించి ఇప్పుడే ఏం చెప్పలేమని అన్నారు.

ప్రజాస్వామ్యాన్ని గౌరవించాల్సిందే : లూలా డసిల్వా

బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా అభినందనలు తెలియచేస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ప్రజాస్వామ్యమనేది ప్రజల వాణి, దాన్ని ఎప్పుడూ గౌరవించాల్సిందేనని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రపంచానికి చర్చలు, సమిష్టి కృషి అవసరమని నొక్కి చెప్పారు. లాత్వియా అధ్యక్షుడు ఎడ్గర్స్ రింక్‌విస్ మాట్లాడుతూ ట్రంప్‌కు అభినందనలు తెలియచేశారు. యూరప్‌కు బలమైన అమెరికా అవసరమన్నారు. అలాగే అమెరికాకు బలమైన యూరప్ అవసరమని అన్నారు. లిథుయేనియా అధ్యక్షుడు గిటానస్ నాసెడా మాట్లాడుతూ, అట్లాంటిక్ ప్రాంత ఐక్యత చాలా కీలకమని వ్యాఖ్యానించారు.

అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ 'వడ్లూరు' అల్లుడు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ తరపున ట్రంప్ కేబినెట్‌లో ఉపాధ్యక్షునిగా గెలుపొందిన జేడీ వాన్స్ భార్య చిలుకూరి ఉష ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామానికి చెందిన వారు కావడం విశేషం. వాన్స్ ఎన్నికైన నేపథ్యంలో ఆయన భార్య ఉషా చిలుకూరి పేరు ఒక్కసారిగా మండలంలో మారుమోగింది. ఈ సందర్భంగా వడ్లూరు మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. సుమారు నాలుగు దశాబ్దాల ముందు ఉష పూర్వీకులు ఈ గ్రామంలో నివసించేవారని, వారి వారసుల ఆదేశాలతో వారింటి స్థలంలో కల్యాణ మండపం, సాయిబాబా దేవాలయం నిర్మించినట్లు తెలిపారు. సర్పంచ్ రఘుమండ తేజశ్రీ మాట్లాడుతూ.. తమ గ్రామ ఆడపడుచు భర్త అమెరికా ఉపాధ్యక్షుడు కావడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

హిమాచల్‌ప్రదేశ్ పిసిసి రద్దు

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి)ను బుధవారం రద్దు చేశారు. పిసిసితో పాటు రాష్ట్రంలోని అన్ని బ్లాక్, జిల్లా యూనిట్లను రద్దు చేస్తూ కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని మేరకు కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించింది. ఈ రద్దు తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. రాష్ట్రంలో పార్టీని పునర్నిర్మించాలనే యోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. "రాష్ట్రంలోని పిసిసి యూనిట్‌తో పాటు జిల్లా, బ్లాక్ కమిటీలు రద్దు చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. దీనికి పార్టీ అధిష్ఠానం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుంది" అని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుతం పీసీసీగా చీఫ్‌గా ఉన్న ప్రతిభా సింగ్‌ను ఇటీవల సీడబ్ల్యూసీలోకి తీసుకున్న సంగతి తెలిసిందే.

దేశ ప్రజలపై మోడీ సర్కార్‌కు ఆసక్తి లేదు



హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో పి.సుందరయ్య రెండో స్మారకోపన్యాసంలో ప్రసంగిస్తున్న ప్రముఖ ఆర్థిక వేత్త, ప్రొఫెసర్ ఉత్స పట్నాయక్

- కార్పొరేట్ల ఒత్తిడికి లొంగిపోయింది
- వ్యవసాయ చట్టాల వెనుక సంపన్న దేశాల హస్తం
- దేశ వ్యవసాయ మార్కెట్ స్వాధీనానికి బహుళజాతి సంస్థలు ప్రయత్నం
- సుందరయ్య స్మారకోపన్యాసంలో ప్రముఖ ఆర్థిక వేత్త ఉత్స పట్నాయక్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని సొంత ప్రజలపై మోడీ సర్కార్‌కు ఆసక్తి లేదని, ఎంతసేపూ కార్పొరేట్లు, బహుళజాతి సంస్థల సేవలోనే ఉన్నారని ప్రముఖ ఆర్థిక వేత్త, ప్రొఫెసర్ ఉత్స పట్నాయక్ అన్నారు. బుధవారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పి.సుందరయ్య రెండో స్మారకోపన్యాసం జరిగింది. ప్రొఫెసర్ ఉత్సా పట్నాయక్ స్మారకోపన్యాసం చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాల వెనుక అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల ప్రయోజనాలే ఉన్నాయని పేర్కొన్నారు. తమ పౌరులకు ఆహార భద్రత కల్పించే హక్కును భారతదేశం వంటి దేశాలకు అభివృద్ధి చెందిన దేశాలు నిరాకరించడానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు.

అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యవసాయాన్ని వైవిధ్యపరిచే అవకాశం లేని, భారతదేశంలో, ఇతర ప్రాంతాలలో తమకు అవసరమైన పంటలను ఉత్పత్తి చేసి లాభాలు పొందాలని ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం తన సొంత ప్రజలను రక్షించడానికి ఆసక్తి చూపలేదని, అభివృద్ధి చెందిన దేశాలు, కార్పొరేట్ల ఒత్తిడికి లొంగిపోయిందని అన్నారు. రైతుల తీవ్ర ప్రతిఘటన ఫలితంగా మోడీ ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాల్సి వచ్చిందని, కానీ అభివృద్ధి చెందిన దేశాలు, బహుళజాతి సంస్థలకు మింగుడు పడటం లేదని పేర్కొన్నారు. వారు భారతదేశ వ్యవసాయం, వ్యవసాయ మార్కెట్లను వివిధ మార్గాల్లో స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారని వివరించారు. ఇందుకోసం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)ను ప్రయోగిస్తున్నారని, నయా ఉదారవాద ఆర్థిక విధానాలు భారతదేశ ప్రజల పోషకాహార స్థితిని ప్రతికూలంగా ప్రభావితం చేశాయని అన్నారు. దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం మంది ప్రజలు పోషకాహార లోపంతో ఉన్నారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. కానీ దేశంలో ప్రజలకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని, ప్రజల ఆహార భద్రత హక్కును కల్పించేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అందుకే దేశంలో ఆకలి చావులు పెరుగుతున్నాయని, గ్రామీణ నిరుద్యోగం పెరుగుతోందని అన్నారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వంలో చలనం రావటంల లేదని, ఎంతసేపూ కార్పొరేట్ల జపం చేయడంలో ఉత్సహం చూపిస్తోందని అన్నారు. వ్యవసాయ లేకుండా గ్రామీణాభివృద్ధి సాధ్యం కాదని, అలాంటి వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లిందని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, కానీ ప్రభుత్వం రైతుల ఆత్మహత్యలను లెక్కించకుండా, రైతుల ఆత్మహత్యలు జరగలేదని చెప్పే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) రైతుల మరణాలను, ఆత్మహత్యలను లెక్కించటం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ నేతలు అశోక్ దావలే, విజు కృష్ణన్, హన్నన్ మొల్లా, పి. కృష్ణప్రసాద్, నితీష్ విలత్ తదితరులు మాట్లాడారు.

దద్దరిల్లిన కలెక్టరేట్లు

- విద్యారంగ సమస్యలపై ఉద్యమించిన విద్యార్థులు
- అనంతపురం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలువురి అరెస్టు
- స్పందించకపోతే 'చలో అసెంబ్లీ' : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు



పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- యంత్రాంగం

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులు రోడెక్కారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లను ముట్టడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, పెరిగిన ధరలకనుగుణంగా మెస్‌ఛార్జీలు రూ.3 వేలకు పెంచాలని, జిఒ నంబర్ 77 రద్దు చేయాలని, పిజి విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతపురం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎస్ఎస్ఐ నాయకులను బలవంతంగా అరెస్టు చేసి జీపుల్లో ఎక్కించారు. పలువురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. 20 మందికి 41 నోటీసులు ఇచ్చారు. అనంతరం విడుదల చేశారు. పార్వతీపురంలో ఏడుగురు ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అనంతపురంలో వందలాది మంది విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. విద్యార్థులను, ఎస్ఎఫ్ఐ నాయకులను బలవంతంగా రోడ్డుపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లి పోలీసులు జీపుల్లో ఎత్తిపడేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధు, ఓతూరు పరమేష్‌తో పాటు పలువురు నాయకులను అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని, దీనిని అమలు చేయాలని కోరితే బలవంతంగా అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్ల విద్యా, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రాల్లో మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని, తల్లికి వందనం కింద ఇస్తామన్న రూ.15 వేల వెంటనే విడుదల చేయాలని కోరారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించకుంటే విద్యార్థులతో కలిసి 'చలో అసెంబ్లీ' చేపడతామని హెచ్చరించారు.

పార్వతీపురం మన్యం జిల్లా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీ చేపట్టిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, వారు రోడ్డుపై బైఠాయించారు. ఎస్ఎఫ్ఐ నాయకులతో పోలీసులు వాగ్వివాదానికి దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. తోపులాటలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. నలుగురైదుగురు విద్యార్థులు సొమ్మసిల్లి పడిపోయారు. కలెక్టరేట్‌లోకి ఐదుగురిని మాత్రమే అనుమతినిస్తామని పోలీసులు చెప్పడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు అంగీకరించలేదు. అధికారులు బయటకు వచ్చి తీరాలని పట్టుబట్టారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ విద్యార్థుల వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెండు వారాల్లో స్థానిక సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ధర్నా అనంతరం పోలీసులు ఏడుగురు ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి అనంతరం విడిచిపెట్టారు.

గుంటూరులో నిర్వహించిన ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ కుమార్ మాట్లాడారు. యూనివర్సిటీల్లోని ఖాళీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన పల్నాడు జిల్లా నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. పల్నాడులో కలెక్టరేట్ వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ధర్నాకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మద్దతు తెలిపి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కాకినాడ, అమలాపురంలో కలెక్టరేట్ వద్ద విద్యార్థులు ధర్నా చేపట్టారు. అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. నర్సీపట్నంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కడప, అన్నమయ్య, తిరుపతి, ఏలూరు కలెక్టరేట్ల వద్ద ధర్నా చేశారు. విజయనగరంలో ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 113 మండలాల్లో, 19 కలెక్టరేట్ల విద్యార్థులు ధర్నా చేశారు.

ప్రశ్నించే గొంతుని అణచివేయడం సరికాదు : ఎస్ఎఫ్ఐ

అరెస్టులు చేయడాన్ని, అనంతపురంలో నోటీసులు ఇవ్వడాన్ని, పార్వతీపురంలో కేసులు నమోదు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఇది ప్రశ్నించే గొంతులను అణచివేయడమేనని, ఇది సరికాదని పేర్కొంది.

పోరాట విజయం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నెల 28, 29, 30 తేదీల్లో మండల కేంద్రాల్లో, బుధవారం కలెక్టరేట్ల వద్ద ఆందోళనలతో ప్రభుత్వం స్పందించింది. పెండింగ్ బకాయిలను యాజమాన్యం ఖాతాల్లో వేస్తామని రాష్ట్ర కేబినెట్ ప్రకటించింది. ఎప్పుడు జమ చేసేదీ స్పష్టత ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ కోరారు. ఇప్పటికే విద్యార్థులు కళాశాల ఫీజులు చెల్లించి ఉంటే వాటిని విద్యార్థులకు తిరిగి చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే మరో దఫా ఉద్యమానికి పిలుపునిస్తామని తెలిపారు.



మీకోసం

ప్లాస్కులు ఎంత కడిగినా దుర్వాసన వస్తుంటే మజ్జిగతో కడిగితే సరిపోతుంది.

జీవన సౌరభం

మేఘాలు అడ్డుపడినంత మాత్రాన సూర్యుని వెలుగు తగ్గదు. పరాజయాలు ఎదురైనంత మాత్రాన విజయం అందకుండా ఉండదు.

కాకా పట్టడం




విశ్వం ఉదయాన్నే మనవరాలు శ్రీజని చూద్దామని అడవివరం బయలుదేరాడు. కూతురు రాజ్యం ఇంటికి చేరుకుని మనవరాలి అల్లరి పనులన్నీ గమనించాడు. తాతని చూస్తూనే శ్రీజ పరుగున వచ్చి అల్లుకుపోయింది. మురిపెంగా తనని ఎత్తుకున్న విశ్వం, భార్య ఇచ్చిన చేగోడీలు తన చేతిలో పెట్టాడు. తాతయ్య చెయ్యి పట్టుకుని ఇంట్లోకి తీసుకువెళ్ళి బోలెడన్ని కబుర్లు చెప్పి, గీసిన బొమ్మలన్నీ చూపించింది శ్రీజ. 'అమ్మాయి గారు దేనికి కాకా పడుతున్నారో అర్థం కావడంలేదు' అని కూతురు వైపు తల తిప్పి చూశాడు విశ్వం. రాజ్యం సమాధానం చెప్పేలోగా, 'తాతా కాకా అంటే?' అని బుగ్గ మీద వేలేసుకుని అడిగింది అల్లరి మనవరాలు.

'కాకా పట్టడమంటే మంచి చేసుకోవడం, మచ్చిక చేసుకోవడం అని అర్థం' అన్నాడు విశ్వం. ఆ మాటల్లోని అర్థం, అర్థం కాకపోయిన శ్రీజ, 'మరి మరి తాత, ఈసారి నా పుట్టిన రోజుకి పట్టీలు కావాలి' అంది. 'ఓహో అదా సంగతి? అందుకా ఈ కాకా పట్టడాలు. గొప్ప తెలివైన దానివే నువ్వు' అన్నాడు విశ్వం మనవరాలిని ఎత్తుకుంటూ.

శ్రీజ కోసం ముందుగానే ఊరి నుంచి తీసుకొచ్చిన కొత్త వెండి పట్టీలు సంచిలోంచి తీసి చేతిలో పెట్టాడు. అవి చూసి శ్రీజ ముఖం నిండు జాబిల్లిలా వెలిగిపోయింది. 'మీ మనవరాలు పట్టీల కోసం ఏడవడం, మీరు కాకతాళీయంగా తేవడం బాగుంది నాన్నా' అంది రాజ్యం. తెలుగులోనే కాక మరాఠీలో జాతీయాల్లో 'కాకా మామా కరణేం' అన్న జాతీయం ఉంది. అంటే మనకు బంధువులు కాని వాళ్ళను కూడా కాకా, మామా అని పిలుస్తూ, వాళ్ళను పొగడుతూ, వాళ్ళ ద్వారా పనులు సాధించుకోవడాన్ని ఈ జాతీయం సూచిస్తుంది.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.



బుర్రకి కాస్త పనిచెప్పండి

పిల్లలూ, ఇక్కడ తాళాలు, పక్కనే వాటి చెవిలు ఉన్నాయి కదా! ఏ తాళానికి ఏ చెవి సరిపోతుందో జాగ్రత్తగా పరిశీలించండి. ఆ చెవిలో సరైన తాళం అంకెను వేయండి. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం.

నేను గీసిన బొమ్మ



సానా.పి.షాన్వి,
1వ తరగతి,
అరవిందహైస్కూల్
సిబిఎస్ఇ,
కుంచనపల్లి,
గుంటూరుజిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

శిశు ఆరోగ్యం.. మంచి భవితవ్యం..

ఆనందం, ఆశ్చర్యం, ఆందోళనలతోపాటుగా మరెన్నో భావనలకు తెరతీస్తుంది శిశు జననం. నూతన శిశువును ఈ ప్రపంచంలోకి ఆహ్వానించటం ఒక అపూర్వమైన మధురానుభవం. ఆరోగ్యంగా ఉన్న తల్లి సంరక్షణలో పిల్లల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. శిశు రక్షణలో మాతృ సంరక్షణ ఒక భాగం. ఆరోగ్యమే మహాభాగ్యం అనేది అందరికీ తెలిసిందే. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యం ప్రధానంగా పరిసరాల పరిశుభ్రతపై ఆధారపడి వుంటుంది. మనం తినే ఆహారం, తాగేనీరు, పీల్చే గాలి కూడా ప్రభావితం చేస్తాయి. రోగకారణాలు, రోగ నివారణ, టీకాలు తదితర విషయాలపై తల్లులకు అవగాహన ఉంటే బిడ్డలను సురక్షితంగా రక్షించుకోవచ్చు.



నవంబర్ 7 : ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవం

ప్రపంచ శిశు రక్షణ దినోత్సవాన్ని ఏటా నవంబరు 7న జరుపుకుంటారు. శిశువుల ఆరోగ్యాన్ని, భద్రతను, సంరక్షణను ప్రాముఖ్యతతో కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రచారం చేస్తారు. జీవిత ప్రారంభంలోనే సరైన సంరక్షణ లభిస్తే, శిశువులు ఆరోగ్యవంతమైన వ్యక్తులుగా ఎదుగుతారు. 'ఉన్నత ప్రమాణాలు: శిశువుల ఆరోగ్యానికి అధిక ప్రాముఖ్యత' అనే థీమ్‌తో ఈ ఏడాది 0కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

శిశు దశే కీలకం

శిశువు శరీర, మానసిక అభివృద్ధి కోసం మొదటి కొన్ని సంవత్సరాలు అత్యంత కీలకం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) లెక్కల ప్రకారం ఏటా 50 లక్షల మంది ఐదేళ్లలోపు చిన్న పిల్లలు మరణిస్తున్నారు. ఇందులో ఎక్కువ శాతం మరణాలు నవజాత శిశువు (పుట్టిన తర్వాత 28 రోజుల్లో) కాలంలోనే సంభవిస్తున్నాయి. సరైన సంరక్షణ పద్ధతులను క్రమపద్ధతిలో పాటిస్తే ఈ మరణాల రేటును బాగా తగ్గించొచ్చు. తల్లి సరైన పోషకాహారం తీసుకోకపోవటం, సరైన ఆరోగ్య పద్ధతులను అవలంబించకపోవటం వల్ల శిశువులు సైతం దీర్ఘకాలిక అనారోగ్యాలకు గురవుతారు. ఫలితంగా తక్కువ బరువు, ప్రీమెచ్యూరిటీ (ముందుగా పుట్టడం), జనన లోపాలు వంటి పరిస్థితులు ఎదురవుతాయి.



- డాక్టర్ డి.ఇంద్రాణి,
పిల్లల ప్రసూతి వైద్య ప్రత్యేక నిపుణురాలు
97032 12170



మొదటి 1000 రోజుల సంరక్షణ కీలకం

అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 1000 రోజుల వరకూ పిల్లల సంరక్షణ ఎంతో కీలకం. పుట్టుక నుంచి రెండో పుట్టినరోజు వరకూ చిన్నారుల పెరుగుదల, అభివృద్ధి, ఆరోగ్యం అంతా అత్యంత కీలకం. ఈ సమయంలో తీసుకునే ఆహారం, ఆరోగ్య సంరక్షణ శిశువుల భవిష్యత్తు సామర్థ్యంపై ప్రభావాన్ని చూపిస్తాయి.

తల్లి పాలే ఇవ్వాలి : పుట్టిన వెంటనే తల్లి పాలతోనే ఆరంభం చేయాలి. తల్లి పాలలో శిశువుకి కావాల్సిన పోషకాలు అందుతాయి. ఆరునెలల పాటు కేవలం తల్లి పాలే ఇవ్వడం మంచిది.

టీకాలు వేయించాలి : అనేక వ్యాధుల్ని వ్యాక్సిన్ల ద్వారా అడ్డుకోవచ్చు. పిల్లలకు వ్యాధులు సులభంగా సోకుతాయి. అందుకే టీకాలు సమయానికి ఇవ్వడం అనివార్యం.

పరిశుభ్రత పాటించాలి : శిశువుల చుట్టూ పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యం. పరిశుభ్రమైన నీరు, ఆహారం, ఆరోగ్యకరమైన పరిసరాలు వారికి ఆరోగ్యకరమైన జీవనశైలిని అందిస్తాయి.

మంచి నిద్ర : శిశువులు సాధారణంగా ఎక్కువగా నిద్రపోవాలి. మంచి నిద్ర వారి ఆరోగ్యాన్ని కాపాడుతుంది, మానసిక వికాసాన్ని ప్రోత్సహిస్తుంది.

తల్లిదండ్రుల బాధ్యత : శిశువులను ప్రేమగా, జాగ్రత్తగా చూసుకోవడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత. వారి భవిష్యత్తు కోసం వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడం చాలా ముఖ్యమైంది.

తల్లిదండ్రులకు సూచనలు

శిశువుల సంరక్షణలో కీలకంగా ఉండేది తల్లిదండ్రులే. సకాలంలో అందాల్సిన ఆహారాన్ని ఇవ్వటం, పిల్లల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం, అనారోగ్యంతో ఉంటే దానికి అవసరమైన చర్యలు తీసుకోవటంలో కీలక పాత్ర తల్లిదండ్రులదే. ఇలాంటి చర్యల ద్వారా మనం శిశువుల ఆరోగ్యం కాపాడుకోవడంలో భాగస్వాములమవుతాం.

వైద్యులను సంప్రదించడం : శిశువు ఆరోగ్యం, శరీర వికాసం గురించి ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలి. వారానికి ఒకసారైనా వైద్యుల పర్యవేక్షణ ఉంటే మంచిది.

పోషకాహారం : తల్లి పాలు ఆరునెలల వరకూ ఇవ్వాలి, ఆ తరువాత ఆహారంలో పోషకాలను జోడించాలి.

గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే పోషకాహారం, శిశువుకి పుట్టుక తరువాత ఆరోగ్యాన్ని నిర్ధారిస్తుంది. ఈ సమయంలో ప్రసూతి నిపుణులు, ఫిజియోథెరపిస్టులు తల్లులకు సరైన ఆహార నియమాలు, వ్యాయామాలు సూచిస్తారు. తల్లి బలంగా ఉండడం ద్వారా పుట్టబోయే శిశువుకు కూడా ఆరోగ్యం మెరుగుపడుతుంది.

వ్యాయామాలు : ప్రసవం తర్వాత తల్లులు శిశువును ఎత్తుకోవటం, సరిగ్గా నిర్వహించడం వంటి పనుల్లో మరింత జాగ్రత్త అవసరం. ఫిజియోథెరపిస్టులు తల్లుల శరీరంలోని బలహీన ప్రాంతాలను మెరుగుపరిచే ప్రత్యేక వ్యాయామాలను సూచిస్తారు. తద్వారా శిశువుల సంరక్షణలో తల్లులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

వ్యాధి నిరోధకత పెంపు : తల్లులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడంతో, శిశువులు కూడా వ్యాధులకు 0ఆమడ దూరంలో ఉంటారు. గర్భిణీలకు ఇవ్వబడే ఫిజియోథెరపీ సలహాలు, శిశువుల వ్యాధి నిరోధకతను పెంచుతాయి. పిల్లల అభివద్ధి కోసం ప్రత్యేకమైన ఫిజియోథెరపీ పద్ధతులు ఉంటాయి. ఉదాహరణకు, శిశువు మెడ, వెన్నెముక, కండరాల వికాసం మెరుగుపరచడానికి బేబీ బాండింగ్ యాక్టివిటీస్ సూచిస్తారు. అవసరమైన వ్యాయామాలు చేయడం చాలా అవసరం.



మీ దగ్గర కథలున్నాయా?

ప్రభాస్ తాజాగా సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన షేర్ చేశారు. ప్రభాస్ అన్న ప్రమోద్‌తో కలిసి ఆయన 'స్క్రిప్ట్ క్రాఫ్ట్' అనే సంస్థను ప్రారంభించారు. ఈ విషయాన్నే షేర్ చేస్తూ.. 'మీ దగ్గర కథలు ఉన్నా అవకాశం రావట్లేదా? మీ లాంటి వాళ్ళ కోసమే ఒక వెబ్‌సైట్‌ను తీసుకొస్తున్నాము. ఆ వెబ్‌సైట్‌లో మీ కథను లేదా సినాప్సిస్‌ని అప్లోడ్ చేస్తే ఆడియన్స్ వాటికి రియాక్ట్ అవుతారు. అలా ఎక్కువ రియాక్షన్స్ వచ్చిన స్టోరీని సినిమాగా తెరకెక్కిస్తాము' అని తెలిపారు.

రెండు భాగాలుగా 'రామాయణ'

బాలీవుడ్ తెరకెక్కిస్తున్న 'రామాయణ' గురించి తాజా అప్డేట్ ఒకటి బయటికి వచ్చింది. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్ర విడుదల తేదీలు తెలుపుతూ తాజాగా చిత్రబృందం పోస్టర్స్ విడుదల చేసింది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగం విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రణబీర్‌కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. రావణుడిగా కన్నడ హీరో యశ్ నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని యశ్ నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, నమిత్ మల్హోత్రా నిర్మాణ సంస్థ ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా కలిసి నిర్మిస్తున్నాయి.





'సేవియర్' ఫస్ట్ లుక్

భారత క్రికెట్ జట్టు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, నటి ఓవియా నటించిన తమిళ చిత్రం 'సేవియర్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా చిత్ర యూనిట్ విడుదల చేసింది. వీటీవీ గణేష్, జీబీ ముత్తు తదితరులు నటించిన ఈ చిత్రాన్ని దర్శకుడు జాన్ పాల్ రాజ్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను సెంటోవా స్టూడియో నిర్మిస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులను త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. ఒక రాత్రిలో జరిగే 12 హత్యల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని తెలుస్తోంది. 'ఫ్రెండ్‌షిప్' సినిమా తర్వాత హర్భజన్, జాన్ పాల్ రాజ్‌ల కలయికలో ఇది రెండవ సినిమా.

చనిపోతాననుకున్నా

'క్యాన్సర్‌కు చికిత్స తీసుకున్న రోజులు నాకు ఇంకా గుర్తున్నాయి. అప్పుడు బాధ, నొప్పిని అనుభవించాను. అవే నాకు చివరి రోజులనుకున్నా. ఎలాంటి లక్షణాలు లేకుండా ఈ మహమ్మారి నాలో చివరి దశలో ఉందని తెలిసింది. మొదట అందరిలాగే భయపడ్డాను. చనిపోతాననుకున్నా. న్యూయార్క్‌లో ఉన్న గొప్ప వైద్యులు నాకు చికిత్స అందించారు. ఆరు నెలలు అక్కడే ఉన్నాను. 11 గంటలు ఆపరేషన్ చేశారు. కీమో థెరపీ గురించి నా కుటుంబానికి కూడా వైద్యులు వివరించారు. వైద్యం కొనసాగుతున్న సమయంలో అమ్మ నా కోసం ఎంతో శ్రమించింది. ధైర్యంగా ఉండు అని ఓదార్చింది. ప్రోత్సహించింది. ఆమె ఇచ్చిన ధైర్యంతోనే నేను ఆ మహమ్మారిని జయించాను' అంటూ బాలీవుడ్ హీరోయిన్ మనీషా కొయిరాలా వ్యాఖ్యానించారు. 2012లో ఆమె అండాశయ క్యాన్సర్ బారినపడ్డారు. మూడేళ్ల చికిత్స అనంతరం 2015లో ఆమె క్యాన్సర్‌ను జయించారు. 2018లో ఆమె 'హీల్డ్ హౌ క్యాన్సర్ గేవ్ మీ న్యూ లైఫ్' అనే పుస్తకాన్ని రాశారు. ప్రస్తుతం ఆమె వరుసగా వెబ్ సిరీస్‌లలో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఇటీవల సంజయ్‌లీలా భన్సాలీ తెరకెక్కించిన 'హీరామండి' వెబ్‌సిరీస్‌లో మల్లికాజాన్‌గా తన నటనతో ఆకట్టుకున్నారు.



మనీషా కొయిరాలా

ఐపిఎల్ వేలం బరిలో 1,574మంది ఆటగాళ్లు

- ఇంగ్లండ్ మాజీ పేసర్ ఆండర్సన్ తొలిసారి నమోదు
- సౌదీ అరేబియాలో నిర్వహణకు ఏర్పాట్లు



ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) మెగా వేలానికి రంగం సిద్ధమైంది. ఈసారి మొత్తం 1574మంది ఆటగాళ్ల వేలం బరిలో నిలిచారు. తొలిసారి మెగా వేలాన్ని సౌదీ అరేబియాలోని జెడ్డాలో నిర్వహించనున్నారు. సోమవారంతో ఆటగాళ్ల నమోదు అధికారికంగా ముగియగా.. మొత్తం 1574 మంది క్రికెటర్లు వేలం కోసం పేర్లు నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందులో 1,165 మంది భారతీయులు, 409 మంది విదేశీయులు ఉన్నారు. గత సీజన్ వరకు కెప్టెన్‌లుగా ఉన్న రిషభ్ పంత్(ఢిల్లీ), కేఎల్ రాహుల్ (లక్నో), శ్రేయస్ అయ్యర్ (కోల్‌కతా)లను ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకోలేదు. ఈ ముగ్గురు స్టార్ ఆటగాళ్ల తమ కనీస ధర రూ.2 కోట్లుగా నిర్ణయించుకున్నారు. రవిచంద్రన్ అశ్విన్, యుజ్వేంద్ర చాహల్, మహ్మద్ షమి, ఇషాన్ కిషన్, దీపక్ చాహర్, వెంకటేశ్ అయ్యర్, అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్, భువనేశ్వర్ కుమార్, ప్రసిద్ధ్ కృష్ణ, నటరాజన్, పడిక్కల్, కృనాల్ పాండ్య, హర్షల్ పటేల్, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, ఖలీల్ అహ్మద్, ఉమేశ్ యాదవ్ కూడా రూ.2 కోట్ల కనీస ధరతో వేలంలో పేరు నమోదు చేసుకున్నారు. యువ క్రికెటర్లు సర్ఫరాజ్ ఖాన్, పృథ్వీ షా బేస్ ధర రూ.75 లక్షలుగా నిర్ణయించుకున్నారు. గత సీజన్‌లో రూ.24.50 కోట్ల ధర పలికిన మిచెల్ స్టార్క్ రూ.2 కోట్ల బేస్ ధరతో వేలంలో ఉన్నాడు. ఇక భారత్ తరఫున వేలం బరిలో నిలిచిన ఆటగాళ్లలో 104మందికి అంతర్జాతీయ క్రికెట్ ఆడిన అనుభవం ఉండగా.. 965మంది దేశవాళీ మ్యాచ్‌లే ఆడారు.

409మంది విదేశీ ఆటగాళ్లలో 48మంది అంతర్జాతీయ క్రికెట్ ఆడిన అనుభవం ఉండగా.. 272మంది దేశవాళీ మ్యాచ్‌లు ఆడి వేలం బరిలో నిలిచారు. అలాగే 152మంది గతంలో ఐపిఎల్‌లో ఆడిన అనుభవం ఉండగా.. ముగ్గురు అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడకున్నా.. ఐపిఎల్‌లో తొలిసాకి రిజిస్టర్ చేసుకున్నారు.

ఐపిఎల్ సీజన్-2025కు వేలం బరిలో విదేశీ ఆటగాళ్ల జాబితా

1. ఆఫ్ఘనిస్తాన్	29	8. నెదర్లాండ్స్	12
2. ఆస్ట్రేలియా	76	9. న్యూజిలాండ్	39
3. బంగ్లాదేశ్	13	10. స్కాట్లాండ్	2
4. కెనడా	4	11. దక్షిణాఫ్రికా	91
5. ఇంగ్లండ్	52	12. శ్రీలంక	29
6. ఐర్లాండ్	9	13. యుఎఇ	1
7. ఇటలీ	1		

తొలిసారి వేలం బరిలో ఆండర్సన్...

ఇంగ్లాండ్ మాజీ పేసర్ జేమ్స్ అండర్సన్ తొలిసారి ఐపిఎల్‌లో తన పేరును నమోదు చేసుకున్నాడు. అతడు రూ.1.25 కోట్ల కనీస ధరతో వేలంలో బరిలో నిలిచాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు (704) పడగొట్టి అండర్సన్... ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. జిమ్మీ తన చివరి టి20 మ్యాచ్ 2014లో ఆడటం విశేషం. 2004లో టి20ల్లోకి అరంగేట్రం చేసిన అండర్సన్.. కెరీర్ మొత్తంలో 44 టి20లే ఆడి 41 వికెట్లు పడగొట్టాడు.

సాకర్ మైదానంలో ఆటగాడిపై పిడుగు

ఒకరి మృతి
ఐదుగురికి తీవ్ర గాయాలు

లిమా(పెరూ): పెరూలో విషాదం చోటుచేసుకుంది. ఫుట్‌బాల్ స్టేడియంలో పిడుగు పడడంతో ఒక ఆటగాడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. పెరూలోని హువాన్ కాయో ప్రాంతంలో మ్యాచ్ మధ్యలో వర్షం పడడంతో రిఫరీ మ్యాచ్‌ను నిలిపివేశాడు. ఆటగాళ్లు తమ డగౌట్‌కు వెళుతుండగా, పెద్ద శబ్దంతో పిడుగుపడింది. దాంతో 34ఏళ్ల పెరూ డిఫెండర్ హ్యూగో-డి-లా-క్రజ్‌పై పిడుగు నేరుగా పడింది. దీంతో క్రజ్‌తోపాటు రిఫరీ కుప్పకూలిపోయాడు. రిఫరీకి తీవ్రగాయాలు కాగా, క్రజ్ అక్కడికక్కడే మరణించాడు. మరో నలుగురికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్షంగా చూసిన అభిమానులు ఒక్కసారి తీవ్ర షాక్‌కు గురయ్యారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ(ఎపిఎస్డీఎంఎ) తన సోషల్ ద్వారా షేర్ చేసింది.



పిడుగుపాటుకు గురైన ఆటగాడు



మైదానంలోనే కుప్పకూలి మృతిచెందిన ఆటగాడు

ఉత్తరాఖండ్ 232/1

ప్రియాన్షు సెంచరీ ● తేలిపోయిన ఆంధ్ర బౌలర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లాలోని స్థానిక చింతలవలస క్రికెట్ అకాడమీలో బుధవారం ప్రారంభమైన రంజీ మ్యాచ్ లో ఉత్తరాఖండ్ ఆధిక్యంలో దూసుకెళ్తుంది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు ఒక వికెట్ కోల్పోయి 232 పరుగులు చేసింది. తొలిరోజు 87 ఓవర్లు ఆడిన ఉత్తరాఖండ్ జట్టు 232 పరుగులు చేసింది. ఈ జట్టు లో ఓపెనర్ అవినాష్ సుధ 86 పరుగులు చేసి ఔట్ కాగా మరో ఓపెనర్ పిఎస్ కందురి 107 పరుగులతో నాటౌట్ గా క్రీజ్ లో ఉన్నాడు. సమరాత్ 30 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. ఆరుగురు బౌలర్లను ఉపయోగించిన ఆంధ్ర జట్టు వికెట్ తీయడంలో విఫలమయ్యారు. ఆంధ్ర జట్టు లో లలిత్ మోహన్ 26 ఓవర్లు వేసి వికెట్ తీసి 83 పరుగులిచ్చాడు.



హైదరాబాద్ 261/5

సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో రాజస్తాన్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో హైదరాబాద్ కెప్టెన్ రాహుల్ సింగ్ మెరిసాడు. ఎలైట్ గ్రూప్-బిలో భాగంగా బుధవారం నుంచి ప్రారంభమైన రంజీట్రోఫీ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి 5వికెట్ల నష్టానికి 261పరుగులు చేసింది. కెప్టెన్ రాహుల్ సింగ్(66) అర్ధసెంచరీకి తోడు ఓపెనర్ తన్మయ్ అగర్వాల్(40), రాహుల్(43నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. క్రీజ్‌లో తన్మయ్‌కి తోడుగా అజయ్(34) ఉన్నారు. రాజస్తాన్ బౌలర్లు అజయ్‌సింగ్‌కు మూడు, దీపక్ చాహర్, అరాఫత్ ఖాన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68